

శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

ఎక్సైజ్ సుంకం తగ్గింపు ప్రకటన.. ఏప్రిల్ 30 వరకు ఆగలేరా?

తగినంత ఎరువుల నిల్వలున్నాయ్

05

సంపుటి 09, సంచిక: 117 | శనివారం | 28-03-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### ‘టీమ్ ఇండియా’ స్ఫూర్తితో

# రాష్ట్రాలతో సమన్వయం




పశ్చిమ ఆసియా సంఘర్షణ నేపథ్యంలో ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా చర్చలు




**న్యూఢిల్లీ :** పశ్చిమ ఆసియా సంఘర్షణ నేపథ్యంలో ఎన్నికలు జరగని రాష్ట్రాలను మినహాయించి, మిగిలిన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఆయా రాష్ట్రాల్లో వారి సన్నద్ధత, ప్రణాళికలను సమీక్షించారు. అయితే ‘టీమ్ ఇండియా’ స్ఫూర్తితో ప్రయత్నాలలో సమన్వయం ఉండేలా చూడటమే ఈ వర్చువల్ సమావేశం లక్ష్యమని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ కూటమి ఇరాన్‌పై జరిపిన దాడితో ప్రారంభమైన పశ్చిమ ఆసియా సంఘర్షణపై ప్రధానమంత్రి ముఖ్యమంత్రులతో ఇలాంటి సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి. ఈ దాడికి ప్రతిగా తరువాయి 12లో

### సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా...

రాష్ట్ర, జిల్లాల్లోనూ కమిటీల ఏర్పాటు.. నోడల్ ఆఫీసర్ల నియామకం

పిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 12

# నేటి నుంచి ఐపిఎల్

**తొలి మ్యాచ్‌లో ఆర్‌సిబి, సన్‌రైజర్స్ ఢీ**




**బెంగళూరు:** ప్రపంచ క్రికెట్ చరిత్రను మార్చివేసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్ మరోసారి అభిమానులను ఆకట్టుకోవడానికి సిద్ధమైంది. శనివారం ప్రారంభమయ్యే 18వ ఐపిఎల్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి), సన్‌రైజర్స్ హైదరాబాద్ ఢీ కొంటాయి. చిన్నస్వామి స్టేడియంలో జరగనున్న ఈ పోరుతో, మొదలయ్యే ఐపిఎల్‌లో మొత్తం పది జట్లు తలపడుతున్నాయి. మే 31 వరకు టోర్నమెంట్, దేశవ్యాప్తంగా 13 స్టేడియాలలో జరుగుతుంది. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించి ఆర్‌సిబి తొలిసారి టైటిల్‌ను గెలుచుకుంది. ఇది ఆ జట్టుకు చారిత్రాత్మక విజయంగా నిలిచింది, ఎందుకంటే ఎన్నో తరువాయి 2లో





భద్రాచలంలో రంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు

భక్తులతో కిక్కిరిసిన భద్రగిరి

రూ.351 కోట్ల పనులకు సిఎం శంకుస్థాపన

# కమనీయం.. రమణీయం

ప్రజాపక్షం/భద్రాచలం

దక్షిణ అయోధ్య భద్రగిరిలో శ్రీ సీతారాముల కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా హాజరై ప్రభుత్వం తరుపున సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భద్రాచలం రామాలయం ప్రాంగణంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించిన లోక కల్యాణానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం గర్భగుడిలోని సీతారాముల ఉత్సవ మూర్తులకు అలంకరణ చేసి ప్రత్యేక పల్లకీలో మేళ తాళాలు, వేద మంత్రోచ్చారణల నడుమ మిథిలా స్టేడియానికి తోడుకొచ్చారు. సిద్ధం చేసిన పెళ్లి పీటలపై ఉత్సవమూర్తులను ఆసీనులను చేసి పెళ్లికి ఉపయోగించే వస్తువులకు ప్రత్యేక పూజలు చేసి సంప్రోక్షణ చేశారు. భక్తరామదాసు చేయించిన పచ్చలహారం సహా పలు ఆభరణాలను స్వామికి, అమ్మవారికి అలంకరించారు. కల్యాణ వైభవాన్ని చాటి చెప్పేలా చూర్ణికలను పఠించిన అనంతరం వేదమంత్రోచ్చారణలు మార్మోగుతుండగా జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సులపై ఉంచారు. ఈ లోక కల్యాణాన్ని కనులారా వీక్షించి తరువాయి 12లో



### కవిత కొత్త పార్టీ ఏర్పాటుకు

# ముహూర్తం ఖరారు

**ఏప్రిల్ 25న ప్రకటన**

అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామని వెల్లడి

ఆడబిడ్డలకు, యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టీకరణ

**కవిత కొత్త పార్టీ ముహూర్తం ఖరారుపై ఫిబ్రవరి 28నే ‘ప్రజాపక్షం’లో ప్రచురితమైన కథనం**

ప్రజాపక్షం/నిజామాబాద్

కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటుకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. మేడ్చల్ జిల్లా కేంద్రంగా ఏప్రిల్ 25న పార్టీ పేరు, ఎజెండా, పార్టీ కార్యాచరణ రూపొందించటం జరుగుతుందని మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కవిత వెల్లడించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ శక్తిగా ఎదగాలన్నదే తెలంగాణ జాగృతి ముఖ్య ఉద్దేశ్యమని, ఇందులో భాగంగానే అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ పార్టీ కార్యాచరణ ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆడబిడ్డలకు, యువతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ తరువాయి 12లో




ఢిల్లీ కోర్టు తీర్పుతో కవితకు బిగ్ రిలీఫ్

ఏప్రిల్ 25న కొత్త పార్టీ?

- వేగంగా పావులు కదుపుతున్న తెలంగాణ జాగృతి అధినేత్రి
- తీర్పును బిఆర్ఎస్ ఖాతాలో వేసుకునే యత్నాన్ని తిప్పికొట్టిన కవిత
- న్యాయం నావైపే ఉంటుందని ఆనాడే చెప్పానని వెల్లడి

ప్రజాపక్షం / హైదరాబాద్

తరువాయి 2లో

ప్రజాపక్షం

epaper.prajapaksham.in

### ఐజెయు జాతీయ 11వ

# ప్లీనరీ సమావేశాలు ప్రారంభం



**విజయవాడకు తరలి వచ్చిన పలు రాష్ట్రాల ప్రతినిధులు!**

**అమరావతి :** దేశంలో అత్యధిక సంఖ్యాక వర్కింగ్ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ 11 వ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం అమరావతిలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఐజెయు జాతీయ కార్యవర్గం సమావేశమైంది. ఐజెయు అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్లీనరీలో చర్చించనున్న వివిధ అంశాలను, ప్రవేశపెట్టనున్న తీర్మానాలను ఖరారు చేశారు. అలాగే ప్లీనరీ సమావేశాలలో సమర్పించనున్న సెక్రటరీ జనరల్ నివేదికను కూడా కార్యవర్గ సమావేశం ఆమోదించింది. సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ నివేదికలోని అంశాలను వివరించారు. సంస్థాగతంగా ఐజెయు నిబంధనావళికి చేయనున్న సవరణలను కూడా కార్యవర్గ సమావేశం చర్చించి ఖరారు చేసింది. ఈ సవరణలపై ప్లీనరీలో చర్చించి ఆమోదిస్తారు. ఐజెయు జాతీయ కార్యవర్గ ఎన్నికలను 29వ తేదీన నిర్వహిస్తారు. యూనియన్ సీనియర్ నాయకుడు ఎమ్‌ఏ మాజిద్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కార్యవర్గ సమావేశం నియమించింది.

**ప్లీనరీకి భారీగా ఏర్పాట్లు**

విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నేటి నుంచి తరువాయి 12లో

# రూ.217 కోట్ల జిఎస్‌టి కుంభకోణం

ప్రజాపక్షం /హైదరాబాద్

షెల్ కంపెనీల ద్వారా రూ.217 కోట్ల భారీ జిఎస్‌టి స్కామ్ హైదరాబాద్‌లో శుక్రవారం వెలుగు చూసింది. కుంభకోణానికి పాల్పడిన ముఠా సభ్యులు ఎపి, తెలంగాణలో 72 షెల్ కంపెనీలను సృష్టించి తద్వారా మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల్లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) అధికారులు భారీ జిఎస్‌టి కుంభకోణాన్ని బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన అధికారులు, ఏకంగా రూ.217 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లుగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న సుమారు 72 షెల్ కంపెనీల నెట్‌వర్క్ తరువాయి 12లో

**72 షెల్‌కంపెనీలపై డిజిజిఐ అధికారుల సోదాలు**






# భారీ సైబర్ క్రైమ్ గుట్టురట్టు

**13 మంది నిందితుల అరెస్టు**

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ అక్రమ లావాదేవీలకు వేదికగా మారుతున్న మ్యూల్ బ్యాంకు ఖాతాల నెట్‌వర్క్‌పై కరీంనగర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0 లో భాగంగా నిర్వహించిన దర్యాప్తులో 24 మంది నిందితులను గుర్తించగా అందులో 13 మందిని శనివారం అరెస్టు చేశారు. ఈ ముఠా ద్వారా సుమారు 138 కోట్ల రూపాయల భారీ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. రత్నాకర్ బ్యాంకు లిమిటెడ్ (ఆర్‌బిఎల్), కో ఆపరేటివ్ సొసైటీ వంటి వర్చువల్ ఖాతాల ద్వారా జరిగిన మోసాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులపై భారత న్యాయ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ ముఠా అత్యంత ప్రణాళికాబద్ధంగా పని చేస్తూ మ్యూల్ ఖాతాల ఏర్పాటును పర్యవేక్షిస్తారు. సామాన్య ప్రజలను డబ్బు ఆశచూపి వారి పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిపిస్తారు. ఈ ఖాతాల ద్వారానే సైబర్ మోసాల సొమ్మును విదేశాలకు మళ్లిస్తారు. కొద్దిపాటి కమీషన్ ఆశతో తరువాయి 12లో

### హార్మూజ్ జలసంధిని తెరవడానికి

# ఇరాన్‌కు మరో పది రోజుల గడువు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** వివిధ దేశాలకు ముడి చమురు, గ్యాస్ రవాణాకు అత్యంత కీకలమైన హార్మూజ్ జలసంధిని ఎలాంటి షరతులు లేకుండా తెరవాలని ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన ఐదు రోజుల గడువును మరో పది రోజులు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. ఏప్రిల్ 7వ తేదీలోగా జలసంధిని తరువాయి 2లో



### నేపాల్ ప్రధానిగా

# బాలెన్ ప్రమాణం

**ఖాట్మండు:** నేపాల్ 47వ ప్రధానిగా బాలేంద్ర షా ‘బాలెన్’ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజకీయ నాయకుడిగా మారిన ర్యాపర్ బాలెన్ 35 ఏళ్ల వయస్సులో, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికై ఈ పదవిని చేపట్టిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ ఖాట్మండులోని శీతల్ నివాస్‌లో మధ్యాహ్నం 12:34 గంటలకు ఆయనకు తరువాయి 2లో

# వామ్మో... ప్రైవేటు వైద్యమా!

**ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజులు, టెస్టుల దోపిడీ**

ఆర్థికంగా చితికిపోతున్న పేద, మద్య తరగతి కుటుంబాలు

సొంత మెడికల్ షాపులు, ల్యాబ్ లతో వైద్యుల దందా

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ

ప్రజాపక్షం/హనుమకొండ

వైద్యం వ్యాపారమై ప్రాణాలు పోసే ఆసుపత్రులు కాసుపత్రులుగా మారాయి. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో అడుగుపెడితే చాలు పేదోడి జేబులు గుల్ల కావాల్సిందే. సందుల్లో, గల్లీల్లో అర్హతలేని వైద్యులు, అనుమతులు లేకుండా విచ్చలవిడిగా పుట్టగొడుగుల్లా ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు. ఓపీ నుంచి స్కానింగ్ లు, ల్యాబ్ లో టెస్టుల వరకు ధరల్లో అంతా సిండికేట్ దందాగా మారింది. కొందరు వైద్యులు ఆర్ఎంపీలతో బేరం కుదుర్చుకుని రోగులను రెఫర్ చేయించుకుంటున్నారు. అంతేకాదు.. మెడికల్ షాపులతో పాటు ల్యాబ్‌లను కూడా బినామీల పేరుతో ఏర్పాటు చేసి వైద్యాన్ని, పేదల తరువాయి 2లో








## పశ్చిమాసియా సంక్షోభంపై జైశంకర్ చర్చలు

**పారిస్ :** ఫ్రాన్స్‌లో జరిగిన జి7 విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ మధ్య చర్చలు జరిగాయి. ఇందులో పశ్చిమాసియా సంక్షోభం ప్రధానాంశంగా నిలిచింది. ఈ సమావేశం కేవలం ద్వైపాక్షిక సంబంధాలకే పరిమితం కాకుండా, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ఉన్న పెద్ద వ్యూహాత్మక సమస్యలను సమన్వయం చేసుకోవడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పిటిఐ కథనం ప్రకారం, ఈ చర్చలో ముఖ్యంగా ప్రస్తుత సంక్షోభం, దాని ప్రభావాలను ప్రస్తావనకు వచ్చాయి. హొర్ముజ్ జలసంధిని తెరిచి ఉండేలా చూసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశంపైన కూడా ఇరువురు దృష్టి పెట్టారు. ప్రపంచ చమురు, ఎల్ఎన్‌జి సరఫరాలో సుమారు 20 శాతం రవాణా జరిగే హొర్ముజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతున్నది. ఇరాన్ దీనిపై నియంత్రణ పెంచిన తర్వాత చమురు, గ్యాస్ ధరలు పెరగడమే ఇందుకు ఉదాహరణ. జైశంకర్, అనితా ఆనంద్ మధ్య జరిగిన చర్చల వల్ల సత్వర ఫలితాలను ఊహించలేం. కానీ, ఇలాంటి సమావేశాలు ప్రపంచ దేశాల అభిప్రాయాలకు కేంద్రంగా నిలుస్తాయి. సమస్య పరిష్కారానికి మార్గాలను సూచిస్తాయి.

# ఇరాన్‌పై కొనసాగుతున్న దాడులు

### చర్చల్లో కనిపించని పురోగతి

**దుబాయ్ :** ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని ఒకవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటిస్తుండగా, మరోవైపు ఇజ్రాయెల్ దాడులను తిరిగి ప్రారంభించింది. దీనితో, యుద్ధాన్ని ముగించేందుకు దౌత్యపరమైన పురోగతి లేదని స్పష్టమవుతున్నది. పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మారింది. చర్చలు సరైన దిశగా సాగుతున్నాయని అమెరికా అంటుండగా, అలాంటిదేమీ లేదని ఇరాన్ తేల్చిచెప్తున్నది. ఇలాంటి తరుణంలో టెహ్రాన్ నగర కేంద్రంలో ఉన్న బాలిస్టిక్ మిసైల్ తయారీ కేంద్రాలు, ఆయుధ నిల్వ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమ ఇరాన్‌లో కూడా మిసైల్ లాంచర్లు ధ్వంసం చేసినట్టు పేర్కొంది. మరోవైపు ఇరాన్ గల్ఫ్ ప్రాంత దేశాలపై మిసైల్స్, డ్రోన్లతో ప్రతిదాడులు కొనసాగిస్తోంది. బహ్రెయిన్, ఖతార్, యుఎఇ వంటి దేశాల్లో అలారం సైరన్లు మోగాయి. కువైట్‌లోని శువైఖ్ పోర్ట్‌కు స్వల్ప నష్టం వాటిల్లింది.

ఇలావుంటే, ఈ యుద్ధం గ్లోబల్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచ చమురులో సుమారు 20 శాతం సరఫరా జరుగుతున్న హొర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా సమస్యలు పెరుగుతున్నాయి. దీనిపై ఇరాన్ నియంత్రణ పెంచడంతో చమురు ధరలు గణనీయంగా పెరిగి, బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 107 డాలర్లకు చేరింది. ఇది యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 45 శాతం ఎక్కువ. అమెరికా ఒకవైపు 15 పాయింట్ల కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్‌కు అందించింది. ఇందులో అణు కార్యక్రమంపై పరిమితులు, హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం వంటి షరతులు ఉన్నాయి. కానీ మరోవైపు, వేలాది సైనికులను ప్రాంతానికి పంపించడం ద్వారా సైనిక చర్యలకు కూడా సిద్ధమవుతోంది.

ఇరాన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించి, తన సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని కోరుతూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. ఇక మానవతా పరిస్థితి వేగంగా దిగజారుతోంది. ఇరాన్‌లో వేలాది ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. లక్షలాది ప్రజలు ప్రభావితమయ్యారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇరాన్‌లో 1900 మందికి పైగా మరణించగా, లెబనాన్, ఇజ్రాయెల్, ఇతర ప్రాంతాల్లో కూడా మరణాలు కొనసాగుతున్నాయి. మొత్తం మీద ఈ యుద్ధం సైనికంగా మాత్రమే కాకుండా ఆర్థిక, మానవతా సంక్షోభంగా మారుతోంది. దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితిలో తక్షణ శాంతి సాధ్యం అనే సంకేతాలు కనిపించడం లేదు.



## డాలర్‌పై ట్రంప్ సంతకం



**వాషింగ్టన్ :** అమెరికా స్వాతంత్ర్యానికి 250 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకంతో, త్వరలోనే అమెరికా డాలర్ కరెన్సీ నోటు విడుదల కానుంది. 1861లో డాలర్ నోట్లు ప్రవేశపెట్టిన తర్వాత, పదవిలో ఉన్న అధ్యక్షుడి సంతకం కరెన్సీపై ముద్రించడం ఇదే తొలిసారి కావడం విశేషం. అమెరికా ట్రెజరీ శాఖ తీసుకున్న ఈ నిర్ణయం, అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకలలో ఒక భాగంగా ఉంటుంది. ఈ సందర్భంగా ట్రెజరర్ బ్రాండన్ బీచ్ మాట్లాడుతూ, ట్రంప్ సంతకం ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ సంతకంతో కలిసి కరెన్సీపై కనిపిస్తుందని, ఇది చరిత్రలో ఒక ప్రత్యేక గుర్తుగా నిలుస్తుందని తెలిపారు. ఆయన ప్రకారం, ట్రంప్ నాయకత్వం, దేశానికి చేసిన సేవలకు ఇది ఒక చిహ్నంగా ఉంటుంది. ఇదే సందర్భంలో, ఈ నెల ప్రారంభంలో ఒక ఫెడరల్ ఆరట్స్ కమిషన్ 24 క్యారెట్ బంగారు స్మారక నాణెం రూపకల్పనను ఆమోదించింది. ఈ నాణెంపై ట్రంప్ చిత్రం ఉంటుంది.

జీవించి ఉన్న అధ్యక్షుడి చిత్రం నాణెంపై ముద్రించడం ఇది రెండోసారి మాత్రమే. 1926లో, కల్విన్ కూలిడ్జి ఫొటోను కూడా ఇదే విధంగా నాణెంపై ముద్రించారు. ఇలావుంటే, రాబోయే నాణెంపై ట్రంప్ 'రిసోల్యూట్ డెస్క్' దగ్గర నిలబడి ఉన్న ఫొటోను ముద్రిస్తారు. ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, ట్రంప్ నాయకత్వంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ అపూర్వ వృద్ధి దిశగా సాగుతోందని, డాలర్ ప్రభావం మరింత బలపడుతోందని పేర్కొన్నారు. దేశ చరిత్రాత్మక విజయాలను గుర్తించడానికి, అలాగే ట్రంప్ పాత్రను గౌరవించడానికి, ఆయన పేరు, సంతకం ఉన్న కరెన్సీ విడుదల చేయడం సరైన నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు.

# మదురో కోర్టు ఖర్చులు చెల్లించేది ఎవరు?

### అమెరికా ప్రభుత్వానికి న్యూయార్క్ న్యాయమూర్తి ప్రశ్న



**న్యూయార్క్ :** అమెరికాలో డ్రగ్ ట్రాఫికింగ్ కేసులో అరెస్టై ఉన్న వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో కేసులో కోర్టు ఖర్చులు ఎవరు చెల్లిస్తారని న్యూయార్క్ న్యాయమూర్తి అల్విన్ హెలెర్‌స్టెయిన్ ప్రశ్నింరు. మదురో, అతని భార్య సిలియా ఫ్లోరెస్‌కు న్యాయ ఖర్చులను వెనిజులా ప్రభుత్వం చెల్లించకుండా అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని ఆయన నిలదీశారు. మదురో తరఫు న్యాయవాదులు, ఈ నిర్ణయం ఆయన రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తోందని వాదించారు. ముఖ్యంగా, తనను తాను సమర్థంగా రక్షించుకునే మదురో దంపతుల హక్కులను అమెరికా ప్రభుత్వం అడ్డుకుంటున్నదని పేర్కొన్నారు. కాగా, అమెరికా ప్రభుత్వం మాత్రం వెనిజులాపై విధించిన ఆర్థిక ఆంక్షల కారణంగా ప్రభుత్వ నిధులను ఉపయోగించనివ్వలేమని స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో అమెరికా–వెనిజులా సంబంధాలు కొంత మెరుగుపడ్డాయి. కొన్ని ఆంక్షలు సడలించారు. ఈ మారిన పరిస్థితుల్లోనూ నిధులను అడ్డుకోవడం సరైనదేనా అనే సందేహాన్ని న్యాయమూర్తి వ్యక్తం చేస్తూ, కేసును వాయిదా వేశారు. కాగా, మదురోపై మాదక ద్రవ్యాల సరఫరా, సైనికులతో కలిసి భారీ స్థాయిలో కొకైన్‌ను అమెరికాకు తరలించడంలో కీలక పాత్ర వంటి ఆరోపణలు ఉన్నాయి. అలాగే కిడ్నాప్‌లు, హత్యలు వంటి నేరాలకు కూడా పాల్పడ్డారని అభియోగం. ఈ ఆరోపణలు రుజువైతే జీవితఖైదు శిక్ష పడే అవకాశం ఉంది.

# సమస్యాత్మకంగా మారిన చమురు లీక్

**మెక్సికో సిటీ :** మెక్సికో గల్ఫ్‌లో మార్చి ప్రారంభంలో జరిగిన చమురు లీక్ సమస్యాత్మకంగా మారింది. ఇది సుమారు 600 కిలోమీటర్ల మేర వ్యాపించి, ఏడు సహజ సంరక్షణ ప్రాంతాలను ప్రభావితం చేసింది. ఈ లీక్‌కు కారణం గుర్తించని ఒక నౌకతో పాటు రెండు సహజ చమురు ఉద్గార ప్రాంతాలుగా మెక్సికో అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటన గల్ఫ్ ఆఫ్ మెక్సికో ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ లీక్ వల్ల వెరాక్రూజ్, టబాస్కో రాష్ట్రాల్లో సుమారు 200 కిలోమీటర్ల తీరప్రాంతం ప్రభావితమైంది. ఇప్పటివరకు సుమారు 430 టన్నుల హైడ్రోకార్బన్లు సేకరించారు. పర్యావరణ శాఖ ప్రకారం, ఏడు సంరక్షిత ప్రాంతాలు ప్రభావితమైనప్పటికీ, తీవ్రమైన పర్యావరణ నష్టం జరగలేదని సమాచారం. అయితే, ఇది పూర్తిగా హానికరం కాదని చెప్పడం కష్టమని నిపుణులు అంటున్నారు. సముద్ర తాబేళ్లు, చేపలు, పక్షులు వంటి కనీసం ఆరు జాతులు ప్రభావితమయ్యాయని వివిధ పర్యావరణ సంస్థలు ఇప్పటికే గుర్తించాయి.



# నేటి నుంచి ఐపిఎల్

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరాలుగా బలమైన జట్టుగా ఉన్నప్పటికీ టైటిల్ మాత్రం అందని ద్రాక్షగా మిగిలింది. గత ఫార్మాట్స్ మాదిరిగానే, ఈసారి కూడా ఐపిఎల్‌లో బరిలోకి దిగుతున్నజ ట్లను 'ఎ', 'బి' గ్రూపులుగా విభజించారు. ప్రతి జట్టు తన గ్రూప్‌లోని జట్లతో ఒక్కసారి, మరో గ్రూప్‌లోని జట్లతో రెండుసార్లు పోటీ పడుతుంది. ఈ విధానం 2023లో ఉపయోగించిన విధానానికి సమానంగా ఉంటుంది. ఈ ఫార్మాట్‌లో మ్యాచ్‌ల సమతుల్యతను, అలాగే ప్రేక్షకులకు ఆసక్తిని పెంచే విధంగా షెడ్యూల్ రూపొందించారు. గ్రూప్ దశ పూర్తయిన తర్వాత, పాయింట్ల ఆధారంగా టాప్ నాలుగు జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ ప్లేఆఫ్ దశలో ప్రత్యేకమైన నిర్మాణం ఉంటుంది. పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో ఉన్న జట్లు క్వాలిఫయర్ 1లో తలపడతాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టుకు మరో అవకాశం ఉంటుంది. ఇక మూడు, నాలుగో స్థానాల్లో ఉన్న జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌లో పోటీ పడతాయి. ఇందులో ఓడిన జట్టు టోర్నమెంట్ నుంచి బయటపడుతుంది. గెలిచిన జట్టు, క్వాలిఫయర్ 1లో ఓడిన జట్టుతో క్వాలిఫయర్ 2లో పోటీ పడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరి, క్వాలిఫయర్ 1 విజేతతో టైటిల్ కోసం తలపడుతుంది. జట్లను గ్రూపులుగా విభజించడం కూడా గత విజయాల ఆధారంగా జరిగింది.

గ్రూప్ 'ఎ'లో చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ ఉన్నాయి. అదే విధంగా, గ్రూప్ 'బి'లో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఉన్నాయి. నిజానికి ఐపిఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్యను, ఈ సంవత్సరం నుంచి 84కి పెంచాలని యోచించారు. కానీ ప్రస్తుతానికి అదే 74 మ్యాచ్‌ల ఫార్మాట్‌ను కొనసాగించారు. భవిష్యత్తులో మళ్లీ పూర్తి డబుల్ రౌండ్ రాబిన్ విధానానికి మారే అవకాశాలు ఉన్నాయి, అంటే ప్రతి జట్టు ప్రతి జట్టుతో రెండుసార్లు ఆడే విధానం అమలు కావచ్చు. క్రికెట్‌కు కొత్త ఊపిరినిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో జట్లకు చెందిన, ఎంతో మంది ఆటగాళ్ల ప్రతిభను ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తున్న ఐపిఎల్‌పై విమర్శలు కూడా లేకపోలేదు. సుదీర్ఘమైన టోర్నమెంట్ కారణంగా ఆటగాళ్లు శారీరకంగా, మానసికంగా అలసిపోతున్నారని, దీనితో తమ తమ దేశాల తరఫున జాతీయ జట్లలో పాల్గొనలేకపోవడం లేదా దారుణ వైఫల్యాలను మూటగట్టుకోవడం జరుగుతున్నదని పలు క్రికెట్ బోర్డులు కూడా ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. ఇలావుంటే, మొదట కొన్ని 24 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించిన భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) శుక్రవారం మిగతా 50 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది.

**అబ్రార్ వివాదం..**

ఐపిఎల్‌లో పాకిస్తానీ క్రికెటర్లను తీసుకోకూడదనే నిబంధనేదీ ప్రత్యక్షంగా లేదు. కానీ, 2009 నుంచి ఫ్రాంచైజీలు ఏవీ పాకిస్తాన్‌కు చెందిన క్రికెటర్లను వేలంలో కొనడం లేదు. అయితే, ఈసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ అబ్రార్ అహ్మద్‌ను రూ. 2.34 కోట్లకు కొనుగోలు చేయడం వివాదాస్పదమైంది. ఇంగ్లాండ్‌లో 'ది హండ్రెడ్స్' టోర్నమెంట్‌లో పాల్గొనే సన్‌రైజర్స్ లీడ్స్ జట్టుకు సన్ గ్రూప్ యజమానిగా ఉంది. అందులో సభ్యుడైన అబ్రార్‌ను ఐపిఎల్‌కు ఎంపిక చేసింది. దీనిపై దేశ వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, పాక్ క్రికెటర్లపై నిషేధం అంటూ ఏదీ లేదుకాబట్టి, తాము జోక్యం చేసుకోలేమని బిసిసిఐ స్పష్టం చేసింది. దీనితో ప్రస్తుతానికి ఈ వివాదానికి తెరపడింది.

# మరో పది రోజుల గడువు

(మొదటి పేజీ తరువాయి)

తెరవకపోతే, ఇరాన్ ఎనర్జీ ప్లాంట్లపై దాడులు జరుగుతాయని పునరుద్ఘాటించారు. స్థూలంగా చూస్తే ఇది శాంతి ప్రయత్నంలా కనిపించినా, లోతుగా చూస్తే ఇది ఒక వ్యూహాత్మక ఒత్తిడి పద్ధతిగా చెప్పుకోవచ్చు. ఒకవైపు బెదిరింపు కొనసాగిస్తూ, మరోవైపు చర్చలకు అవకాశం ఇవ్వడం ద్వారా ప్రత్యర్థిని బలహీనపరచాలనే ఉద్దేశ్యం కనిపిస్తుంది. ఈ యుద్ధం ఇప్పటికే నాలుగు వారాలకు పైగా కొనసాగుతోంది. ఈ యుద్ధం మధ్యప్రాచ్య ప్రాంతాన్ని మాత్రమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు ఇంకా పూర్తిగా ముగియలేదు. అంటే, దౌత్యం, యుద్ధం ఒకేసారి జరుగు తున్నాయి, ఒకటి మరొకదాన్ని పూర్తిగా భర్తీ చేయడం లేదు. ఈ వైఖరే పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. ఇలావుంటే, చర్చలకపై అమెరికా, ఇరాన్ పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నాయి. చర్చలు ఆశాజనకంగా జరుగుతున్నాయని అమెరికా ప్రకటించగా, ఇరాన్ మాత్రం ఎలాంటి చర్చల్లో పాల్గొనడం లేదని స్పష్టం చేస్తోంది. ప్రత్యక్ష చర్చలు కాకుండా మధ్యవర్తుల ద్వారా జరిపే అవకాశాలను ఈ ప్రకటన సూచిస్తున్నది. ఏ దేశమైనా తన వ్యూహాన్ని బయట పెట్టడానికి ఇష్టపడదు కాబట్టి, యుద్ధ సమయంలో ఇలాంటి అస్పష్టత సాధారణమే. ఇక ఈ ఘర్షణలో హొర్ముజ్ జలసంధి అత్యంత ముఖ్యమైన అంశంగా మారింది. ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారా జరుగుతుంది. ఇరాన్ దీన్ని అడ్డుకోవడం వల్ల ప్రపంచ మార్కెట్లలో భారీ ప్రభావం కనిపిస్తోంది. చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. గ్యాస్ ధరలు కూడా మండుతున్నాయి. అలాగే వ్యవసాయా నికి కీలకమైన ఎరువుల ధరలు కూడా పెరగడం ప్రారంభమైంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ భయం అధికమవుతున్నది. ఇది కేవలం ఒక ప్రాంతీయ సమస్య కాదని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం దీనికి స్పందిస్తుందని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. యుద్ధం తీవ్రతను చూస్తే, ఇరాన్ నివేదికల ప్రకారం టెహ్రాన్, ఖోమ్, ఉర్మియా వంటి నగరాల్లో నివాస ప్రాంతాలపై దాడులు జరిగాయి. అనేక మంది పౌరులు మరణించారు. మరోవైపు ఇజ్రాయెల్ తన దాడులు ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రాలు, రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయని చెబుతోంది. ప్రతి పక్షం తన చర్యలను న్యాయబద్ధమైనవిగా చూపించడానికి ప్రయత్నిస్తుంది కాబట్టి, యుద్ధ సమయంలో ఇలాంటి విభిన్న కథనాలు సాధారణమే. అందువల్ల వాస్తవ పరిస్థితి బయటకు రావడం కష్టం. అమెరికా ఇరాన్‌కు ఇచ్చిన 15 పాయింట్ల ప్రతిపాదన కూడా ఈ సంక్షోభంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయాలని, క్షిపణి సామర్థ్యాన్ని తగ్గించాలని, అలాగే హొర్ముజ్ జలసంధిపై తన నియంత్రణను వదులు కోవాలని డిమాండ్ చేసింది.

ఇరాన్ దృష్టిలో ఇవి తమ స్వాధీనంపై నేరుగా దాడిలాంటివి, అందుకే వారు ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. అంతేగాక, పశ్చిమాసియాలో సైనిక స్థావరాలను వెంటనే ఎత్తివేయాలని అమెరికాను డిమాండ్ చేసింది. మళ్లీ యుద్ధానికి పాల్పడబోమని హామీ ఇవ్వాలని, ప్రస్తుత యుద్ధంలో జరిగిన నష్టాన్ని భరించాలని కూడా ఇరాన్ కోరుతున్నది. అటు అమెరికా, ఇటు ఇరాన్ డిమాండ్లపై పట్టుబడుతున్న తరుణంలో, మరో పది రోజుల పాటు గడువు పొడిగిస్తు న్నట్టు ట్రంప్ ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈలోగా శాంతి స్థాపనకు మార్గం సుగమమయ్యే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది.

## బాలెన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణం చేయించారు. బాలెన్ రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పి) నాయకుడు కాగా, మధేశ్ ప్రాంతం నుంచి ప్రధానమంత్రిగా ఎదిగిన తొలి వ్యక్తిగా బాలెన్ చరిత్ర పుటల్లోకి ఎక్కారు. కాగా, ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమం హిందూ, బౌద్ధ సంప్రదాయాల సమ్మిళితంగా జరిగింది. ఏడుగురు పూజారులు శంఖనాదం చేయడం, 108 మంది వేద మంత్రాలు పారాయణం చేయడం, 107 మంది లామాలు బౌద్ధ గ్రంథాలు చదవడం వంటి ఆచారాలు ఇందులో చోటుచేసుకున్నాయి. ఇది నేపాల్ సంస్కృతిలో ఉన్న మతపరమైన వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. బాలెన్ అధికారంలోకి రావడం ఒక సాధారణ రాజకీయ మార్పు కాదు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో యువత ఆధ్వర్యంలో జరిగిన 'జెన్ జెడ్' నిరసనల వల్ల కెపి శర్మ ఓలి ప్రభుత్వం పడిపోయిన విషయం తెలిసిందే. అవినీతి, బంధుప్రీతి, సోషల్ మీడియా నిషేధం వంటి అంశాలపై ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆ తరువాత తాత్కాలిక ప్రధానమంత్రిగా సుశీలా కార్కి బాధ్యతలు నిర్వహించారు. బాలెన్ అప్పట్లో తాత్కాలిక పదవిని తిరస్కరించి, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా పూర్తి కాలానికి అధికారంలోకి రావాలని నిర్ణయించుకున్నారు. అదే ఇప్పుడు అమలు అయింది. ఈనెల 5న జరిగిన ఎన్నికల్లో బాలెన్ ఘన విజయం సాధించాడు. ఆయన తన ప్రత్యర్థి, నాలుగు సార్లు ప్రధానమంత్రిగా ఉన్న ఓలిని భారీ మెజారిటీతో ఓడించాడు. ఆర్ఎస్‌పి 275 స్థానాల్లో పోటీచేసి 182 సీట్లు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. దీనితో సంప్రదాయ పార్టీల ప్రభావం గణనీయంగా తగ్గిపోయింది. అంతేగాక, బాలెన్ తన కేబినెట్‌ను కూడా ఏర్పాటు చేశారు. స్వర్ణిమ్ వాగ్లే ఆర్థిక మంత్రిగా, శిశిర్ ఖనాల్ విదేశాంగ మంత్రిగా, సుదన్ గురుంగ్ హోం మంత్రిగా ప్రమాణం చేశారు. బాలెన్ స్వయంగా రక్షణ, వాణిజ్య శాఖలను కూడా నిర్వహించనున్నారు. ఇతర మంత్రులు వివిధ కీలక శాఖలను చేపట్టారు. ఇలావుంటే, బాలెన్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. భారత్–నేపాల్ సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నేపాల్ భౌగోళికంగా భూభాగంతో చుట్టుముట్టబడి ఉండటం వల్ల భారత్‌పై వాణిజ్య, రవాణా పరంగా ఎక్కువగా ఆధారపడుతుంది. ఈ నేపథ్యంలో ఈ కొత్త నాయకత్వం రెండు దేశాల సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ప్రైవేటు వైద్యమా!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యాన్ని పక్కా కమర్షియల్ గా చేస్తున్నారు. పీఎన్ ఆర్ టి చట్టాన్ని కూడా తుంగలో తొక్కి అక్రమ స్కానింగ్ లు, టెస్టులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ తో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి వైద్యం కోసం వరంగల్ కు వచ్చే రోగులు ప్రవేటు దోపిడీకి విలవిలలాడుతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్య, ఆరోగ్యశాఖ ఏం చేస్తోందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**పుట్టగొడుగుల్లా అస్పత్రులు**

ఉత్తర తెలంగాణకు వరంగల్ మహానగరం కేంద్రంగా ఉంది. విద్య, వైద్యం కోసం వరంగల్ బాట పడుతారు. ప్రధానంగా ఎంజీఎం ఆస్పత్రి ఇక్కడే ఉండటంతో పాటు అనేక కార్పొరేట్ ఆస్పత్రులు వెలిశాయి. సూపర్ స్పెషాలిటీ, మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు, డెంటల్, డయాగ్నోస్టిక్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లు, పాలిక్లినిక్ లు, ఆయుర్వేద క్లినిక్‌లు, ఫిజియోథెరపీ, హోమియో క్లినిక్‌లు, నేచురోపతి, రిహాబిటేషన్ కేంద్రాలు, డీఅడిక్షన్ సెంటర్లు హనుమకొండ జిల్లాలో అధికారికం గా 762 ఉండగా, వరంగల్ జిల్లాలో 228 ఉన్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, మహబూబాబాద్, ములు గు, జనగామ జిల్లాలో మరో 500వరకు వివిధ రకాల ఆస్పత్రులు ఉన్నాయి. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,500 అస్పత్రుల వరకు గుర్తింపు పొంది ఉండగా, మరో వెయ్యికి పైగా అస్పత్రులకు ఎలాంటి అనుమతులు లేకుండా, అన్నిరకాల పరీక్ష లు, స్కానింగ్ లతో నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కనీస విద్యార్హత లేకున్నప్పటికీ నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, మల్టీస్పెషాలిటీ బోర్డులు పెట్టి, రోగులను బొల్తా కొట్టిస్తున్నారని, వచ్చీరాని వైద్యంలో ప్రాణాల మీదకు తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టుకు వ్యతిరేకంగా కొన్ని అస్పత్రుల నిర్వాహకులు డబ్బు సంపాదనే ధ్యేయంగా రోగుల నుంచి ఫీజులు, స్కా నింగ్, టెస్టుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంబు లెన్స్ కూడా సరిగా వెళ్లలేని సందుల్లో, గల్లీల్లో ప్రైవేటు ఆస్పత్రి నిర్వహణకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. హనుమకొండ కాకాజీకాలనీ, బస్టాండ్, బాల సముద్రం, కాశీబుగ్గ, వరంగల్ చౌ రస్తా తదిరత ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెల కొంది. అంతేకాకుండా మెడికల్ వేస్టేజ్ ను కూడా సందుల్లో పడేస్తుండటంతో దుర్వాసనతో పాటు కుక్కలు, పందులు, పశువులు తిని మూగజీ వాలు అనారోగ్యానికి గురవుతున్నాయి. రక్తంతో కూడిన బ్యాండేజ్లు, దూది, సిరంజ్ లు, తదితర చెత్తం తా గల్లీల్లో పడేస్తుండటం, ఆస్పత్రి పక్కనే డంప్ చేస్తుండటంతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీంతో వరంగల్, హనుమ కొండ, కాజీపేట ట్రైసిటీస్‌లలో అన్ని నిబంధనలు, సౌకర్యాలతో పని చేసే అస్పత్రులపై నమ్మకం కోల్పోవలసి వస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

**స్కానింగ్‌లు, టెస్టుల పేరుతో దోపిడీ**

వరంగల్ మహానగరంలోకొన్ని ప్రవేటు అస్ప త్రుల్లో అడ్డగోలుగా రోగులను దోపిడీకి గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే రకమైన వైద్యానికి ఒక్కొక్క అస్పత్రిలో ఒక్కో ఫీజువసూలు చేస్తున్నారు. సాధారణంగా వచ్చే జ్వరం కోసం వెళ్లిన ఒక్కరు రూ.300లు ఓపీ ఫీజు తీసుకుటే,మరో వైద్యుడుమాత్రం రూ.500లకు పైగా తీసుకుంటున్నారు.ఇక జ్వరం వచ్చినా... దగ్గు వచ్చినా... కడుపులో గ్యాస్ పెరిగినా.. చివరకు తుమ్ములు గట్టిగా వచ్చినా కొంత మంది వైద్యులు ముం దుగా రెఫర్ చేసేది స్కానింగ్ లు, టెస్టింగులకే.. అయితే కొందరు ల్యాబ్ నిర్వాహకులు ముందే సిండికేట్ గా మారి భారీగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి.సాధారణంగా చెస్ట్ సిటీస్కాన్ చేయడానికి రూ.3వేల నుంచి రూ.6వేల వరకు ఖర్చు అవుతుందని, అయితే వరంగల్ నగరంలో మాత్రం రూ.6 వేల నుంచి రూ.1,5000ల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఎంఆర్ఐ బ్రెయిన్, వెన్నుముక, మోకాళ్లు, గుండె కండరాలు, నడుము తదితర పలు రకాల స్కానింగ్ కు రూ.5వేల నుంచి రూ.15వేల వరకు తీసుకుంటున్నారు. ఇక డెంగీ, మలేరియా, వైరల్, సిబిపి, ఆర్ఎఫ్, ఎల్ఎల్డీ, లిపిడ్ ప్రొఫైల్, హార్మోన్స్ టెస్టులు.. ఇలా కొన్ని రకాల రక్త పరీక్షలకు రూ.1,200ల నుంచి రూ.3 వేల వరకు చార్జ్ వసూలు చేస్తున్నారు.

**ఎంతమంది పేషెంట్లకు అంత కమీషన్**

అయితే కొంతమంది వైద్యులు పేషెంట్‌ను ల్యాబు, స్కానింగ్ సెంటరు రెఫర్ చేసినం దుకు 40శాతం నుంచి 60 శాతం వరకు కమీషన్‌ను తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోజుకు ఎంతమంది పేషెంట్లను టెస్టులకు, స్కానింగ్లకు పంపిస్తే.. అంతే మొత్తాన్ని అదే రోజు రాత్రి సదరు వైద్యుడికి చేరుతుందని సమాచారం. మరికొంతమంది ప్రైవేటు వైద్యులు సొంతంగా ల్యాబ్ లు బినామీల పేరులతో ఏర్పాటు చేసుకోని కమీష న్లను, లాభాలను మొత్తాన్ని నొక్కేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రతీరోజు లక్షలాది రూపాయల కమీషన్ల దందా కమర్షియల్ గా మారిందనే ప్రచారం జరు గుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి రోగులను రెఫర్ చేసే కొంతమంది ఆర్ఎంపీ, పీఎంపీలకు కూడా ఇదే స్థాయిలో కమీషన్ల రూపంలో ల్యాబ్ నిర్వాహకుల నుంచి వెళుతున్నాయనే ప్రచారం ఉంది.

**కళ్లు తెరవని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు**

కొంతమంది వైద్యులు పేదల రోగాలను క్యాష్ చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అస్పత్రుల నిర్వహణలో కొన్ని చోట్ల ప్రీకాన్సెప్షన్, ప్రీనేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. గర్భాధారణకు ముందు లింగ ఎంపిక, లింగ నిర్ధారణ కోసం అల్ట్రాసౌండ్ వంటి పద్ధతులను దుర్వినియోగాన్ని నిరోధించటం, భ్రూణహత్యలను ఆపడం కోసం చేసిన చట్టా న్ని నగరంలో చాలాచోట్ల కొంతమంది వైద్యులు ఉల్లంఘిస్తూ లింగనిర్ధారణ చేస్తున్నారనే ఆరోప ణలు వినిపిస్తున్నాయి. లింగనిర్ధారణ చేస్తున్నట్లుగా పట్టుబడినప్పటికీ వారిపై ఎలాంటి చర్య లు తీసుకోక పోవటంతో పీసీపీ ఎన్డీటీ చట్టాన్ని కొందరు లైట్ గా తీసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.ఓరుగల్లు వ్యాప్తంగా వైద్యం వ్యాపారంగా మారి, పేదల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతోందనే ఆందోళన వ్యక్తం అవుతున్నప్పటికీ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కళ్లు తెరవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు అస్పత్రుల్లో సౌకర్యాలు, ఫీజుల వసూళ్లు, ల్యాబ్ లో ఏ పరీక్షకు ఎంత తీసుకుంటున్నారో. డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లలో ఏ టెస్టుకు ఎంత, తీసుకుంటు న్నారో అని రోగుల నుంచి రిపోర్టు తీసుకోవటంతో పాటు ఆయా కేంద్రాలు, అస్పత్రుల్లో ధరల కనీసం తనిఖీ చేయాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ నిద్రమత్తులో జోగుతుందా! అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# సమాన అవకాశాలు కల్పించడమే 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్' లక్ష్యం

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆధునిక సదుపాయాలు, ప్రయోగశాలలు, నివాస వసతులతో కూడిన వరల్డ్ క్లాస్ విద్యాసంస్థలను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటు చేదం తద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ వర్గాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్టు లక్ష్యమని, ఇందుకు సహకరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ప్రముఖ నటి, సామాజిక కార్యకర్త లక్ష్మి మంచు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. ఈ భేటీలో దేవేంద్ర విద్యాలయ డైరెక్టర్ విజయేందర్‌గౌడ్ తల్లా కూడా పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్‌పై సహకార అవకాశాలపై వారు చర్చించారు. సమాన విద్యా అవకాశాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు టెక్ ఫర్ ఛేంజ్ సంస్థతో భాగస్వామ్యం సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.

తన సంస్థ చేస్తున్న సేవలను సిఎంకు లక్ష్మీ మంచు వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో లిటరసీ ప్రోగ్రామ్స్, డిజిటల్ లెర్నింగ్, మౌలిక వసతుల అభివృద్ధి, టీచర్ ట్రైనింగ్ వంటి కార్యక్రమాలను వివరించి, పెద్ద స్థాయిలో విద్యా మార్పుకు తమ సహకారం అందించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. డిజిటల్ క్లాస్‌రూమ్స్, వాలంటీర్ ఎంగేజ్‌మెంట్, టీచర్ల సామర్థ్యాభివృద్ధి వంటి అంశాల్లో టెక్ ఫర్ ఛేంజ్ కార్యక్రమాలను యంగ్ ఇండియా స్కూల్స్‌లో అమలు చేసే అవకాశాలపై కూడా చర్చ జరిగింది. ఈ భేటీ ద్వారా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యానికి కొత్త దారులు తెరుచుకుని, తెలంగాణలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించే దిశగా కీలక అడుగు పడినట్టు భావిస్తున్నారు.

# విశ్వశాంతికి బౌద్ధమే మార్గం

బుద్ధవనం ఇక వరల్డ్ పీస్ సెంటర్
అంతర్జాతీయ బౌద్ధ శాంతి సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్వేషాలు, విభేదాలతో సతమతమవుతున్న ఆధునిక ప్రపంచానికి గౌతమ బుద్ధుని కరుణ, అహింసలే మానవాళిని కాపాడగలవని, ఆయన బోధనలు సమకాలీన సమస్యలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లోని హరిత ప్లాజాలో శుక్రవారం జరిగిన 'అంతర్జాతీయ బౌద్ధ శాంతి సదస్సు 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బౌద్ధ వారసత్వ పరిరక్షణ, ప్రపంచ శాంతి స్థాపనలో, అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడిలో మంత్రి చూపుతున్న చొరవను గుర్తిస్తూ 'ఇంటర్నేషనల్ ఇంటర్‌ఛేంజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్' ఆయనకు ప్రతిష్టాత్మకమైన 'గ్రాండ్ ప్రైజ్ ఫర్ కాంట్రిబ్యూషన్ టు వరల్డ్ పీస్' అవార్డును ప్రదానం చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు మున్ యోంగ్ జో ఈ పురస్కారాన్ని అందజేస్తూ, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారికి ఆసరగా నిలుస్తూ.. మానవ విలువల కోసం కృషి చేస్తున్న మంత్రి సేవలను కొనియాడారు.

అవార్డును స్వీకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న శాంతి, సహనం, అహింస విలువలకు లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. సదస్సులో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ గడ్డ వేల ఏళ్లుగా బౌద్ధ వైభవానికి నిలయమని గుర్తుచేశారు. కృష్ణా నదీ తీరాన ఆచార్య నాగార్జునుడు మాధ్యమిక వాదాన్ని, శూన్యతా సిద్ధాంతాన్ని ప్రవచించి, ఈ ప్రాంతాన్ని విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

# నేటి నుంచి శాసన సభ్యుల క్రీడోత్సవాలు



స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
అందరికీ ఆహ్వానం : స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌బి స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల కీడోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. శనివారం నుంచి ఎల్‌బి స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటివ్ స్పోరట్స్ మీట్ 2026 ఏర్పాట్లను ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శాసనసభ్యుల క్రీడోత్సవ పోటీలను ఘనంగా నిర్వహించబోతున్నామని, తద్వారా రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించబోతున్నామని తెలిపారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రీడా పోటీలలో పార్టీల భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషకరమనిఅన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్బాల్ క్రికెట్ అథ్లెటిక్స్, కబడ్డీ,వాలీబాల్ బాడ్మింటన్, టెన్నిస్, తోపాటు కొన్ని రిక్రియేషనల్ క్రీడా పోటీలు నిర్వహించబోతున్నయని తెలిపారు. ఈ పోటీలు వీక్షించడానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పించబోతున్నామని, అందరికీ అవసరమైన సౌకర్యాలను సమకూర్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# హైదరాబాద్‌లో డ్రగ్స్ రాకెట్

రూ.6లక్షల విలువైన ఎండిఎంఎ స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో మాదకద్రవ్యాల విక్రయం పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు మరో కీలక ఆపరేషన్ నిర్వహించారు. కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ జూబ్లీహిల్స్ జోన్ టీమ్, సనత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టి డ్రగ్స్ విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేశారు. ఈ దాడిలో ఐడిపిఎల్‌కు చెందిన విద్యార్థి సోంగపు హేమంత్ (23), చింతల్‌కు చెందిన ముక్కగళ్ల నాగేంద్ర (21)తో పాటు ఇద్దరు జువెనైల్‌లు పట్టుబడగా, వారి వద్ద నుంచి సుమారు 60 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్ విలువ సుమారు రూ.6,00,000గా పోలీసులు అంచనా వేశారు. ఈ కేసులో సాయి, నిఖిల్ యాదవ్,ఆదిత్యలు పరారీలో ఉన్నారు. పట్టుబడిన నిందితులు మద్యం, గంజాయి, ఎండిఎంఎ వంటి దకద్రవ్యాలకు అలవాటు పడినట్లు పోలీసులు తెలిపారు. చింతల్ ప్రాంతానికి చెందిన సాయి నిఖిల్ యాదవ్, ఆదిత్యల ద్వారా డ్రగ్స్ సరఫరా జరుగుతుండగా, ఒక జువెనైల్ వారి వద్ద నుంచి తక్కువ ధరకు ఎండిఎంఎ కొనుగోలు చేసి, నగరంలోని కస్టమర్లకు ఎక్కువ ధరకు క్రయిస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఇటీవల రెండు రోజుల క్రితం 60 గ్రాముల ఎండిఎంఎ కొనుగోలు చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకున్నారు. అరెస్టైన నిందితులను, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను తదుపరి దర్యాప్తు కోసం సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఆపరేషన్‌ను టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యదేందర్, ఎస్‌ఐ రవిరాజ్ వారి బృందం సమన్వయంతో నిర్వహించారు.నగరంలో డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# ఎఐ డీప్ ఫేక్ స్కామ్ తెలంగాణలో పెరుగుతున్న కొత్త మోసం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో సైబర్ నేరాలు కొత్త రూపంలో విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా ఎఐ ఆధారిత డీప్‌ఫేక్ వీడియో స్కామ్‌లు ప్రజలను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల మోసాలకు దారితీస్తున్నాయి. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్న నేరగాళ్లు, సామాన్యులను సులభంగా వలలో వేసుకుంటున్నారు. సైబర్ మోసగాళ్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సహాయంతో ప్రముఖ నేతలు, అధికారులు, సెలబ్రిటీల వీడియోలను తీసుకుని, వారి ముఖం, స్వరం నిజమైనట్టుగా కనిపించేలా మార్చుతున్నారు. ఈ డీప్‌ఫేక్ వీడియోల్లో ప్రభుత్వ పథకం, స్టాక్ మార్కెట్ భారీ లాభాలు అంటూ నమ్మించేలా ప్రచారం చేస్తున్నారు. ఈ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేసి, ఫేక్ వెబ్‌సైట్లకు దారి మళ్లించి, రిజిస్ట్రేషన్ ఫీజు, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు.

కేంద్ర ఆర్థిక మంత్రి పేరుతో రూపొందించిన డీప్‌ఫేక్ వీడియోల ద్వారా కోట్ల రూపాయల మోసం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లో మరో కేసులో, ప్రముఖుల వీడియోలను మార్చి స్టాక్ ట్రేడింగ్ పేరుతో ఒక వృద్ధుడిని రూ.25 లక్షలకు పైగా మోసం చేశారు. డీప్‌ఫేక్ వీడియోలు పూర్తిగా నిజంగా కనిపించడం వల్ల సాధారణ ప్రజలు గుర్తించడం చాలా కష్టం. ప్రభుత్వం చెప్పింది అనే నమ్మకం వల్ల వెంటనే స్పందించే అవకాశం ఉంది. నిపుణుల ప్రకారం, ఎఐ టెక్నాలజీ వల్ల ఈ మోసాలు మరింత వ్యక్తిగతంగా మారుతున్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఎఐ ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ వ్యవస్థలను అమలు చేస్తోంది. ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. టెలికాం సంస్థలు అనుమానాస్పద లింకులను భారీగా బ్లాక్ చేస్తున్నాయి. ఎఐ టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ, సైబర్ నేరాలు కూడా మరింత అధునాతనంగా మారుతున్నాయి. ముఖ్యంగా డీప్‌ఫేక్ స్కామ్‌లు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

డీప్‌ఫేక్ వీడియోలు ఇప్పుడు తెలంగాణలో కొత్త తరహా సైబర్ ఆయుధంగా మారాయి. వీడియోలు నిజంగా కనిపించినా అవి పూర్తిగా నకిలీ కావచ్చు. అవగాహన లేకపోతే ఎవరైనా సులభంగా మోసపోవచ్చు. డీప్‌ఫేక్ వీడియోలను గుర్తించే 5 టెక్నికల్ ట్రిక్స్‌ను నిపుణులు వివరిస్తున్నారు. మొదటి ట్రిక్, పెదవులు – వాయిస్ సింక్ చెక్ చేయండి వీడియోలో వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు పెదవుల కదలికలు, వాయిస్ సరిపోతున్నాయా చూడండి. చిన్న తేడా కనిపించినా అది డీప్‌ఫేక్ అయ్యే అవకాశం ఉంది.రెండో ట్రిక్, కళ్ల కదలికలు, బ్లింకింగ్‌పై దృష్టి పెట్టండి డీప్‌ఫేక్ వీడియోల్లో కళ్ల బ్లింకింగ్ సహజంగా ఉండదు. చాలా తక్కువగా లేదా అసాధారణంగా కనిపిస్తే అనుమానం పెట్టండి. ముఖం చుట్టూ బ్లర్ లేదా గ్లిచ్‌లు ముఖం అంచుల్లో బ్లర్, గ్లిచ్‌లు లేదా లైటింగ్ అసమానతలు ఉంటే అది ఎఐ మార్పిడి సంకేతం కావచ్చు. నాలుగో ట్రిక్, వాయిస్ నాణ్యతను గమనించండి సహజమైన మానవ స్వరం కాకుండా, కొద్దిగా రోబోటిక్‌గా లేదా అసహజంగా వినిపిస్తే జాగ్రత్తగా ఉండాలి. ఐదో ట్రిక్స్, సోర్స్, లింక్‌ను వెరిఫై చేయండి వీడియో ఎక్కడి నుంచి వచ్చింది? అధికారిక వెబ్‌సైట్ లేదా వెరిఫైడ అకౌంట్ నుంచేనా? అనుమానాస్పద లింక్ అయితే క్లిక్ చేయకండి.

# హైదరాబాద్ పట్టణాభివృద్ధికి 'క్యూర్' మోడల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగర అభివృద్ధిని సమతుల్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'క్యూర్' నమూనాను అమలు చేస్తున్నట్లు తెలంగాణ సోషియో ఎకనామిక్ ఔట్‌లూక్2026 నివేదిక వెల్లడించింది. ప్లానింగ్ విభాగం రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, సుమారు 2,053 చదరపు కిలోమీటర్ల పరిధిలో మెట్రోపాలిటన్ అభివృద్ధి లక్ష్యంగా పాలిసెంట్రిక్ అర్బన్ క్లస్టర్ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ మహానగరాన్ని మూడు కార్పొరేషన్లుగా, జిహెచ్‌ఎంసి, సిఎంసి, ఎంఎంసిగా పునర్వ్యవస్థీకరించినట్లు పొందుపర్చారు. మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక వినియోగం, విపత్తు నిర్వహణ, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు నివేదిక స్పష్టం చేసింది.

**ఫ్లైఓవర్లు, రహదారి పనులు పురోగతిలో...**హెచ్‌సిటీ, ఎస్‌ఆర్‌డిపి పథకాల ద్వారా 45 నిర్మాణాలు, 10 రహదారి విస్తరణ పనులు మంజూరు కాగా, వాటిలో 29 పనులు గత ఏడాది చివరిలో ప్రారంభమయ్యాయి. నల్లగొండ క్రాస్ రోడ్స్, ఉప్పల్ ఫ్లైఓవర్లు, మూసారాంబాగ్ బ్రిడ్జి వంటి ముఖ్య పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని నివేదిక తెలిపింది. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మొదటి, రెండో దశల్లో 40.51 కి.మీ. రహదారి పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం 7.22 కి.మీ. పనులు రూ.91.22 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయి. మూడో దశలో 49 రహదారుల అభివృద్ధికి రూ.1,500 కోట్లు మంజూరయ్యాయి.

**వరద నివారణకు ప్రత్యేక చర్యలు..** వరదల నివారణ కోసం వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్‌ఎన్‌డిపి) కింద మొదటి దశలో 45 పనులు పూర్తయ్యాయి. దీంతో 150 కాలనీలు, లక్ష కుటుంబాలకు వరద ముప్పు తగ్గింది. రెండో దశలో రూ.667.28 కోట్లతో 40 పనులు మంజూరు చేశారు. ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వరద కాల్వల విస్తరణ, నిర్వహణకు సంబంధించిన 2,266 పనులు చేపట్టగా, వాటిలో 1,595 పనులు పూర్తయ్యాయి. మొత్తం అంచనా వ్యయం రూ.1,203.63 కోట్లు.

**సాంకేతికతకు ప్రాధాన్యం ...**నగర పాలనలో పారదర్శకత, వేగం పెంచేందుకు బిల్డ్‌నౌ ప్లాట్‌ఫామ్‌ను అమలు చేశారు. దీని ద్వారా భారీ భవనాల ప్లాన్ పరిశీలన ప్రక్రియ నెలల సమయం పట్టేది నిమిషాల్లో పరిశీలించే స్థాయికి చేరుకున్నాయి. దీంతో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేందుకు అస్కారం ఏర్పడింది.

# భవనాల కింద బతుకులు ఛిద్రం

ఉపాధి కోసం అడ్డాల వద్ద పడిగాపులు...పూట గడవని కూలీల దుస్థితి
ఇతర రాష్ట్రాల కార్మికులతో స్థానికులకు ఉపాధి కరువు
నెలలో పదిరోజులే పని.. మిగతా రోజులు నిరీక్షణే







**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణాల్లో ఎత్తైన భవనాలు పెరుగుతున్నా, వాటిని నిర్మిస్తున్న కార్మికుల బతుకులు మాత్రం నలుగుతున్నాయి. రోజంతా కష్టపడి పని చేసినా పూట గడవని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల కార్మికుల రాకతో స్థానిక కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక పట్టణాలకు వలస వచ్చిన కుటుంబాలు భవన నిర్మాణ రంగంపైనే ఆధారపడుతున్నాయి.భార్యాభర్తలతో పాటు చిన్నపిల్లలూ కూలీ పనుల్లోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఉదయం నుండి సాయంత్రం వరకు శ్రమించినా వారికి దక్కేది తక్కువ కూలీ మాత్రమే. భవన నిర్మాణ రంగంలో మేస్త్రీలే నిర్ణయాధికారులుగా వ్యవహరిస్తున్నారు. వారు చెప్పిన కూలీకి ఒప్పుకోకపోతే ఇతర రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్,రాజస్థాన్,ఒడిశా ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చి తక్కువ వేతనంతో పనిచేయిస్తున్నారు. దీంతో స్థానిక కార్మికులకు పని దొరకడం కష్టమవుతోంది. రాష్ట్రంలో అసంఘటిత రంగంలో కోట్లాది మంది కార్మికులు ఉండగా, అందులో సగానికి పైగా భవన నిర్మాణ రంగానికే చెందుతారని అంచనా.తాపీ పని నుంచి ప్లంబింగ్,పెయింటింగ్,వైరింగ్, రోడ్డు పనులు వరకు అనేక రంగాల్లో కార్మికులు పనిచేస్తున్నా వారి జీవన పరిస్థితులు మాత్రం మారడం లేదు.నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ కూలీ రేట్లు మాత్రం పెరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నెలలో పది రోజులు కూడా పని దొరకడం కష్టమై, నల్లగొండ పట్టణంలోని రామగిరి,భాస్కర్ థియేటర్,చౌరస్తా ప్రాంతాల్లో పనుల కోసం గంటల తరబడి ఎదురు చూస్తున్నారు.

ఉపాధి హామీ పథకం ఉన్నప్పటికీ పనులు సకాలంలో లేకపోవడం, చేసిన పనులకు చెల్లింపులు ఆలస్యంగా రావడం వల్ల గ్రామీణ కార్మికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వలసలు పెరుగుతున్నాయని కార్మికులు చెబుతున్నారు.ఇక మహిళా కార్మికులు,చిన్నారులు అధిక సంఖ్యలో ఈ రంగంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. బాలకార్మికత్వం పెరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. ప్రమాద బీమా,వైద్య సదుపాయాలు, గృహ వసతి, పెన్షన్ వంటి ప్రయోజనాలు అందించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

**కార్మిక సంక్షేమం కోసం సమగ్ర చట్టాలే మార్గం : పల్లా దేవేందర్ రెడ్డి**



ప్రస్తుతం వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చూస్తే, వారి సంక్షేమం కోసం సమగ్ర చట్టాల అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

సంక్షేమ బోర్డుల్లో సెస్ సక్రమంగా వసూలు కాకపోవడం,కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవడం వంటి అంశాలు వ్యవస్థలో ఉన్న లోపాలను బయటపెడుతున్నాయి. కార్మిక సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని,పారదర్శకమైన విధానాలు అమలు చేస్తేనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

**రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి మా పొట్టలు కొడుతున్నారు : గోనె శ్యాంసుందర్**



స్థానికంగా పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు కూలి రేట్లు పెంచాలని కోరుతుంటే ఇక్కడ కార్మికులకు కూలి రేట్లు పెంచకుండా ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి వారికి తక్కువ వేతనాలు ఇచ్చి పని చేస్తున్నారని దీంతో స్థానికంగా పనిచేస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని భవన నిర్మాణ కార్మికుడు గోనె శ్యాంసుందర్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల మధ్య పోటీని పెంచే విధానాల కంటే,అందరికీ న్యాయం చేసే సమతుల్య విధానాలే ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం చూపాలన్నారు.

# గ్యాస్ కొరతతో ఆటో డ్రైవర్ల అవస్థలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గల్ఫ్ దేశాల్లో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు హైదరాబాద్ నగరంలో గ్యాస్ ఆటో డ్రైవర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎల్‌పిజి, సిఎన్‌జి సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో ఆటో డ్రైవర్లు రోజువారీ జీవనోపాధి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని అనేక ఆటో గ్యాస్ బంకుల వద్ద గంటల తరబడి క్యూలు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల స్టాక్ లేక బంకులు మూసివేశారు.గ్యాస్ దొరకకపోవడంతో ఆటోలు రోడ్లపైకి రావడం తగ్గిపోగా, డ్రైవర్ల ఆదాయం గణనీయంగా పడిపోయింది. రోజుకు సాధారణంగా సంపాదించే మొత్తంలో సగానికి కూడా చేరడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన డిమాండ కారణంగా కొన్ని చోట్ల అధిక ధరలకు గ్యాస్ విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇదే సమయంలో గ్యాస్ కొరత ప్రభావం ప్రయాణికులపై కూడా పడుతోంది. ఆటోలు సులభంగా దొరకకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు.గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ పరిస్థితుల కారణంగా సముద్ర మార్గాలపై ఒత్తిడి పెరగడం, దిగుమతుల్లో ఆలస్యం చోటుచేసుకోవడం వల్ల దేశవ్యాప్తంగా ఎల్‌పిజి సరఫరా దెబ్బతిన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా పర్యవేక్షణను కట్టుదిట్టం చేస్తూ బ్లాక్ మార్కెటింగ్‌పై చర్యలు తీసుకుంటున్నాయి. అయినప్పటికీ, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. మొత్తానికి గల్ఫ్ యుద్ధ ప్రభావం హైదరాబాద్ నగరంలో గ్యాస్ ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతూ, నగర రవాణా వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తోంది.

# అమెరికా, ఇజ్రాయెల్‌ల వలసాధిపత్యం ప్రపంచ శాంతికి విఘాతం

టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దూకుడు వైఖరి వల్ల ప్రపంచం నేడు తీవ్ర కల్లోలంలోకి నెట్టబడిందని తెలంగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులు కేవలం సైనిక సంఘర్షణ మాత్రమే కాదని, ఇది ఒక అమానవీయ మారణహోమమని ఆయన శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. చమురు, సహజ వనరుల కోసం అమెరికా అనుసరిస్తున్న సామ్రాజ్యవాద ధోరణిని కోదండరాం తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో ఇరాక్, వెనిజులా దేశాలను అతలాకుతలం చేసిన ఆధిపత్య వైఖరి ఇప్పుడు ఇరాన్‌పై పడిందని విమర్శించారు. ఇరాన్ అణుబాంబు తయారు చేస్తోందన్న అమెరికా ప్రచారం అబద్ధమని అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఎఈఎ) స్పష్టం చేసినప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం పట్టించుకోకుండా దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. 2025 జూన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన బాంబు దాడుల్లో ఎంతోమంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆయన గుర్తు చేశారు.

**ఆర్థిక సంక్షోభం – భారత్‌పై ప్రభావం**

ప్రస్తుత యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా భారతదేశం ఎదుర్కోబోయే సవాళ్లను ఆయన ఈ ప్రస్తావించారు. పెట్రోల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకనున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు 15 లక్షల మంది తెలంగాణ వారు, మొత్తం కోటి మంది భారతీయుల ప్రాణాలు, ఉపాధి ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. చమురు దిగుమతులపై ఆధారపడిన భారత్‌లో చిన్న వ్యాపారాలు, హోటళ్లు మూతపడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై దాడులు జరుగుతున్న సమయంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలను కోదండరాం విమర్శించారు. యుద్ధోన్మాదులతో జతకట్టినట్లుగా భారత్ వ్యవహరిస్తోందని, అమెరికాను ప్రసన్నం చేసుకోవడానికి ఇరాన్ చమురు ట్యాంకర్లను స్వాధీనం చేసుకోవడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్రం అలీనోద్యమ స్ఫూర్తితో వ్యవహరించి, యుద్ధాన్ని ఆపడానికి దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

**యుద్ధ వ్యతిరేక ర్యాలీకి పిలుపు**

ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వానికి తన బాధ్యతను గుర్తు చేస్తూ ఈనెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే యుద్ధ వ్యతిరేక ర్యాలీలో ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణ మధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in లో చూడగలరు.

ఇ-టెండర్ ప్రకటన నెం: N-SG-36- 2025-26-Conf-48, తేది: 23.03.2026 PUB/2188

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు, Sr.DSTE/NED వారు ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ సంఖ్య మరియు తేదీ:** N-SG-36-2025-26-Conf-48, తేదీ 23.03.2026. **పని పేరు:** నాందేడ్ (NED) లోని DRM కార్యాలయ ప్రాంగణంలో, తమ నిర్దేశిత కాలపరిమితి (Codal Life) పూర్తి చేసుకున్న కాన్ఫరెన్స్ హాల్ పరికరాల మార్పిడి (టెలికాం ఏర్పాట్ల విస్తరణ/ అప్‌గ్రేడేషన్). **అంచనా ప్రాజెక్టు వ్యయం (రూ.):** ₹ 57,87,118/-. **బిడ్ భద్రతా మొత్తం (Bid Security) (రూ.):** ₹ 1,15,800/-. **పని పూర్తి చేయడానికి గడువు:** 09 నెలలు. **బిడ్ దాఖలుకు చివరి తేదీ (Bid Due Date):** 15.04.2026న 15:00 గంటల వరకు. **బిడ్ల ప్రారంభ తేదీ:** 15.04.2026న 15:00 గంటల తర్వాత. **ఆఫర్ చెల్లుబాటు కాలం:** బిడ్ దాఖలుకు చివరి తేదీ నుండి 60 రోజులు. **టెండర్ పుస్తకం ధర (రూ.):** ₹ 0/-.

బిడ్ల దాఖలు ప్రక్రియ అంతా భారతీయ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా మాత్రమే జరుగుతుంది. ఈ టెండర్‌కు సంబంధించి మాన్యువల్ (చేతి రాత/ కాగితపు రూప) ఆఫర్లకు అనుమతి లేదు. తదుపరి వివరాలను **www.ireps.gov.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నాందేడ్.**

ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-23-2025-26 తేదీ: 24.03.2026 PUB/2189

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు, దిగువ సంతకం చేసిన అధికారి, 15.04.2026 తేదీన మధ్యాహ్నం 3:00 గంటల వరకు, ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 **టెండర్ సంఖ్య:** B/E.221/TRS/RC/572 ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-23-2025-26 తేదీ: 24.03.2026 **పని పేరు:** విజయవాడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో BG ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల (WAP4, WAG5, WAP7 & WAG9 HC) బోగీ ఫ్రేమ్‌ల మధ్యంతర మరమ్మత్తు (Intermediate over-hauling) పనులు. **టెండర్ విలువ (రూ.):** 2,45,36,156.63 **E.M.D (ముందస్తు ధరావత్తు):** 4,90,700/- **టెండర్ పత్రాల ధర (రూ.):** 0 **పని పూర్తి కాలపరిమితి:** 24 నెలలు (2 సంవత్సరాలు) **టెండర్ ముగింపు తేదీ & సమయం:** 15.04.2026, మధ్యాహ్నం 3.00 గంటలు.

1) టెండర్ నిబంధనలు / పని పేరు పూర్తి వివరాలు, పైన పేర్కొన్న పనికి సమానమైన స్వభావం గల పనులు, అర్హత ప్రమాణాలు మొదలైన ఇతర వివరాలు **www.ireps.gov.in** అనే వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్ దాఖలు చేయాలనుకునే వారు, ఏదైనా టెండర్‌కు సంబంధించి ఏవైనా మార్పులు / సవరణలు (corrigenda) ఉన్నాయేమో గమనించడానికి, టెండర్ ముగింపు తేదీకి ముందే **www.ireps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా సూచించడమైనది.
3) ఈ టెండర్ ప్రకటన, విజయవాడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్, ట్రాక్షన్ రోలింగ్ స్టాక్ విభాగంలో ఉన్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై కూడా ప్రదర్శించబడింది; ఆసక్తి గలవారు దీనిని అక్కడ చూడవచ్చు.
4) ఎటువంటి కారణం చూపకుండానే టెండర్ను రద్దు చేసే హక్కు రైల్వే శాఖకు ప్రత్యేకంగా ఉంది.
**డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS), ELS, విజయవాడ.**

ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-24-2025-26 తేదీ: 24.03.2026 PUB/2190

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు, దిగువ సంతకం చేసిన అధికారి, 15.04.2026 తేదీన మధ్యాహ్నం 3:00 గంటల వరకు, ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 **టెండర్ సంఖ్య:** B/E.221/TRS/RC/573 ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-24-2025-26 తేదీ: 24.03.2026 **పని పేరు:** ELS/BZA - Hitachi TM Stators (రకం HS15250A) యొక్క యాంత్రిక పునరుద్ధరణ (Mechanical Rehabilitation). **టెండర్ విలువ (రూ.):** 69,60,080.05 **E.M.D (రూ.):** 1,39,200/- **టెండర్ పత్రం ధర (రూ.):** 0 **పని పూర్తి కాలం:** 24 నెలలు (2 సంవత్సరాలు) **టెండర్ ముగింపు తేదీ & సమయం:** 15.04.2026, 15.00 గంటలు.

1) టెండర్ నిబంధనలు / ఇతర వివరాలు (పని పేరు పూర్తి వివరాలు, పై పనికి సమానమైన స్వభావం గల పనులు, అర్హత ప్రమాణాలు మొదలైనవి) **www.ireps.gov.in** అనే వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్ ముగింపు తేదీకి ముందే, ఏవైనా మార్పులు / సవరణలు (corrigenda) ఉన్నాయేమో గమనించడానికి, ఆసక్తిగల టెండర్ దారులు **www.ireps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.
3) ఈ టెండర్ ప్రకటన, విజయవాడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్, ట్రాక్షన్ రోలింగ్ స్టాక్ విభాగంలో ఉన్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై కూడా ప్రదర్శించబడింది; దీనిని అక్కడ చూడవచ్చు.
4) ఎటువంటి కారణం చూపకుండానే టెండర్ను రద్దు చేసే హక్కు రైల్వే శాఖకు ప్రత్యేకించబడి ఉంది.
**డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS), ELS, విజయవాడ.**

టెండర్ ప్రకటన నెం: CRS-E-15-25-26 PUB/2192

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న DY.CME/CRS/TPTY, ఇక్కడ పేర్కొన్న టెండర్ నెం: కు గాను, క్రింద పేర్కొన్న చివరి తేదీ ఉదయం 11:00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. బిడ్డరు తమ అసలు / సవరించిన బిడ్డను చివరి తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు స్వీకరించబడిన అటువంటి ఏదైనా మాన్యువల్ ఆఫర్ విస్మరించబడుతుంది.

క్ర.సం.: 01 **పని వివరణ:** టెండర్ నెం: CRS-E-15-25-26 తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాప్ వద్ద విద్యుత్ సరఫరా ఏర్పాట్ల విశ్వసనీయతను మెరుగుపరచడానికి వెస్ట్ కాలనీలో OH లైన్లను UG కేబుల్స్‌గా మార్చడం సుమారు. **వ్యయం (రూ.)లలో:** 1,86,00,143.50/- **బిడ్ సెక్యూరిటీ (రూ.)లలో:** 3,72,000 **పూర్తిచేయడానికి కాలపరిమితి:** 90 రోజులు **ముగింపు తేదీ:** 16.04.2026 ఉదయం 11:00 గంటలకు.

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in
టెండర్ పూర్తి వివరాలు చూడగలిగే నోటీస్ బోర్డ్ చిరునామా: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి. మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం (టెండర్ పత్రాలలో లభ్యం) మరియు టెండర్ పత్రాలు, సవరణలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి మా వెబ్‌సైట్ https://www.ireps.gov.in ను సందర్శించండి.
**డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, CRS, తిరుపతి**

ఇ-టెండర్ ప్రకటన నెం: S&T/06/2026, తేదీ: 26.03.2026. PUB/2191

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు, దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్లు విభాగం యొక్క సీనియర్ డివిజనల్ సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ (నిర్వహణ), 20.04.2026 తేదీన మధ్యాహ్నం 3.00 గంటల వరకు, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను (ఓపెన్) ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం:** 01-SNT-06-2026 **పని వివరణ (సిగ్నల్ మరియు టెలికాం పనులు):** (1) గుంతకల్లు డివిజన్‌లోని RU-GY సెక్షన్‌లో TTR (రైలు పట్టాల మార్పిడి) పనులకు సంబంధించిన S&T (సిగ్నల్ మరియు టెలికాం) అవసరాలు. (2) గుంతకల్లు డివిజన్‌లోని BAY-GTL & GTL-WD సెక్షన్లలో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (3) గుంతకల్లు డివిజన్‌లోని RU-TPTY-KPD సెక్షన్‌లో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (4) గుంతకల్లు డివిజన్‌లోని GDR-TPTY సెక్షన్‌లో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (5) గుంతకల్లు డివిజన్‌లోని RU-GY & NDL-DHNE సెక్షన్లలో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (6) ONTIMITTA (VNM) స్టేషన్: ప్రతిపాదిత PQRS సైడింగ్‌కు సంబంధించిన సిగ్నలింగ్ & టెలికాం ఏర్పాట్లు. (7) SSE/P-Way/CTO అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (8) SSE/P-Way/PAK అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (9) SSE/P-Way/ATP అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (10) SSE/P-Way/KLU అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (11) SSE/P-Way/MPL అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (12) SSE/P-Way/GY అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు మరియు (13) SSE/P-Way/KDP అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. **పని యొక్క ప్రకటిత టెండర్ విలువ (రూ.):** 7,80,11,605.40. **ఎర్నస్ట్ మనీ డిపాజిట్ (EMD) (రూ.):** 5,40,100.00. **పనుల పూర్తి కాలపరిమితి:** 12 నెలలు.

టెండర్ల ప్రారంభ తేదీని ఆ తర్వాత సెలవు దినంగా ప్రకటించినట్లయితే, టెండర్లను తదుపరి పని దినాన నిర్దేశించిన సమయంలో తెరవడం జరుగుతుంది. ఆఫర్ యొక్క చెల్లుబాటు, టెండర్లు తెరిచిన తేదీ నుండి **60 రోజులు** ఉండాలి. అవసరమైతే, పై టెండర్ నోటీసుకు సవరణలు (corrigendum) కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడతాయి. మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి **www.ireps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించండి.
**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, (ఎం), గుంతకల్.**

టెండర్ ప్రకటన నెం: B-E29-TRD-TNDR-49-2025-26 తేదీ: 25.03.2026 PUB/2194

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు, ఈ క్రింద సంతకం చేసిన అధికారి ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం:** B-E29-TRD-TNDR-49-2025-26 **పని పేరు:** BZA డివిజన్‌లోని NDD యార్డ్‌లో యార్డ్ పునఃవ్యవస్థీకరణ పనులకు సంబంధించి OHE (ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్)లో అదనపు పనులు మరియు మార్పులు చేయడం. **సుమారు విలువ (రూ.):** 1,73,36,827.70 **బిడ్ సెక్యూరిటీ (EMD) (రూ.):** 2,36,700/- **పని పూర్తి కాలం:** 12 నెలలు **ముగింపు తేదీ:** 16.04.2026 **టెండర్ ఫారం ధర:** నిల్ (Nil).

పూర్తి వివరాలు మరియు నిబంధనల కోసం మా వెబ్‌సైట్ **www.ireps.gov.in** ను సందర్శించండి.
**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, TrD, విజయవాడ.**

ఇ-టెండర్ ప్రకటన నెం: GNT/SG/36/373 తేది: 25.03.2026 PUB/2195

ఈ క్రింద పేర్కొన్న పనుల కోసం, **17.04.2026 తేదీ సాయంత్రం 4:00 గంటల** వరకు ఇ-టెండర్లను ఈ క్రింద సంతకం చేసిన అధికారి ఆహ్వానిస్తున్నారు.

**ఐడి నెం:** 373 **పని పేరు:** గుంటూరు డివిజన్ పరిధిలోని GNT-RAL & PGRN-SYM సెక్షన్ల రైలు మార్గం (Track) పక్కన 2x48 OFC (96 ఫైబర్లు) సరఫరా, అమర్చడం (Laying), కందకాలు తవ్వడం (trenching), డక్ట్ వేయడం, బ్లోయింగ్ మరియు టెర్మినేషన్ పనులు. **ప్రకటించిన టెండర్ విలువ (రూ.):** 9,03,54,104.15 **E.M.D/బిడ్-సెక్యూరిటీ (రూ.):** 18,07,100/- **టెండర్ పత్రం ధర (రూ.):** నిల్ (NIL).

1. ఒకవేళ టెండర్లు తెరిచే తేదీని, ఆ తర్వాత ఏదైనా కారణం చేత సెలవు దినంగా ప్రకటిస్తే, ఆ టెండర్లను తదుపరి పని దినం నాడు నిర్దిష్ట సమయానికి తెరుస్తారు.
2. ఇ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి **తేదీ: 17.04.2026, సాయంత్రం 4:00 గంటల** వరకు. వివరమైన సమాచారం కోసం, మా వెబ్‌సైట్ **www.ireps.gov.in** ను సందర్శించండి.
3. తదుపరి సమాచారం లేదా సవరణలు ఏవైనా ఉంటే, అవి కేవలం **www.ireps.gov.in** అనే ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే తెలియజేయబడతాయి.
**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, గుంటూరు.**
A2771

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.





# అట్టహాసంగా సాగిన శోభాయాత్ర

-డ్రోన్లు, సీసీ కెమెరాలతో గట్టి నిఘా
-మూడు వేల మందితో పోలీసు బందోబస్తు
-బందోబస్తును పర్యవేక్షించిన కోత్వాల్ సజ్జనార్

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర అట్టహాసంగా ముగిసింది. కోర్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వయోబేధం లేకుండా భక్తులు ర్యాలీలుగా తరలివచ్చి ప్రధాన యాత్రలో కలవడం జరిగింది. భక్తులు కాషాయజెండాలు చేతిలో పట్టుకుని జైశ్రీరాం నినాదాలతో చేస్తుండటంతో శోభాయాత్ర హోరెత్తింది. సీతారాంబాగ్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర హనుమాన్‌టెకిడీలోని హనుమాన్ వ్యాయామశాల వద్ద ముగిసింది. ట్రై మున్సిపల్ కమిషనరేట్ల పరిధిలో నుంచి వచ్చిన సమూహాలు ప్రధాన యాత్రలో కలవడంతో సీతారాంబాగ్, మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్, బజార్‌ఘాట్, కార్వాన్, జియాగూడ, దూల్‌పేట్, మంగళ్‌హాట్, పురానాపూల్, నాంపల్లి, కోఠి, రాంకోఠి, కింగ్ కోఠి, అబిడ్స్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజీబీఎస్, పుత్లీబౌలి, చాదర్ ఘాట్, మలక్‌పేట్, సుల్తాన్‌బజార్... తదితర ప్రాంతాలలో ట్రాఫిక్‌జామ్‌లు కనిపించారు. ముందస్తుగానే ట్రాఫిక్ ఆంక్షలు విధించినప్పటికీ వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడాల్సివచ్చింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సీతారాంబాగ్‌లోని ఆలయంలో సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు గవర్నర్‌కు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఇదిలాఉండగా క్యూర్ పరిధిలోని దాదాపు 700 ప్రాంతాల్లోని ఆలయాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. ఆలయాల ప్రాంగణాల వద్ద కళ్యాణమండపాలు ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరాముని భక్తి గీతాలతో సంప్రదాయంగా వేడుకలు జరిగాయి. కాలనీలు, బస్తీల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న లక్షలాది మంది భక్తులు సీతా రాముల కళ్యాణం తిలకించి తన్మయం పొదారు. శ్రీరామనవమి శోభాయాత్రను పురస్కరించుకుని కోత్వాల్ సజ్జనర్ సీతారాంబాగ్ పరిసరాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ, నగరంలో జరుగుతున్న శ్రీరాముడి శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. యాత్ర మధ్యాహ్నం 2 గంటలకు సీతారాంబాగ్ ఆలయం నుంచి ప్రారంభమై రాత్రి 10 గంటల కల్లా ముగిసేలా పక్కా రూట్ మ్యాప్ సిద్ధం చేశామని వివరించారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో కలిసి యాత్ర సాగే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఎక్కడా ఎటువంటి ఆటంకాలు కలగకుండా డ్రోన్లు, సీసీ టీవీ కెమెరాల ద్వారా నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు. భారీ శోభాయాత్ర కోసం దాదాపు 3 వేల మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**నిలిచిన శోభాయాత్ర...**
శ్రీరాముని శోభాయాత్ర మంగళ్‌హాట్ ప్రాంతంలో రెండు గంటల పాటు నిలిచిపోయింది. మంగళ్‌హాట్‌లో ప్రధాన విగ్రహం ఉన్న వాహనానికి అడ్డుగా ఒక ఇంటి పిల్లర్‌తో ఇబ్బంది కలిగించింది. ఇటీవల నిర్మాణం చేపట్టిన ఇంటి పిల్లర్‌ను తొలగించేందుకు రెండు గంటలుగా శ్రమించాల్సి వచ్చింది.

# సిర్సనగండ్లలో సీతారాముల కల్యాణోత్సవం

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/ కల్వకుర్తి :** చారిత్రాత్మక పుణ్య క్షేత్రమైన సిర్సనగండ్లలో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. లోక కళ్యాణం కోసం జరిగిన సీతారాముల కళ్యాణోత్సవంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

**దక్షిణ అయోధ్యగా తీర్చిదిద్దుతాం మంత్రి జూపల్లి**
పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి జూపల్లి కృష్ణా రావు మాట్లాడుతూ.. సిర్సనగండ్ల క్షేత్రానికి ఉన్న విశిష్టతను కాపాడుతూ, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక పరంగా కూడా అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మక్తల్‌లో శ్రీరామనవమి వేడుకలు





పాల్గొన్న పలువురు ప్రముఖులు


**ప్రజాపక్షం/మక్తల్:** శ్రీరామనవమి సందర్భంగా మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో వద్ద రామ్ లీలా మైదానంలో సీతారాములు కళ్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రామ్ లీల్ మైదానంలో వేలాదిమంది భక్తుల మధ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, ప్రాణేషాచారి గాయత్రి దంపతుల ఆధ్వర్యంలో విధ్వాన్ రాఘవేంద్ర ఆచార్య సీతారాముల కళ్యాణం జరిపించగా విద్వాన్ రాఘవేంద్ర ఆచార్య వేదమంత్రోచ్చారణలు మధ్య కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దంపతులు భద్రాచలం లో శ్రీ రామ నవమి వేడుకలను హాజరు కాగా మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి రాధిక దంపతులు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాజాబజంత్రీల మధ్య రామ్ లీలా మైదానానికి ఊరేగింపుగా పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి అర్చకులకు అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగా దామోదర్ జూవైలర్స్ యజామాని తాళం పల్లి రమేష్, కాత్త శ్రీనివాస్ గుప్తా కూడా స్వామి వారికి ముత్యాల తలంబ్రాలను ఆనవాయితీగా అందజేశారు. రామ్ లీలా మైదానంలో జరిగిన కళ్యాణ మహోత్సవం వేడుకలకు వేలాది మంది భక్తులు తరలి వచ్చి తిలకించారు. వేద పండితులు పేద మంత్రోచ్చారణల మధ్య రాములు వారి కళ్యాణ వైభోగం కన్నుల పండువగా సాగింది. సందర్భోచితంగా విద్వాన్ రాఘవేంద్ర ఆచార్య రామయణ ఇతిహాసాలను ఘట్టాలను భక్తులకు వివరించారు. రాములవారి 14 ఏళ్ళ అణ్యావాసం ఆ తరువాత పట్టాభిషేకం రాజ్య పాలన వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హన్మంతు, మార్కెట్ చైర్పర్సన్ జి. రాధాలక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య, బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా, వివిధ పార్టీల నాయకులు జి. గోపాల్ రెడ్డి, బి. రాజశేఖర్ రెడ్డి, పికె. నర్సింహ, కావలి తాయప్ప, దేవరింటి నరసింహారెడ్డి, రాజాగౌడ్, కట్ట సురేష్ కుమార్ గుప్తా, అమరేందర్ రెడ్డి, బి. గణేష్ కుమార్, బోయ రవికుమార్, కావలి శ్రీహరి, ఆలయ సిబ్బంది అరవింద చారి, కుమ్మరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. శ్రీరామనవమి సీతారాముల కళ్యాణం సందర్భంగా స్థానిక సిఐ రామ్ లాల్, ఎస్సై వై. భాగ్యలక్ష్మి రెడ్డి, రేవతి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కళ్యాణం సమయంలో దేవాలయం ముందు నుండి వెళ్లే సంఘం బండ రోడ్డును మూసివేశారు. ఈ సందర్భంగా సంగంబండకు చెందిన గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి మంజుల దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



# సంధ్యారాగాలు సంగీత విభావరి

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** ఆర్ఐఎఫ్ మ్యూజిక్ ఫెస్ట్ ఆధ్వర్యంలో సంధ్యారాగాలు శీర్షికన త్యాగరాయగానసభలో సినీ సంగీత విభావరి జరిగింది. పద్మిని సంధ్య విరాట్ తెలుగు, హిందీ పాటలు ఆలపించారు. మెలోడీ సాంగ్స్‌తో ఆహుతుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా బాలలు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు.

# ప్రైవేట్ హాస్టల్ భోజనంలో బల్లి!



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హన్మకొండ లోని ఓ ప్రయివేట్ హాస్టల్ భోజనంలో బల్లి రావడం తో హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులు ఆందోళనకు గురైయ్యారు భోజనం లో బల్లి వచ్చిన ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది హన్మకొండ భీమారం లోని ఎస్ వీ ఎస్ కళాశాల సమీపంలో ఉన్న శశాంక బాయ్స్ హాస్టల్ లో గురువారం భోజనం లో బల్లి వచ్చింది దింతో ఒక్కసారిగా ఆందోళనకు గురైన హాస్టల్ విద్యార్థులు హాస్టల్ నిర్వాహకులకు చెప్పడంతో వారు విద్యార్థులను సముదాయించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది ఇందుకు విద్యార్థులు ససేమిరా అని అధికారులకు పిర్యాదు చేయడంతో హాస్టల్ కు వచ్చి భోజనాన్ని పరిశీలించిన ఫుడ్ ఇన్స్పెక్టర్ హాస్టల్ నిర్వాహకులకు 15వేల రూపాయల జరిమాన విధించినట్లు సమాచారం.. కాగా ఈ హాస్టల్ ఎప్పుడు వివాదాస్పదంగానే కొనసాగుతున్నట్లు తెలిసింది గతంలో గంజాయి విషయంలో పోలీసులు ఈ హాస్టల్ లో కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా హాస్టల్ పేరు తో బోర్డు లేదు, కనీసం పరిశుభ్రత పాటించడం లేదు...అయినా ఇవేం పట్టించుకోకుండా జిల్లా ఆహార భద్రత శాఖ అధికారులు కేవలం 12 వేల రూపాయలు పెనాల్టీ వేసి... మాముల్లు లు తీసుకొని హాస్టల్ సీజ్ చేయకుండా... తూతూ మంత్రంగా వ్యవహరించారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల వెంటనే స్పందించి సంబంధిత హాస్టల్ ఓనర్ పై చర్యలు తీసుకొని వెంటనే హాస్టల్లో సీజ్ చేయాలని పలువురు అధికారులను డిమాండ్ చేస్తున్నారు...

# కన్నుల పండువగా సీతారామ కల్యాణం




**ప్రజాపక్షం/చార్మినార్/వెంగళరావునగర్:** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అసోసియేషన్ కోశాధికారి సుగుణ రాజబాబు నివాసం నుంచి సీతమ్మతల్లిని పెళ్ళికూతురుగా అలంకరించి ఊరేగింపుగా కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు.



**కంటోన్మెంట్ పరిధిలో...**
రాములోరి కళ్యాణం కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆరో వార్డులో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో బీఆర్ఎస్ నాయకుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**దూద్‌బౌలి ప్రాంతంలో...**
శ్రీరామనవమి పురస్కరించుకొని దూద్‌బోలిలోని కాల్ బైరవ హనుమాన్ ఆలయంలో చార్మినార్ డిసిపి కారే కిరణ్ ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర ప్రారంభించారు. ఇదిలాఉండగా.. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఈరోజు 25వ సీతారామచంద్రస్వామి తిరు కళ్యాణ మహోత్సవ సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులు, ప్రభుత్వ హాస్టల్ వ్యక్తులను అతిథులుగా ఆహ్వానించి, వారికి భోజనాలు అందించి స్వామివారి ఆశీర్వాదాలు ఇప్పించడం జరిగింది, కార్యక్రమంలో చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ముగ్గంటి సుశీల్ కుమార్ చారి, కోశాధికారి గుండు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్...**
శ్రీరామనవమి వేడుకలను వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ బిజెపి శ్రీధర్‌రెడ్డి విచ్చేసిన సందర్భంగా ప్రముఖ బిల్డర్ ఏడుకొండలు, గట్టు వెంకటేష్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ గడిగే కృష్ణ గౌడ్, జనరల్ సెక్రెటరీ చెన్నయ్య, వైస్ ప్రెసిడెంట్ మహేందర్ యాదవ్, రాఘవేందర్, ట్రెజరర్ సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిఎం, సిఎం, మంత్రులను తొలగించేందుకు ఉద్దేశించిన బిల్లులను పరిశీలించే..

# జెపిసికి నివేదిక సమర్పణకు మరింత గడువు

**న్యూఢిల్లీ :** తీవ్రమైన ఆరోపణలపై వరుసగా 30 రోజులపాటు అరెస్ట్‌లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీకి తన నివేదికను సమర్పించడానికి మరింత గడువును ఇచ్చారు. 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు కమిటీకి లోక్‌సభ శుక్రవారం సమయం ఇచ్చింది.సాధారణంగా వర్షాకాల సమావేశాలు జూలై మూడవ వారంలో ప్రారంభమవుతాయి. బిజెపి నేత అపరాజితా సారంగి అధ్యక్షతన ఏర్పాటైన ఈ జాయింట్ పార్లమెంటరీ కమిటీ మూడు బిల్లులను పరిశీలిస్తోంది. అవి రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు2025, జమ్మూకశ్మీర్ (పునర్వ్యవస్థీకరణ) బిల్లు 2025, కేంద్రపాలిత ప్రాంతాల (సవరణ) బిల్లు2025. గత ఏడాది ఆగస్టు 20న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ బిల్లులను ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లులను కమిటీకి పంపించారు.




# వసుంధర సంస్థ సేవలు హర్షణీయం

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** సామాజిక, సాహిత్య రంగాలలో తనదైన ముద్రవేసుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాణిస్తున్న వసుంధర విజ్ఞాన వికాస మండలి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి కొనియాడారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కర్కముత్తారెడ్డి స్మారక కవితా పురస్కారాలు, కోలరాజు సూపర్ డాడీ పురస్కారాలు, చంద్రమోహన్ విద్యా రత్న పురస్కారాలు, జాతీయ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి జాతీయ పురస్కారాలు, నగదు బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వండర్‌బుక్ రికార్డ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, ప్రముఖ సంపాదకులు బొమ్మకంటి శ్రావణ్‌కుమార్, కోల మాధూరి, బద్దిపడగ రమేష్, కొత్త రాజేష్, ఇరుమళ్ల సుమలత, కట్కూరి శంకర్, చదువు వెంకటరెడ్డి, స్వప్నసోని, జావేద్ పాషా, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెరుగుతున్న ఇంధన ధరల పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లీటరు పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని 13 రూపాయల నుంచి 3 రూపాయలకి తగ్గించింది. లీటరు డీజిల్‌పై 10 రూపాయలుగా ఉన్న సుంకాన్ని సున్నాకు తగ్గించింది. ఈ తగ్గింపు తక్షణమే అమలులోకి వస్తుందని కేంద్రం తెలిపింది. ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. ప్రపంచ ముడిచమురు సరఫరాలో దాదాపు 20 నుంచి 25 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటింది. అయినప్పటికీ, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసి రిటైల్ ధరలను పెంచకుండా స్థిరంగా ఉంచాయి. దీనివల్ల ఆయా సంస్థలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ కేంద్రం ఈ ప్రకటన చేసింది. ఈ నిర్ణయంతో రిటైల్ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గే అవకాశం లేకపోయినా ఇంధన ధరల భారాన్ని చమురు కంపెనీలు ప్రజల పైకి బదిలీ చేయకుండా ఉపకరించనుంది. డీజిల్ ఎగుమతులపై 'విండ్‌ఫాల్ ట్యాక్స్'ను లీటరుకు రూ. 21.5గా నిర్ణయించింది. ఇదిలా ఉండగా, విమాన ఇంధనం ఏవియేషన్ ట్బన్ ఫ్యూయల్‌పై ఇటీవల కేంద్రం స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని తీసుకొచ్చింది. తాజాగా ప్రకటించిన మినహాయింపులతో ఇది లీటరుకు రూ. 29.5కు తగ్గింది.



**వదంతులు నమ్మొద్దు: కేంద్రం**


అలాగే, దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందనే వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ వార్తలను తోసిపుచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా సాధారణంగానే జరుగుతుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశంలోని అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని, ముడిచమురు నిల్వలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగినప్పటికీ, ఆ భారాన్ని కేంద్రం ప్రజలపై వేయడం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 20శాతం నుంచి 50 శాతం వరకు పెరిగినా, భారత్‌లో మాత్రం ధరలు స్థిరంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇదే విషయంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా స్పందించారు. సంక్షోభం నేపథ్యంలో వినియోగదారులను రక్షించడానికి పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 10 చొప్పున తగ్గించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 94.77 రూపాయల ఉండగా, డీజిల్ ధర 87.67 రూపాయల వద్ద కొనసాగుతున్నాయి. వ్యాట్, ఇతరత్రా సుంకాలతో కలిసి వివిధ రాష్ట్రాల్లో ఈ ధరలు విభిన్నంగా ఉంటాయి. హైదరాబాద్‌లో రూ.107.46, కోల్‌కతాలో రూ. 103.54, ముంబయిలో రూ. 103.54, బెంగళూరులో రూ. 102.96గా ధరలు ఉన్నాయి.

## ఎక్సైజ్ సుంకం తగ్గింపు ప్రకటన...

# ఏప్రిల్ 30 వరకు ఆగలేరా?

### కేంద్రాన్ని కాంగ్రెస్ నిలదీత

**న్యూఢిల్లీ :** పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడంపై కాంగ్రెస్ స్పందించింది. అసెంబ్లీ ఎన్నికల కారణంగానే తగ్గించిందని ఆరోపించింది. గత 12 ఏళ్లలో ఏడు వేర్వేరు సందర్భాల్లో ప్రపంచ ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ భారతదేశంలో వినియోగదారుల ధరలు తగ్గలేదని కూడా ఆ పార్టీ ఎత్తి చూపింది. ప్రభుత్వం పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.3కి తగ్గించి, డీజిల్‌కు సుంకం నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చిన నేపథ్యంలో ప్రతిపక్షం ఈ విమర్శలు చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మాట్లాడుతూ, 'గత 12 ఏళ్లలో ఏడు వేర్వేరు సందర్భాల్లో ప్రపంచ ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ భారతదేశంలో వినియోగదారుల ధరలు తగ్గలేదన్నారు. నేడు ఈ ఎక్సైజ్ సుంకం తగ్గింపు ప్రకటన అసెంబ్లీ ఎన్నికల కారణంగానే చేశారని, ఏప్రిల్ 30వ తేదీ వరకు ఆగలేకపోయారా అని నిలదీసింది. అసోం, కేరళ, పుదుచ్చేరిలలో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 9న ఒకే రోజున, తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. అన్ని ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది.



కాగా, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతున్నాయి అనే శీర్షికలను చూసి, ప్రభుత్వం ఉపశమనం కలిగించిందని అనుకుంటే పొరబడినట్లే అని కాంగ్రెస్ మీడియా ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా అన్నారు. ప్రస్తుతానికి, డీలర్లకు, వినియోగదారులకు ధరలు యథాతథంగానే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'వాస్తవానికి తగ్గించింది ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం మాత్రమే. ఇది ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రభుత్వానికి చెల్లించే పన్ను. 'ప్రత్యేక', 'అదనపు' అనే పదాలే ఈ పన్ను ఎంత అనవసరమో తెలియజేస్తున్నాయి' అని ఖేరా 'ఎక్స్'లో పోస్టు చేశారు. పశ్చిమ ఆసియాలో సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి ఈ కంపెనీలు నష్టాలను భరిస్తున్నాయని ఆయన ఎత్తి చూపారు. దాదాపు నెల రోజుల తర్వాత ప్రత్యేక అదనపు సుంకాన్ని తగ్గించడం ద్వారా, ఆ భారాన్ని కొంతమేర పంచుకోవడానికి ప్రభుత్వం ఇప్పుడు కేవలం అంగీకరించిందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'ఉపశమనం అనేది కేవలం ప్రచారంలోనే ఉంది, వాస్తవంలో కాదు. శీర్షికలను సృష్టించి ప్రజలను మోసం చేయడానికి బదులుగా, ప్రభుత్వం వినియోగదారులకు నిజమైన ఉపశమనం అందించడంపై దృష్టి పెట్టాలి' అని ఆయన అన్నారు. మరో పోస్ట్‌లో ముడి చమురు ధరలతో సంబంధం లేకుండా, ఏళ్ల తరబడి ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఖేరా ఎత్తి చూపారు. భారత్ రష్యా నుండి కూడా తక్కువ ధరకు ముడి చమురును కొనుగోలు చేసింది, కానీ ఆ ప్రయోజనం వినియోగదారులకు ఉపశమనంగా మారలేదని ఆయన అన్నారు. ఇది అంబానీలను మరింత ధనవంతులను మాత్రమే చేసిందని ఖేరా అన్నారు. 2014 నుండి 2026 మధ్య, ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని మొత్తం 21 సార్లు సవరించి, అందులో 12 సార్లు పెంచింది. అచ్చే దిన్ అంటూ ఇంకేముంది అంటూ ఎద్దేవా చేశారు.

## మెరుగవుతున్న సోనియాగాంధీ ఆరోగ్యం




**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ శరీరమంతటా వ్యాపించిన ఇన్ఫెక్షన్‌కు గత మూడు రోజులుగా చికిత్స పొందుతున్నారు. అయితే ఆమె ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని, ఒకటి రెండు రోజుల్లో సోనియాగాంధీని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తారని ఆమె వైద్యులు శుక్రవారం తెలిపారు. అస్వస్థతకు 79 ఏళ్ల ఈ నాయకురాలిని మంగళవారం రాత్రి ఢిల్లీలోని సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేర్చారు. సోనియాగాంధీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతూ సౌకర్యవంతంగా ఉందని ఆసుపత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ తెలిపారు. 'ఆమె అటూ ఇటూ నడుస్తున్నారు, అల్పాహారం కూడా తీసుకున్నారు. మొత్తం మీద, ఆమె ఆరోగ్యం సజావుగా సాగుతోంది, ఒకటి రెండు రోజుల్లో ఆమె డిశ్చార్జ్ అయ్యేంత ఫిట్‌గా ఉంటారని మేము ఆశిస్తున్నాము' అని ఆయన అన్నారు. గాంధీ శరీరమంతటా వ్యాపించిన ఇన్ఫెక్షన్‌కు చికిత్స పొందుతున్నారని, యాంటీబయాటిక్స్‌కు ఆమె శరీరం బాగా స్పందిస్తోందని కాంగ్రెస్ నాయకురాలికి చికిత్స అందిస్తున్న వైద్యుల తెలిపారు. ఆమె సీనియర్ వైద్యుల బృందం పర్యవేక్షణలో ఆమె ఉన్నారు. ఆమె పరిస్థితి తీవ్రంగా లేనప్పటికీ, ముందుజాగ్రత్తగా కొద్దికాలం పాటు ఆమెను పర్యవేక్షణలో ఉంచే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.

# లోక్‌సభలో 'జన విశ్వాస్' బిల్లు రెండవ ఎడిషన్

### కొన్ని నిబంధనలు తొలగించాలన్న కాంగ్రెస్ అభ్యర్థనలను తోసిపుచ్చిన కేంద్రం


**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో జన్ విశ్వాస్ బిల్లు రెండవ ఎడిషన్‌ను ప్రవేశపెట్టింది. అయితే వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించేందుకు, పలు చిన్న నేరాలను నేరరహితం చేసేందుకు కొన్ని నిబంధనలను సవరించాలని కోరుతూ కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, 2026ను ప్రవేశపెట్టారు. ఇది 23 మంత్రిత్వ శాఖల పరిధిలోని 79 కేంద్ర చట్టాలను సవరించాలని ప్రతిపాదిస్తోంది. మొత్తం 784 నిబంధనలను సవరించాలని ప్రతిపాదిస్తుండగా, వాటిలో వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించేందుకు 717 నిబంధనలను నేరరహితం చేయగా, జీవన సౌలభ్యాన్ని కల్పించేందుకు 67 నిబంధనలను మార్చాలని ప్రతిపాదించారు. బిల్లును ప్రవేశపెట్టే దశలో కాంగ్రెస్ సభ్యులు కె. కావ్య, జి.కె. పడావి ఉల్లంఘనలకు జైలు శిక్షకు బదులుగా జరిమానాలను విధించడం ద్వారా ఇది భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొంటూ బిల్లు ప్రవేశాన్ని వ్యతిరేకించారు. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి లేదా సంయుక్త పార్లమెంటరీ కమిటీకి తిరిగి పంపాలని పడావి ప్రభుత్వాన్ని కోరారు. 'ఇది ఒక పరిపాలనాపరమైన పొరపాటు... ఈ బిల్లు ఏకపక్షంగా ఉంది, అవినీతిని ప్రోత్సహిస్తుంది, దీనిని పునఃపరిశీలించాలి' అని పడావి అన్నారు. సెలెక్ట్ కమిటీ నివేదికలో కూడా భిన్నాభిప్రాయం వ్యక్తమైందని ఆయన తెలిపారు. ఈ డిమాండ్‌పై బిల్లును పార్లమెంటరీ కమిటీకి తిరిగి సమర్పించవచ్చా అని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నించారు. పరిశీలన కోసం బిల్లును పార్లమెంటరీ కమిటీకి తిరిగి పంపడానికి ఎలాంటి నిబంధన లేదని, దీనికి ఎటువంటి పూర్వ ఉదాహరణ లేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కాంగ్రెస్ అభ్యంతరాలకు స్పందిస్తూ, కేవలం విధానపరమైన చిన్నపాటి ఉల్లంఘనల స్థానంలో జరిమానా విధించాలని ప్రతిపాదించామని ప్రసాద అన్నారు. ప్రధాన ఉల్లంఘనలు, తీవ్రమైన నేరాలను ఏ విధంగానూ నీరుగార్చలేదని ఆయన అన్నారు. జాతీయ భద్రత, కార్మిక న్యాయస్థానాలు, సాయుధ దళాలు, అంతర్జాతీయ బాధ్యతలకు సంబంధించిన చట్టాల వంటి కీలకమైన అంశాలను మినహాయించేలా సంస్కరణల ప్రక్రియను జాగ్రత్తగా రూపొందించామని ఆయన తెలిపారు. ఇవి ఈ పరిధిలోకి రావు కాబట్టి, ఇవన్నీ రద్దు చేయబడిన చిన్నపాటి నేరాలు అని ప్రసాద అన్నారు. ఈ బిల్లులోని నిబంధనలపై విస్తృత సంప్రదింపులు జరిగాయని ఆయన తెలిపారు. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని, ఈ బిల్లు ఇతర చట్టాలలో చిన్నపాటి మార్పులు చేయడానికి ఉద్దేశించబడిందని ఆయన అన్నారు. చిన్న నేరాలను నేరరహితం చేయడం, నేరానికి అనుపాతంగా జరిమానాలు, శిక్షలను సవరించడం, అప్పీలేట్ అథారిటీలను ఏర్పాటు చేయడం వంటి చర్యలను అమలు చేయడం ద్వారా ఈ బిల్లు వ్యాపారం, జీవన సౌలభ్యాన్ని పెంచుతుందని ప్రసాద తెలిపారు. 'ఇది 23 మంత్రిత్వ శాఖల పరిధిలోని 79 కేంద్ర చట్టాలను సవరించాలని ప్రతిపాదిస్తోంది. మొత్తం 784 నిబంధనలను సవరించాలని ప్రతిపాదిస్తుండగా, వాటిలో వ్యాపారం చేసే సౌలభ్యాన్ని పెంపొందించడానికి 717 నిబంధనలను నేరరహితం చేస్తున్నారు, జీవన సౌలభ్యాన్ని కల్పించడానికి 67 నిబంధనలను ప్రతిపాదిస్తున్నారు' అని ఆయన అన్నారు. ఈ బిల్లు 57 నిబంధనలలో జైలు శిక్షను, 158 నిబంధనలలో జరిమానాలను తొలగించాలని ప్రతిపాదిస్తోంది. అలాగే, 17 నిబంధనలలో జైలు శిక్షను తగ్గించాలని, 113 నిబంధనలలో జైలు శిక్ష, జరిమానాను శిక్షగా మార్చాలని ప్రతిపాదిస్తోంది. జీవన సౌలభ్యాన్ని కల్పించడానికి ఈ బిల్లు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ చట్టం, 1994, మోటార్ వాహనాల చట్టం, 1988 కింద 67 సవరణలను కూడా ప్రతిపాదిస్తోంది.




# 'మానవత్వం కోసం ఇరాన్ యుద్ధంలో జోక్యం చేసుకోండి'

### ప్రధాని మోదీకి ఒమర్ అబ్దుల్లా అభ్యర్థన

**శ్రీనగర్:** మానవత్వం కోసం ఇరాన్ యుద్ధంలో ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కోరారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై రుద్దిన యుద్ధాన్ని ఆపడానికి ఇతర దేశాలతో సంబంధాలను ఉపయోగించుకోవాలని అభ్యర్థించారు. మానవత్వం కోసం అలా చేయడం చాలా కీలకమని ఆయన అన్నారు. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్న అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, కాంగ్రెస్ శాసనసభ్యులు శుక్రవారం అసెంబ్లీలో నిరసన తెలిపారు. ఒక తీర్మానాన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ తీర్మానానికి బిజెపి ఎమ్మెల్యేలు అభ్యంతరం తెలిపారు. విదేశాంగ విధానం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని అన్నారు. దీంతో అసెంబ్లీలో గందరగోళం చెలరేగింది. ఈ నేపథ్యంలో సిఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. బిజెపి శాసనసభ్యులపై విమర్శలు గుప్పించారు. 'ఈ సమస్య ఈ ప్రాంతాన్ని నేరుగా ప్రభావితం చేయదని కొందరు వాదించవచ్చు. కానీ ఈ యుద్ధ ప్రభావం అందరిపై పడుతుంది' అని అన్నారు. యుద్ధం కారణంగా భారతీయ విద్యార్థులు ఇరాన్‌లో చిక్కుకుపోయారని, ఎల్‌పిజి సిలిండర్ల కోసం ప్రజలు బారులు తీరుతున్నారని ఆయన ఉదాహరించారు. మరోవైపు అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడిలో ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతోల్లా ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులు, సహచరులు హత్యకు గురికావడాన్ని ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. ఇది ఒక ఘోరమైన అన్యాయమని అభివర్ణించారు. మనస్సాక్షి ఉన్న ప్రతి ఒక్కరూ దీనికి వ్యతిరేకంగా మాట్లాడతారని అన్నారు. కాగా, పాఠశాలలను, పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోద యోగ్యం కాదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. యుద్ధం ఉద్దేశ్యాన్ని ఆయన ప్రశ్నించారు. దాని వెనుక ఉన్న కారణాలు బహుశా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కూడా అర్థం కాకపోవచ్చని అన్నారు. 'ట్రంప్ ఉదయం పూట ఇరాన్‌లో ప్రభుత్వం మార్పు గురించి మాట్లాడతారు. సాయంత్రం చమురు ధరల గురించి ప్రస్తావిస్తారు' అని ఎద్దేవా చేశారు. మరోవైపు ఈ తాను యుద్ధాన్ని ఖండిస్తున్నానని, బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సిఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. 'మానవాళికి మేలు జరిగేలా ఈ యుద్ధాన్ని ఆపడానికి ప్రధాని మోదీ తన అధికారాలను ఉపయోగించాలని నేను అభ్యర్థిస్తున్నా. మానవాళిని రక్షించడంలో మన దేశం పాత్ర పోషించగలిగితే, అంతకంటే గొప్ప కార్యం మరొకటి లేదు' అని ఆయన అన్నారు.



# తగినంత ఎరువుల నిల్వలున్నాయ్

### ఎవరూ ఆందోళన చెందొద్దు : కేంద్ర మంత్రి నడ్డా


**న్యూఢిల్లీ :** రైతులకు ఎరువులు అందించడానికి భారతదేశం వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జె.పి. నడ్డా స్పష్టం చేశారు. ఎరువుల గురించి ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ ఆసియా యుద్ధం నేపథ్యంలో ఎరువుల లభ్యతను నిర్ధారించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని లోక్‌సభలో అడిగిన ఒక అనుబంధ ప్రశ్నకు నడ్డా సమాధానమిచ్చారు. తాను గురువారం రాష్ట్ర వ్యవసాయ మంత్రులతో మాట్లాడి, ఎరువుల లభ్యత గురించి వారికి తెలియజేశానని నడ్డా తెలిపారు. రైతులకు అవసరమైనప్పుడు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని దేశ పౌరులకు హామీ ఇవ్వాలనుకుంటున్నానన్నారు. మన వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎరువుల దిగుమతుల కోసం ప్రభుత్వం కొత్త మార్కెట్లను అన్వేషిస్తోందా అని కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారీ అడిగిన అనుబంధ ప్రశ్నకు సమాధానమిస్తూ, ఖరీఫ్ సీజన్‌కు తగినంత నిల్వలు ఉన్నాయని నడ్డా చెప్పారు. 'మేము కూడా వైవిధ్యీకరణ, కొత్త మార్కెట్లు, కొత్త ప్రాంతాల కోసం చూస్తున్నాము. అక్కడి నుంచే మాకు ఎరువుల కోసం ముడి పదార్థాలు కూడా లభిస్తాయి. ఎరువుల లభ్యతను నిర్ధారించడానికి మేము మా వ్యూహాన్ని రూపొందించుకున్నాము' అని నడ్డా అన్నారు. నౌకాయాన మార్గాలకు అంతరాయం, పశ్చిమ ఆసియా యుద్ధం ఎరువుల దిగుమతులపై ఆందోళనలను పెంచాయి. భారతదేశం ఎరువులను ప్రధానంగా దిగుమతి చేసుకునే దేశం.



# 'రామ్ లల్లా' నుదుట సూర్య కిరణం

### అయోధ్యలో అద్భుతం: భక్తిపారవశ్యంలో భక్తులు..

**అయోధ్య :** శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి (రామ్ లల్లా) నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటి రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆప్టోమెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ప్లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఈ ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకున్నారని అధికారులు తెలిపారు. నగరాన్ని పలు భద్రతా జోన్లు, సెక్టార్లుగా విభజించి, కీలక ప్రదేశాల్లో పారామిలిటరీ దళాలు, ప్రదేశిక్ సాయుధ దళాలు, సివిల్ పోలీసులను మోహరించినట్లు సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు.



## ప్రతీ గణాంకం వెనక.. 'ఒక మానవ కథ' దాగి ఉంటుంది

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### ఐఇఎస్ అధికారుల బృందాన్ని ఉద్దేశించి కీలక ప్రసంగం

**న్యూఢిల్లీ :** ప్రతీ గణాంకం వెనక ఒక మానవ కథ దాగి ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెబుతూ ఆర్థిక విధానానికి నిజమైన కొలమానం కేవలం సంఖ్యల్లోనే కాదు, దాని ఫలితాలలోనే ఉంటుందని ఉద్ఘాటించారు. రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం తనను కలిసిన ఇండియన్ ఎకనామిక్ సర్వీసు (ఐఇఎస్) అధికారుల బృందాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. పబ్లిక్ సర్వీసులో ఆర్థిక ప్రణాళిక అమలు పాత్ర గతంలో కంటే ఇప్పుడు మరింత కీలకంగా మారిందన్నారు. సుస్థిర వృద్ధిని నిర్ధారించడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఉపాధి అవకాశాలను పెంచడం, అసమానతలను తగ్గించడం, సంక్లిష్ట వాతావరణంలో ఆర్థిక వ్యవస్థను నడిపించడం వంటి విషయాలలో ఐఇఎస్ అధికారుల పాత్ర గణనీయంగా ఉంటుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. అదే సమయంలో ప్రతీ గణాంకం వెనక ఒక మానవ కథ ఉంటుందనే విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. ఆర్థిక విధానానికి నిజమైన కొలమానం కేవలం సంఖ్యల్లోనే కాదు, దాని ఫలితాలలోనే ఉంటుందన్నారు. అది ప్రజల జీవితాలను ముఖ్యంగా అత్యంత బలహీనవర్గాల ప్రజల జీవితాలను మెరుగుపరచాలని ఆమె ఉద్బోధించారు. అధికారుల చర్యలు ప్రగాఢ సానుభూతి, సమ్మిళిత, సమాన అభివృద్ధి పట్ల నిబద్ధతతో కూడి ఉండాలని హితవు పలికారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన నిజాయితీ, వృత్తి నైపుణ్యాన్ని పాటించాలని ముర్ము ఐఇఎస్ అధికారులను కోరారు.

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 478 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., WARANGAL-I Branch,** Rep by its GPA Holder cum Legal Managar,

**....Disputant**

VERSUS

**MOHD.KHAJA NADEEMUDDIN & OTHERS**

**...Opponents**

1. Mohd Khaja Nadeemuddin S/O Khaja Moinuddin Aged About 36 Years Occ: Business. R/O, H.No.11-24-224, Pochammaidan, Deshaipet Road, Warangal.
2. Mohd Feroz Rahil S/O Md.Osman Aged About 43 Years Occ: Business. R/O. H.No. 11-23-1847, LB Nagar, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HONBLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 479 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., WARANGAL-I Branch,** Rep by its GPA Holder cum Legal Managar

**...Disputant**

VERSUS

**MOHD.KHAJA NADEEMUDDIN & OTHERS**

**.....Opponents**

1. Mohd Khaja Nadeemuddin S/O Khaja Moinuddin, Aged About 36 Years Occ: Business. R/O. H.No. 11-24-224, Pochammaidan, Deshaipet Road, Warangal.
2. Pasham Sudhirkumar S/O Ravinder, Aged About 36 Years Occ: Software Employe. R/O. H.No. 12-1-447, F.No.304, Urban Free Appartments, Sec-bad.
3. Mohd Khaia Naimuddin S/O Khaja Moinuddin Aged About 48 Years Occ: Business, R/O. H.No.11-24-224, Pochammaidan, Deshaipet Road, Warangal.

Take notice that the above Disput is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 480 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its GPA Holder cum Legal Managar,

**....Disputant**

VERSUS

**MOHD FEROZ RAHIL & OTHERS**

**.....Opponents**

1. Mohd Feroz Rahil S/O Osman Aged About 43 Years Occ: Business. R/O. H.No.11-23-1847, LB Nagar, Warangal.
2. MohdSoyal Ahmed S/O Sadiq Ali Ahmed Aged About 28 Years Occ: Business. R/O. H.No.11-23-1334,LB Nagar, Warangal.
3. Mohd Arif S/O Md.Ali Aged About 36 Years Occ: Police Constable. R/O. H.No.15-3- 59/2, Rangampet, Warangal.
4. Osman Ahmed Khan S/O Ahmed Khan Talib Aged About 42 Years Occ: Business. R/O H.No.11-20-208/1 Shanthinagar, Laxmipuram, Kashibugga, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 482 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd. Warangal-I Branch,** Rep by its GPA Holder cum Legal Managar

**....Disputant**

VERSUS

**K.SHARATH & OTHERS**

**.....Opponents**

2. Shivarapu Raju S/O Laxmana chary, Aged About 41 Years, Occ: Business. R/O. H.No. 4- 633/3, Mallareddy Pally, Parkal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE ThE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 483 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its GPA Holder cum Legal Managar

**....Disputant**

VERSUS

**G.RAJITHA & OTHERS**

**.....pponents**

1. 1. Gullapelli Rajitha W/O Komati Jagadish Aged About 37 Years Occ: Business. R/O H.No. 10-11-42, Ramavari Street, Girmjipet, Warangal.
2. Aruri Karthik S/O Krishnamurthy Aged About 36 Years Occ: Mandal Revenue Inspector. R/O. H.No. 6-58, Tharalapally, Kazipet,, Hanamkonda.
3. Donthula Naresh S/O Rajeshwar Rao Aged About 40 Years Occ: Business. R/O, H.No.10-11-42, Girmajipet, Warangal.
5. Komati Jagadish S/O Bhagavan Aged About 45 Years Occ: Business. R/O. H.No.10-11- 42, Ramavari Street, Girmjipet, Warangal.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte

**CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 536 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd. Warangal-I Branch,** Rep by its GPA Holder cum Legal Managar,

**....Disputant**

VERSUS

**M.VIJAYALAXMI & OTHERS**

**......pponents**

3. Nalla Chitti Reddy S/O Venkatanagireddy Aged About 53 Years Occ: Line Inspetor, TSNPDCL/Nakkalagutta. R/O. H.No. 2-2-39, Rajivinagar, Naimnagar, Hanamkonda.
5. Antelupula Ramchander Rao S/O Sampath Aged About 24 Years Occ: Lineman/TSNPDCL/Kazipet. R/O. H.No.1-1-220/B2, Prashanthnagar, Opp: NIT, Kazipet, Hanamkonda.

Take notice that the above Dispute .is filed against ou and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**10.04.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
28-03-2026
www.prajapaksham.in


# గ్యాస్, ఆయిల్ కొరత తీరినట్లేనా?

'పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్‌కు దేశంలో కొరత లేదు. వాణిజ్య గ్యాస్ సిలెండర్ల సరఫరా 70 శాతానికి చేరింది. ఆందోళన చెందవద్దు' అని కేంద్రప్రభుత్వం దేశ ప్రజలకు తాజాగా భరోసా ఇచ్చింది. ఆయిల్, గ్యాస్ కొరత కారణంగా ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటిస్తుందని వ్యాపించిన వదంతులను నమ్మవద్దని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండగా, విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్ జి.7 దేశాల సమావేశం నిమిత్తం ఆహ్వానితునిగా పారిస్ వెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం వర్చువల్‌గా ముఖ్యమంత్రులతో పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితి, పర్యవసానాలను, మన దేశానికి ఎదురవుతున్న సమస్యలను గూర్చి సంభాషించారు. ఆయిలు, గ్యాస్ కొరత తలెత్తకుండా రాష్ట్రాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు.

పెట్రోలు, డీజిల్ కోసం, వంటగ్యాస్ కోసం దేశవ్యాప్తంగా పట్టణాలు, నగరాల్లో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా, నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, దిగుమతులు పెరుగుతున్నాయని కేంద్రప్రభుత్వం రోజువారీ ప్రకటనలకు మించి గురువారం భరోసా ఇచ్చింది. ఆయిలు కంపెనీలు 60 రోజుల అవసరాలకు సరిపడా క్రూడ్ ఆయిలు నిల్వలు కలిగి ఉన్నాయని, రిఫైనరీలన్నీ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, నెలరోజులకు సరిపడా ఎల్‌పిజి (వంటగ్యాస్) నిల్వలున్నాయని, అంతేగాక ఎల్‌పిజి కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడకుండా స్వదేశీ ఉత్పత్తి 60 శాతంపైగా ఉందని కూడా పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖ భరోసా యిచ్చింది.

ఆయిలు, గ్యాస్ కోసం దేశంలో ఎందుకింత భయాందోళన ఏర్పడింది? ఈ ఇంధన అవసరాల్లో 80శాతం దిగుమతులపై ఆధారపడి ఉన్న దేశం మనది. పర్షియన్ గల్ఫ్ నుంచే 50శాతం రవాణా జరుగుతుంది. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ నిష్కారణంగా, అప్రకటితంగా, ఆకస్మిక బాంబుదాడులతో యుద్ధం మొదలుపెట్టటంతో ఇరాన్ హార్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసింది. ఆయిలు, గ్యాస్ తదితరాలు రవాణా చేసే ఓడలు సముద్రంలో చిక్కుకుపోయాయి. యుద్ధం ముగిసే అవకాశాలు కనుచూపుమేరలో కనిపించటం లేదు.

పశ్చిమాసియా యుద్ధం మొదలై 28 రోజులు గడిచాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్; ఇజ్రాయెల్‌పై, పర్షియన్ గల్ఫ్‌లోని అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక వసతులపై ఇరాన్ ఎదురుదాడులతో పెద్ద ఎత్తున విధ్వంసం కొనసాగుతోంది. నౌకా రవాణాకు అత్యావశ్యకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయటంవల్ల (ఇండియా, రష్యా, చైనా, ఇరాన్, టర్కీ ఓడల ప్రయాణానికి గురువారం అనుమతి ఇచ్చింది) ఈ యుద్ధం ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నది. ద్రవ్యోల్బణం పెరుగుతున్నది, ఆర్థిక – పారిశ్రామిక కార్యకలాపాలు కుంటుపడుతున్నాయి, ఉత్పత్తి–ఎగుమతి–దిగుమతులు నిలిచిపోతున్నా యి. క్రూడ్ ఆయిలు, ఎల్‌పిజి దిగుమతికి పశ్చిమాసియాపై ప్రధానంగా ఆధారపడిన భారత్ సహా దక్షిణాసియా దేశాలు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఆయిలు, గ్యాస్ కొరత లేదు – ఆందోళన చెందవద్దని భారత ప్రభుత్వం ప్రతిరోజూ దేశ ప్రజలకు భరోసా యిస్తున్నా ప్రజల్లో ఆందోళన తగ్గకపోగా పెరుగుతున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోని నగరాల్లో పెట్రోలు బంకులవద్ద ఎడతెగని వాహనబారులు, గ్యాస్ పంపిణీదారుల కార్యాలయాలు, గోదాముల వద్ద ఖాళీ బండలతో భారీ క్యూలు, కొన్నిచోట్ల ఘర్షణలు ఇందుకు నిదర్శనం. యుద్ధం ప్రారంభం కాగానే డబుల్ సిలెండర్‌లు ఉన్నవాళ్లు బుక్ చేసుకోవటం పెరిగింది. గ్యాస్ కంపెనీలు ఫోన్‌లు ఎత్తకపోవటంతో ఆందోళన పెరిగింది. గృహావసరాలకు తీవ్రమైన కొరత సంభవించలేదుగాని వాణిజ్య సిలెండర్‌ల సరఫరా నిలిచిపోవటంతో హోటళ్లు, క్యాంటీన్‌లు, హాస్టళ్లు, రెస్టారెంట్లు తదితర ఆహార సరఫరా కేంద్రాలు పాక్షికంగా, పూర్తిగా మూతపడటంతో ఆహారం, అల్పాహారాలకు వాటిపై ఆధారపడిన పదుల లక్షలమంది తీవ్ర ఇబ్బందులకు గురైనారు. అవకాశమున్న హోటళ్లలో కట్టెలు, బొగ్గుల పొయ్యిలు ప్రత్యక్షమైనాయి. గ్యాస్‌పై ఆధారపడిన పరిశ్రమలు ఎంతగా నష్టపోయాయో ముమ్ముందు తెలుస్తుంది.

ఈ పరిస్థితులకు మోదీ ప్రభుత్వానిదే బాధ్యత. అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుంచి ఆయిలు కొనుగోలు దాదాపు నిలిపివేసింది. పశ్చిమాసియా యుద్ధం మొదలైన తర్వాత రష్యానుంచి ఆయిలు కొనుగోలుకు ట్రంప్ వెసులుబాటు కల్పించాక కొనుగోలు మొదలుపెట్టింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను గమనించి గ్యాస్, క్రూడ్ నిల్వలు పెంచుకోవటంలో అశ్రద్ధ జరిగింది. మోదీ ఇజ్రాయెల్ వెళ్లి పార్లమెంటులో ప్రసంగించి పొగడ్తల పురస్కారాలతో తిరిగిరాగానే ఇజ్రాయెల్ ఇరాన్‌పై యుద్ధం మొదలుపెట్టింది. ఇరాన్ ప్రతిఘటన శక్తిని తక్కువ అంచనా వేసిన ట్రంప్ తమకు లాభసాటిగా యుద్ధాన్ని ముగించేందుకు శాంతి ప్రతిపాదనలు, ఒత్తిళ్లు, బెదిరింపులతో రోజుకో ప్రకటన చేస్తున్నాడు. ఇరాన్ సర్వోన్నతాధికారి అలీ ఖమేనీ హత్యను లాంఛనంగా ఖండించటానికి నోరురాని నరేంద్రమోదీ 20 రోజుల తర్వాత ఇరాన్ అధ్యక్షునితో, ఇతర అరబ్ దేశాల అధినేతలతో సంభాషించారు. అయినా భారత్‌ను మిత్రదేశంగా పరిగణించిన ఇరాన్ మన దేశానికి ఆయిలు, గ్యాస్ ఓడలను హార్ముజ్ నుంచి అనుమతించి మానవత్వం ప్రదర్శించింది. సంక్షోభకాలంలో సంయమనం అవసరమంటూ ప్రతిపక్షాల నోరుమూయించటానికి మోదీ ప్రయత్నిస్తున్నారు. అయితే దేశంలో ఇబ్బందులు పడుతున్న, ఉపాధులు కోల్పోయిన కోట్లాదిమంది నోరు ఎలా మూయించగలరు?



## వంటగ్యాస్‌ను ఇతర ప్రాంతాలకు మళ్లించొద్దు

పశ్చిమ బెంగాల్‌లో ఉత్పత్తి అయ్యే వంటగ్యాస్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలకు మళ్లించకూడదు. పెరుగుతున్న ప్రపంచ ముడి చమురు ధరలను తట్టుకోవడానికి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు సహాయపడాలి. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించాలన్న కేంద్రం నిర్ణయం వినియోగదారులకు చేరుతుందా? ప్రజలకు చేరాలి. పెట్రోల్, గ్యాస్ సిలిండర్లు రెండూ తగినంత పరిమాణంలో అందుబాటులో ఉన్నాయి. మన రాష్ట్రానికి చెందిన ఎస్‌పిలు, ఎమ్మెల్యేలను (ఇసి ద్వారా) తొలగించిన పరిస్థితుల్లో, హల్దియా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఉత్పత్తి అయిన గ్యాస్ సిలిండర్లను బయటకు పంపకూడదు.

–పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి
మమతా బెనర్జీ



## సంగీత సామ్రాజ్యంలో లింగ సమానత్వం అసాధ్యమా!

సంగీత రంగంలో మహిళల పాత్రను ప్రశంసించడం, వారిని ప్రోత్సహించడం, ఈ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం, మంచి మహిళా సంగీత విద్వాంసులను సన్మానించడం, మహిళా సంగీతకారుల ప్రభావాన్ని గుర్తు చేసుకోవడం, భవిష్యత్తులో మహిళా సంగీతకారులకు సముచిత స్థానం కల్పించడం లాంటి అంశాల్లో పాల్గొనడానికి ప్రతి ఏటా 28 మార్చి రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ వూమెన్ ఇన్ మ్యూజిక్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది.

**భారత సంగీత రంగంలో మహిళా కళాకారులు:** భారతీయ సంగీతరంగాన్ని సుసంపన్నం చేసిన మహిళల్లో ఎం ఎస్ విజయలక్ష్మి, లతా మంగేష్కర్, ఆశా బోంస్లే, శ్రేయ ఘోషాల్ లాంటి వారు ఎందరో ఉన్నారు. వీరు తమ సంగీత కళతో మానవాళిని మెప్పించి పురుషాధిక్యతను అధిగమించి తమదైన ముద్రను వేయడం హర్షదాయకం. ప్రముఖ గాయనీమణుల్లో లతా మంగేష్కర్, శ్రేయా ఘోషాన్ లాంటి వారు ఉండగా, శాస్త్రీయ సంగీతంలో ఎం ఎస్ సుబ్బలక్ష్మి, గౌహర్ జాన్, అక్తరి బాయి లాంటి మహిళలు ఉన్నారు. సంగీత వాయిద్యకారుల వర్గంలో మృదంగం, తబలా, ఘటం, కంజీరా వంటి వాయిద్యాలను వాయించే మహిళలు కూడా కొందరు ఉండడం విశేషం.

రుద్ర వీణ కళాకారిణి జ్యోతి హెగ్డే, సంగీత దర్శకులుగా ఉషా ఖన్నా, జద్దన్ బాయి, సరస్వతి దేవి లాంటి కళాకారులు ఉన్నారు. ఆధునిక భారతీయ సంగీత ప్రపంచంలో శ్రేయ ఘోషల్, నేహా కక్కర్, సన్నిధి చౌహాన్ వంటి నేటి మేటితరం గాయనీమణులూ ప్రపంచ గుర్తింపును కూడా పొందారు. తెలుగు సంగీత ప్రపంచంలో ఎం ఎం శ్రీలేఖ, భానుమతి రామకృష్ణ లాంటి ప్రముఖులు సంగీత దర్శకులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే గాయనీమణులుగా సుశీల, జానకి, చిత్ర, సునితా, మంగ్లీ లాంటి వర్తమాన కళాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళలకు సహితం సరైన అవకాశాలు దొరకడం లేదు. సంగీతరంగంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడానికి పురుష సమాజం సిద్ధంగా లేదు. తగిన గుర్తింపు, వేతన వ్యత్యాసాలు మహిళలను వేధిస్తున్నాయి. సంగీత ప్రపంచంలో అడుగిడడానికి మహిళలకు పరిమితులు విధించబడ్డాయి. మహిళా సంగీత విద్వాంసుల నైపుణ్యాలను గుర్తించడం, అర్హత కలిగిన మహిళలకు అవకాశాలు ఇవ్వడం, మహిళా సందగీతకారులకు స్వేచ్ఛను ఇవ్వడం, మహిళల సంగీత కచేరీలు లేదా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, సంగీత పరిశ్రమలో లింగ సమానత్వ సాధనకు కృషి చేయడం లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

***(28 మార్చి అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం సందర్భంగా)***

# అమెరికా – ఇరాన్ చర్చలకు బలమైన అవరోధాలు

**అశోక్ నీలకంఠన్ అయిర్స్ (న్యూయార్క్)**

మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు ఎన్నో అవరోధాలున్నాయి. అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 15 అంశాల శాంతి ప్రణాళికను ఇరాన్ తిరస్కరించింది. ఇరాన్‌ను కోరలు తీసిన పామును చేయటం ట్రంప్ ప్రణాళిక ఉద్దేశమైతే, తన సార్వభౌమత్వ అధికారం పరిరక్షణకు ఇరాన్ నిబద్ధమై ఉంది. శాంతి ప్రణాళిక సమస్య పరిష్కారానికి మార్గంగా కాకుండా మోసగించేదిగా ఉంది. వైరిపక్షాల మధ్య విశ్వాసరాహిత్య అగాధం పెద్దగా ఉంది, కమ్యూనికేషన్ దూరం కూడా ఉంది. ట్రంప్ శాంతి ప్రణాళిక సమయం సంపాదించుకుని, తనకు అనువైన సమయంలో నిర్ణయాత్మకంగా దాడిచేసేందుకు ఉచ్చుగా ఉందని ఇరాన్ అనుమానిస్తున్నది. ఈ దౌత్య వైరంలో కేంద్రస్థానంలో ఉంది ట్రంప్ శాంతి ప్రణాళిక. అదే సమయంలో, పర్షియన్ సింధుశాఖలో, ముఖ్యం గా వ్యూహాత్మకంగా కీలకమైన జలసంధి హార్ముజ్ చుట్టూ ట్రంప్ ప్రభుత్వం గావిస్తున్న సైనిక మోహరింపును విస్మరించరాదు.

ట్రంప్ దురాశాపూరితమైన ప్రణాళిక యుద్ధం ఆపాలని మాత్రమే కోరటం లేదు. ఇరాన్ మిలటరీ, అణుశక్తి, ప్రాంతీయ స్థితిని ప్రాథమికంగా మార్చాలని కోరుకుంటున్నది. టెహరాన్ వెనువెంటనే స్పందించింది. దాని తిరస్కారం పరిభాష మాత్రమే కాదు, ప్రాతిపదికను కూడా త్రోసిపుచ్చింది. వాషింగ్టన్ సంప్రదింపుల భాష మాట్లాడుతుంటే, ఇరాన్‌కు అందులోని వేధింపు, అణచివేత ధ్వనులు వినిపిస్తున్నాయి.

ట్రంప్ ప్రభుత్వ ప్రతిపాదన సాంప్రదాయకమైన పోరాట విరమణ చట్రంలో లేదు. ఇరాన్ అధికారాన్ని సమూలంగా పునర్నిర్మాణం చేసేదిగా ఉంది. ఇరాన్ కీలకమైన తన అణుశక్తి వసతులను ధ్వంసం చేయాలని, శుద్ధిచేసిన యురేనియం నిల్వలను అప్పగించాలని, అణ్వస్త్రాలు తయారు చేసే మార్గాన్ని శాశ్వతంగా విడనాడాలని ట్రంప్ ప్రణాళిక కోరుతోంది. అంతేకాదు, తమ జాతీయ భద్రత పరిరక్షణకు వెన్నెముకగా ఇరాన్ ఎంతో కాలంగా భావిస్తున్న తన మిస్సిలీ కార్యక్రమంపై కఠినమైన పరిమితులకు అంగీకరించాలని, హిజ్‌బుల్లా, హమస్, హౌతీలు వంటి ప్రాంతీయ ప్రాక్సీ గ్రూపులకు తోడ్పాటును ఇరాన్ విరమించుకోవాలని కూడా కోరుతున్నది. ప్రతిఫలంగా అమెరికా ఏమి ఇస్తుంది? ఇరాన్‌ను కృంగదీస్తున్న ఆర్థిక ఆంక్షలు ఎత్తివేస్తుంది, ప్రపంచ మార్కెట్లలో చేర్చుకుంటుంది, అంతర్జాతీయ పర్యవేక్షణ కింద పౌర అణుకార్యక్రమానికి తోడ్పడుతుంది.

ట్రంప్ ప్రతిపాదనలోపల పొదిగివున్న అతిముఖ్యమైన ఆశ–హార్ముజ్ జలసంధిని ఇరాన్ పునఃప్రారంభించటం. ప్రపంచ ఆయిలు సరఫరాల్లో 5వ వంతు ఆ జలసంధి ద్వారా రవాణా అవుతుండటం, తమ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధంతో ఆ మార్గాన్ని ఇరాన్ మూసివేయటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కల్లోలభరితం కావటం చూస్తున్నదే. అమెరికా, దానిమిత్ర రాజ్యాలకు సంబంధించి ఇది ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన అంశం. కాగా ఇరాన్‌కు అది అత్యంత శక్తిమంతమైన దండం.

తాత్కాలికంగా పోరాట విరమణ, తద్వారా సంప్రదింపులకు అవకాశం కలగటం కూడా ట్రంప్ శాంతి ప్రణాళికలో ఉంది. అయితే ఈ విరామాన్నే ఇరాన్ పెద్దగా అనుమానిస్తున్నది.

శాంతి ప్రణాళిక కోసం దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు చేస్తూనే, అమెరికా ఈ ప్రాంతంలో తన సైనిక బలాన్ని పెంచుతున్నది. అదనంగా యుద్ధ నౌకలను దించింది, ఇరాన్‌ను దెబ్బకొట్టగల దూరంలో 82వ ఎయిర్‌బోర్న్ డివిజన్ దళాలను మోహరించింది. బలప్రయోగం ద్వారా సంప్రదింపులు, ఒత్తిడితో రాయితీలు పొందటం అలవాటైన సిద్ధాంతమే. అయితే ఇరాన్ మాత్రం వీటిని పరస్పర విరుద్ధాలుగా, మోసకారితనంగా చూస్తోంది. చర్చలు జరుగుతుండగానే యుద్ధానికి ఒడిగట్టి, అగ్రనేత ఖమేనీని లక్ష్యం చేసుకుని హతమార్చిన ఉదంతాన్ని ఇరాన్ అధికారులు గుర్తు చేస్తున్నారు. ఫలితం – విశ్వాసానికి అతిపెద్ద విఘాతం ఏర్పడింది. అమెరికా "తనతో తానే చర్చలు జరుపుతోంది" అని ఒక ఇరాన్ ప్రతినిధి మొరటుగా వ్యాఖ్యానించారు. దౌత్యం కోసం యుద్ధరంగం ఆగదు. ఇరుపక్షాలు క్షిపణులు ప్రయోగించి విధ్వంసానికి పాల్పడుతూనే ఉన్నాయి. వాషింగ్టన్ ప్రతిపాదన విస్తృతంగా ఉంటే ఇరాన్ ఎదురు ప్రతిపాదనలో రాజీ ధోరణి లేదు.

ఇరాన్ ఐదు అంశాల చట్రాన్ని ప్రతిపాదించింది. అందులో రాజీలు లేవు. తమ సార్వభౌమత్వాన్ని, తమ భద్రత గూర్చిన ఆందోళనలను, తమ ప్రాంతంలో అధికార సమతౌల్యాన్ని రూపొందించే తమ హక్కును గుర్తించాలని కోరింది. వాటిలో అత్యంత ప్రధానమైనవి యుద్ధకాలంలో నష్టాలకు పరిహారం, భవిష్యత్‌లో దురాక్రమణకు వ్యతిరేకంగా గ్యారంటీలు, తమ నాయకులు, అధికారులను లక్ష్యంగా ఎంచుకుని చేస్తున్న దాడులు తక్షణం నిలుపుదల చేయటం. అయితే అత్యంత వివాదాస్పదమైంది – హార్ముజ్ జలసంధిపై తమ నియంత్రణకు కొనసాగింపుకు ఇరాన్ గట్టిగా పట్టుబట్టుతున్నది. బేషరతుగా తిరిగి తెరవాలన్న డిమాండ్‌ను తిరస్కరించటంతో పాటు ఓడల ప్రయాణాన్ని నియంత్రించనున్నట్లు తెలిపింది. బహుశా సుంకాలు విధించవచ్చు.

అంతే సమానంగా సంప్రదింపులకు అతీతమైంది ఇరాన్ మిస్సిలీ కార్యక్రమం. అణుశక్తి సంబంధిత కార్యక్రమాలను చర్చించటానికి ఇరాన్ సుముఖంగా ఉన్నప్పటికీ, తమ సాంప్రదాయక నిరోధక ఆయుధాల విషయంలో అది రాజీపడదు. ఆ ప్రాంతంలో ఇరాన్ ప్రత్యర్థులు అధునాతన యుద్ధ విమానాలు కలిగి ఉన్నారు. ఇజ్రాయెల్‌కు సంబంధించి దానివద్ద అణ్వస్త్రాలు ఉన్నట్లు అనుమానించబడుతోంది. అది ఆ విషయం గోప్యంగా ఉంచింది. అందువల్ల ఇరానియన్ నేతలు తమ మిస్సిలీలను బేరసారాలకు పావులుగా కాకుండా తమ అస్థిత్వానికి తప్పనిసరి అవసరాలుగా భావిస్తున్నారు. అంతేగాక ఆ ప్రాంతంలోని మిత్రులు, మిలీషియాలను వదులుకోవటానికి ఇరాన్ సిద్ధంగా లేదు. ప్రస్తుతం ఇరుపక్షాల మధ్య కనిపించే అత్యంత ప్రధానమైన వైరుధ్యం వారి మధ్య ఉన్న అగాథం కాదు, సంప్రదింపుల అస్థిత్వం చుట్టూ ఆవహించి ఉన్న విరుద్ధ కథనాలు.



చర్చలు జరుగుతున్నాయి, పురోగమిస్తున్నాయి అని ట్రంప్ పదేపదే చెబుతున్నాడు. ఇరాన్ అధికారులు వాటిని నిరాకరిస్తున్నారు. సత్యం ఈ రెంటి మధ్యలో – అనధికారిక సంబంధాలు, తెరవెనుక వర్తమానాలు మార్పిడి, వివరణలు ఇచ్చిపుచ్చుకోవటం జరుగుతుండవచ్చు. పాకిస్థాన్, ఈజిప్టు, టర్కీ సహా మధ్యవర్తులు అగాథం తగ్గించి ఇరువురినీ చర్చల బల్ల వద్దకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇరాన్ అధికార వ్యవస్థలో అధికారం ఎవరిచేతిలో ఉందో స్పష్టత లేకపోవటం కూడా ఒక సమస్య. బహిరంగ వాదనలు ఎలా ఉన్నప్పటికీ, వాషింగ్టన్, టెహరాన్ రెండూ కూడా చర్చల విషయంలో అంతర్గతంగా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాయి. అయితే ఒత్తిడి ఒప్పందం సాధించలేదు. ఎందుకంటే, ఇరు పక్షాల ప్రధాన డిమాండ్‌లు వారి వ్యూహాత్మక సిద్ధాంతంతో ముడిపడి ఉన్నాయి.

***(ఐపిఎ సర్వీస్)***

# కేరళలో ఆ తొమ్మిది నియోజకవర్గాలు

ఏప్రిల్ 9న పోలింగ్ జరిగే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక 9 నియోజకవర్గాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అక్కడ జరుగుతున్న త్రిముఖ పోటీ పర్యవసానం కేరళ ఎన్నికలు ప్రభుత్వ భవిష్యత్‌నే నిర్ణయించవచ్చు. వాటిలో ఆరు నియోజకవర్గాలకు వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) అభ్యర్థులు ప్రాతినిధ్యం వహిస్తుండ గా, మిగతా మూడు కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) చేతిలో ఉన్నాయి.

**నేమమ్ :** కేరళ అసెంబ్లీకి ఇప్పటివరకు నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ) అభ్యర్థిని ఎన్నుకున్న ఏకైక నియోజకవర్గం ఇది. 2016 ఎన్నికల్లో సీనియర్ బిజెపి నాయకుడు ఓ.రాజగోపాల్ ఎల్‌డిఎఫ్ అభ్యర్థి శివన్‌కుట్టిని ఓడించారు. 2021 ఎన్నికల్లో శివన్‌కుట్టి ఆ స్థానా న్ని తిరిగి సొంతం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్, యుడిఎఫ్ అభ్యర్థి శబరినాథన ఆయనకు ప్రత్యర్థులు. శబరినాథన్ తిరువనంతపురం కార్పొరేషన్ కౌన్సిలర్, మాజీ ఎంఎల్‌ఎ.

**ఒట్టియురక్కవు :** ఇది తిరువనంతపురంలోని నియోజకవర్గం. 2016, 2021 ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి రెండవ స్థానం పొందారు. కాగా 2019 ఉపఎన్నికలో కాంగ్రెస్ రెండవ స్థానం సంపాదించింది. ప్రస్తుత ఎల్‌డిఎఫ్ ఎంఎల్‌ఎ వి.కె.ప్రసాద్ తొలిసారి అసెంబ్లీకి ఎన్నికైనారు. ఇప్పుడు ఆయన మూడవ టరం కోరుతున్నారు. ఆయన ఎన్‌డిఎ ప్రత్యర్థి ఆర్.శ్రీలేఖ మాజీ డిజిపి, తిరువనంతపురం కార్పొరేషన్‌లో కౌన్సిలర్. ఈ నియోజకవర్గం నుంచి 2011, 2016 లో ఎమ్మెల్యే అయిన కె.మురళీధరన్ యుడిఎఫ్ అభ్యర్థి.

**కజకుట్టం :** ఎన్‌డిఎ బలంగా ఉన్న మరో నియోజకవర్గం కజకుట్టం. గత రెండు ఎన్నికల్లోనూ ఇక్కడ బిజెపి రెండవ స్థానంలో ఉంది. ఇప్పుడు బిజెపి అభ్యర్థి వి.మురళీధరన్‌పై ఎల్‌డిఎఫ్‌కు చెందిన కడకంపల్లి సురేంద్రన్ పోటీ చేస్తున్నారు. టి.శరచ్చంద్ర ప్రసాద్ యుడిఎఫ్ అభ్యర్థి.




**పటనంతిట్ట :** అరన్‌ముల ఆలయపట్టణమున్న పటనంతిట్ట నుంచి ఆరోగ్యమంత్రి వీణ జార్జి మూడవ టరం కోరుతున్నారు. బిజెపి ఎన్నో ఆశలతో తీవ్రం గా పోరాటం చేస్తోంది. రాజశేఖరన్ అనే పేరుప్రఖ్యాతలు న్న వ్యక్తిని ఎన్‌డిఎ తమ అభ్యర్థిగా రంగంలో దించింది. కాంగ్రెస్ అభ్యర్థి అబిన్ వర్కీ. గత ఎన్నికల్లో శ్రీమతి జార్జికి ఓటు చేసిన తమ కమ్యూనిటీ నుంచి ఇతను కొన్ని ఓట్లు చీల్చగలడని భావించబడుతున్నది.

**త్రిస్సూర్ :** 2021 ఎన్నికల్లో త్రిస్సూర్‌లో స్వల్ప ఓట్ల ఆధిక్యతతో విజేత నిర్ణయమైనారు. కవి అలన్‌కోడ్ లీలాకృష్ణన్ ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, యుడిఎఫ్ మాజీ మేయర్ రాజన్ పల్లాన్‌ను అభ్యర్థిగా నిర్ణయించింది. పద్మజ వేణుగోపాల్ ఎన్‌డిఎ అభ్యర్థి.

**పలక్కాడ్ :** ఈ సీటు ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ది. ఇక్కడ కమ్యూనిస్టులు, బిజెపి కుమ్మక్కు అయినారని ప్రతిపక్షనాయకుడు వి.డి.సతీశన్ ఆరోపిస్తున్నాడు. ఎల్‌డిఎఫ్ ఎన్.ఎం. ఆర్.రజాక్ అనే హోటల్ యజమానిని ఇండిపెండెంట్‌గా రంగంలో దించింది. యుడిఎఫ్ అభ్యర్థి సినీనటుడు రమేశ్ పిషరోటీ, ఎన్‌డిఎ అభ్యర్థి శోభ సురేంద్రన్. బిజెపి వ్యతి రేక ఓట్లు చీల్చటానికి ఎల్‌డిఎఫ్ ఇండిపెండెంట్ అభ్యర్థిని పోటీ చేయిస్తున్నదని కాంగ్రెస్ నేత సతీశన్ ఆరోపిస్తున్నారు.

**మంజేశ్వరం:** ఈ సీటును గెలుచుకునే అవకాశాన్ని ఎన్.డి.ఎ. కొద్ది ఓట్లు తేడాతో కోల్పోతున్న చరిత్ర ఉంది. కె.సురేంద్రన్ (ఎన్‌డిఎ), ఎ. కె.ఎం. అష్రాఫ్ (యుడిఎఫ్) లపై ఎల్‌డిఎఫ్ కె.ఆర్.జయానందను పోటీకి నిలబెట్టింది.

**పాల :** కొట్టాయం జిల్లాలోని పాల నియోజకవర్గంలో ఎన్నడూ త్రిముఖ పోటీ జరగలేదు. ఈ ఎన్నికల్లో పరిస్థితి వేరు. కేరళ కాంగ్రెస్ (మణి) చైర్మన్ జోస్ కె.మణి ఎల్‌డిఎఫ్ అభ్యర్థి. యుడిఎఫ్‌కు చెందిన మణి సి. కప్పన్ సిటింగ్ ఎంఎల్‌ఎ. ఎన్‌డిఎ పూంజార్ మాజీ ఎంఎల్‌ఎ పి.సి.జార్జి కుమారుడు షోన్ జార్జిని అభ్యర్థిగా నిలబెట్టింది.

**నట్టిక :** త్రిసూర్ జిల్లా నట్టికలో కూడా తొలిసారి త్రిముఖ పోటీ జరుగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సి.సి. ముకుందన్ ఎన్‌డిఎ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, ఎల్‌డిఎఫ్‌కు చెందిన గీతా గోపాల్, యుడిఎఫ్ అభ్యర్థి సునీల్ లలూర్ ఆయనపై పోటీ చేస్తున్నారు.

ఎ.ఎస్.జయంత్,
కోజికోడ్

# వీధి కుక్కల బెడదతో ప్రజా భద్రతకు ముప్పు!

లేఖ

మన దేశంలో, వివిధ రాష్ట్రాలలో వీధి కుక్కలు పల్లెపట్నం వాడవాడల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఇవి చిన్నపెద్ద అని తేడా లేకుండా అందరినీ కరుస్తూ భయానక పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలపై మూకుమ్మడిగా క్రూరంగా దాడిచేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. గురువారం రోజు భువనగిరిలో ఇంటి ఆరు బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడిచేసి, అతని కను గుడ్లను పీకేసిన హృదయ విదారక ఘటన జరిగింది. ప్రియాంష్ పై రెండు కుక్కలు దాడి చేశా యి. ఒక కుక్క ముఖంపై తీవ్రంగా కరిచి కనుగుడ్లను పీకేసింది. బాలుడు భయానక కేకలు విని పరుగున వచ్చిన వారు నేలపై పడి ఉన్న కనుగొడ్డును చూసి ఆందోళనలో కుక్కను తరిమి కొట్టి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు. అదేరోజు మరో బాలుడు పై కూడా వీధి కుక్కలు దాడి చేశాయి. ఇలా దేశంలో, మన రెండు తెలుగు రాష్ట్రాల్లో వీధికుక్కల బెడద పెరిగిపోతోంది. ఆ మధ్య గుంటూరులో వీధి కుక్క నాలుగేళ్ల బాలుడి మెడపట్టి ఈడ్చుకెళ్లడంతో పాపం ఆ పిల్లవాడికి అప్పుడే నూరేళ్లు నిండిపోయాయి. గతంలో మెదక్ జిల్లా తూప్రాన్‌లో శునకాలు ఒక్కరోజే పాతికమందిని గాయపరిచాయి. హనుమకొండలో కూడా ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది. ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ సమయంలో ఢిల్లీ స్టేడియం దగ్గరే వీధి కుక్కలు జపాన్, కెన్యా కోచ్‌లను కరిచాయి. ఇలా దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ వీధి కుక్కల విజృంభణ తీవ్ర సమస్యగా పరిణమించిన నేపథ్యంలో.. సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జనం ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల నుంచి వీధి కుక్కలను రక్షణ కేంద్రాలకు తరలించి, సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని ఆదేశించింది. వీధికుక్కల జనాభాను కట్టడి చేయడంలో యంత్రాంగం చేతకానితనమే ప్రజా భద్రతకు పెనుముప్పుగా సంభవిస్తుంది. వీధి కుక్కల గుంపుల స్వైర్యవిహారంతో బయటికి (వీధుల్లో) రావాలంటేనే చాలామంది జంకుచున్నారు. వాటికి భయపడి పెద్దలు వాకింగ్ మానేస్తున్నారు, పిల్లలు పార్కులకు, మైదానాల్లో ఆటలకు దూరమవుతున్నారు. అంతిమంగా ఇది ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వీధి కుక్కలు భీకరంగా అరుస్తూ వాహనదారులను వెంబడిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధి కుక్కలు ఇష్టారాజ్యంగా తిరుగుతూ, పరిసరాలను పాడు చేస్తుండటంతో లేనిపోని రోగాలు అంటగట్టే ప్రమాదం ఉంది. 2030 కల్లా దేశంలో నుంచి రేబిస్ ను తరిమికొట్టాలి అన్నది కేంద్రం లక్ష్యం. అది సహకారం కావాలంటే? సునకాల సంతాన నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంతగా నిధు లు కేటాయించాలి. ప్రభుత్వ ఆసుపత్రులు రేబిస్ టీకాలను విరివిగా అందుబాటులోకి ఉంచాలి. నానా రకాల చెత్త ఆహార వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వీధి కుక్కల సంతతిని ఇబ్బడి ముబ్బడిగా చేస్తుందని ప్రజలు గుర్తించాలి. పశువర్ధక శాఖ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా కోటిన్నరకు పైగా వీధి కుక్కలున్నాయి. సందుల్లో గొందుల్లో యథేచ్ఛగా విహరిస్తున్న వాటి సంఖ్య, వాస్తవం లో అంతకు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని పరిశీలనలు చాటుతున్నాయి. అధికారిక గణాంకాల మేరకు నిరుడు దేశీయంగా 37 లక్షలకు పైగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇవి 21 శాతం అధికం!. ఇక గడచిన మూడేళ్లలో తెలంగాణలో 3.33 లక్షల మంది కుక్క కాట్ల బారిన పడ్డారు. అదే కాలవ్యవధిలో ఎపిలో అంతకు రెట్టింపు మంది, కుక్క కాట్ల బారినపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి స్థానిక సంస్థల అధికారులు వీధి శునకాలకు రేబిస్ టీకాలు వేయించి, సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలి. కానీ యంత్రాంగం అలక్ష్యం, సిబ్బందినిధుల లేమితో అవేమీ అంతగా ఆచరణలో నోచుకోవటం లేదు. దాంతో కుక్కకాట్లు.. రేబిస్ మరణాలు అధికమవుతున్నాయి. ప్రాణాంతక రేబిస్ విశ్వవ్యాప్తంగా ఏటా 60 వేలమందిని కబళించేస్తోంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రులు రేబిస్ టీకాల కొరత లేకుండా చూస్తూ, అవగాహన, అప్రమత్తత చర్యలు చేపట్టాలి. ప్రజలు కూడా వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి. ఉన్నత న్యాయస్థాన సూచనలతోపాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల అధికారులు, ప్రజల ఉమ్మడి సంకల్పంతోనే కుక్కకాటు బెడదతీరి..ప్రజాభద్రతసాధ్యమవు తుంది.

మేకిరి దామోదర్, 9573666650.





## రైతుల వినూత్న నిరసన

**ప్రజాపక్షం/పరిగి:** వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగి మండలం కాడ్లపూర్ గ్రామంలోని రైతులు పొలాల్లో పండే పంటలను సీతారాముల విగ్రహాల ముందు ఉంచి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మా భూములకు సంబంధించి ఎదుర్కొనే సమస్యలను మీ పాదాల చెంత ఉంచుతున్నామని మాకు జీవనాధారమైన భూములలను పూర్వీకుల నుండి మాకు లభించిన ఆస్తి అనీ మా గ్రామ భూముల విషయంలో మాకు ఎలాంటి వివాదాలు లేకుండా ఐక్యంగా ఉండటానికి చూడగలరని కోరారు. మా భూముల్లో పండే పంట పచ్చగా ఉండి రైతుల ఇల్లు సరిసంపదలతో ఉండే విధంగా అనుగ్రహించమని రైతులు కోరారు. మమ్మల్ని దీవించి భూ సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే మార్గం చూడమని సీతారాములను గ్రామస్తులు కోరారు.

## వాడవాడలా మార్మోగిన జై శ్రీరామ్ నినాదాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా శనివారం శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సీతారాముల కళ్యాణ ఉత్సవాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తజనం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జైశ్రీరామ్ నినాదాలో ఆలయాలు, వీధులు మారు మ్రోగాయి. ఆయా ప్రాంతాల్లోని ఆలయాలు కిక్కిరిసి పోయాయి. తెల్లవారుజాము నుండే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో వీక్షించారు. ఆయా ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేసారు. పలు ఆలయాల్లో సీతారాముల కళ్యాణానంతరం



అన్నప్రసాద వితరణ చేపట్టారు. మీర్‌పేట హ హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోని పలు ఆలయాల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలోయల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వారిని శాలువాలతో సత్కరించి మంత్రోఛ్చారన చేస్తూ దైవాశ్సీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు ఉల్లెం బాలరాజు, చారి, ముత్యంరెడ్డి, రాంచందర్ రావు, నవీన్‌గౌడ్ కుమార్, రామకృష్ణ, దేవేందర్ కుమార్, రమేష్, శేఖర్‌గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఫిర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో పలు ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణ వేడుకల్లో ప్రత్యేక అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ జడ్‌పి చైర్మన్ శరత్‌చంద్ర, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, రాజకీయ పార్టీ ప్రతినిధులు, భక్తులుపాల్గొన్నారు.



## గ్రీన్‌హిల్స్ కాలనీలో వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని సీఎం బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ వైస్ చైర్మన్ తుడుము పద్మారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు, మంగళ వాయుద్యాల నడుమ సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు కాలనీ ప్రజల్లో ఐక్యతను మరింత బలపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అమర్ పటేల్, జనరల్ సెక్రటరీ దామోదర్, ట్రెజరర్ రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, కంటెస్టెంట్ ప్రెసిడెంట్ బీరా యాదవ్, రవీందర్, టి.డి.రావు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు సరికొత్త వెలుగులు

### రూ.1,341 కోట్లతో వీధి దీపాల ఆధునీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశ్వనగరం హైదరాబాద్ త్వరలో సరికొత్త శోభను సంతరించుకోనుంది. నగరాన్ని చీకటి రహితంగా మార్చేందుకు ప్రభుత్వం భారీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. జిహెచ్‌ఎంసి సహా క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) పరిధిలోని సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్‌లలో వీధి దీపాల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయనున్నారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం రూ.1,341.60కోట్ల భారీ నిధులను మంజూరు చేస్తూ ఇటీవల ప్రభుత్వం జి.ఓ నెంబర్ 91 జారీ చేసింది. పదేళ్ల కాలపరిమితితో కూడిన ఈ బాధ్యతలను కాకతీయ ఎనర్జీ సిస్టమ్స్ సంస్థకు అప్పగించారు.

*మొత్తం దీపాల సంఖ్య : 7.60 లక్షల ఎల్‌ఇడి వీధి దీపాలు.
*నిర్వహణ కాలం : 10 ఏళ్లు.
*అమలు గడువు : ఒప్పందం కుదిరిన 6 నెలల్లోపు పాత లైట్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి.

**కార్పొరేషన్ల వారీగా దీపాల వివరాలు..**

| కార్పొరేషన్ | వీధి దీపాల సంఖ్య |
|---|---|
| జిహెచ్‌ఎంసి | 3,30,487 |
| సైబరాబాద్ | 1,85,258 |
| మల్కాజిగిరి | 2,44,846 |
| **మొత్తం** | **7,60,591** |

**స్మార్ట్ పర్యవేక్షణ – కఠిన నిబంధనలు**

*ఈ వ్యవస్థను సెంట్రలైజ్డ్ మానిటరింగ్ సిస్టమ్ (సిఎంఎస్) ద్వారా పర్యవేక్షిస్తారు.
*ఎక్కడైనా లైటు వెలగకపోతే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందుతుంది.
*విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టు ఏజెన్సీపై ప్రభుత్వం భారీ జరిమానాలు విధించనుంది.
*లైటు వెలగకపోతే : రోజుకు రూ. 100 జరిమానా.
*పగలు వెలిగితే : విద్యుత్ వృధా చేసినందుకు లైటుకు రూ. 50 జరిమానా.
*డేటా వైఫల్యం : రియల్ టైమ్ డేటా ఇవ్వకుంటే రోజుకు రూ. లక్ష వరకు పెనాల్టీ.
*పరిష్కారం : ఫిర్యాదు అందిన 48 గంటల్లోగా లైటును పునరుద్ధరించాలి.

**ప్రయోజనాలు..**

పాత దీపాల కాలపరిమితి ముగియడం, నిర్వహణ లోపాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల విద్యుత్ ఆదా అవ్వడమే కాకుండా, రాత్రి వేళల్లో మహిళలకు భద్రత పెరుగుతుందని, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అదుపు చేయవచ్చని పోలీస్ శాఖ భావిస్తోంది. ఆరు నెలల్లోనే నగరం 'కాంతి' విప్లవంతో మెరిసిపోనుంది. విద్యుత్ ఆదాతో పాటు నగరానికి కొత్త రూపు రేఖలు తీసుకురానున్న ఈ ప్రాజెక్టుపై అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

### కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు అలియాబాద్ మున్సిపాలిటిలో అంగరంగ వైభవంగా జరిగాయి. అలియాబాద్ మున్సిపల్‌లోని అలియాబాద్, మజీద్‌పూర్, లాల్‌గడిమలక్ పేట, యాడారం గ్రామాల్లో సీతమ్మ రాములోరిని ఊరేగింపుగా తీసుకవచ్చి పచ్చని పందింట్లో కల్యాణ వేడుకలు భక్తులు, ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. మేళ తాళాలతో భాజా భజంత్రీలతో రాములోరి కల్యాణం కన్నల పండవగా నిర్వహించారు. చైర్ పర్సన్ సీతమ్మ వారిని ఆమె భర్త మాజి సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి రాములోరి విగ్రహాలను మండపంలోకి తీసుకవచ్చారు. ఘనంగా జరిగిన సీత రామచంద్రస్వామి పెళ్లి వేడుకల్లో అలియాబాద్ వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు గణేష్, మౌనికబాబు, ముద్దం సుధాకర్‌రెడ్డి, మౌనిక దినేష్ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.





**మూడుచింతలపల్లిలో..**

మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని లక్ష్మాపూర్, ఎంసిపల్లి, ఉద్దెమర్రి, జగ్గంగూడ తదితర గ్రామాల్లో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలు భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో లక్ష్మాపూర్‌లోని శ్రీరాములగుట్టకు మాజి ఎంఎల్‌ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మున్సిపల్ చైర్మన్ జాం రవి, కౌన్సిలర్లు సరిత శ్రీనివాస్, శ్రీవాణి వైద్యనాద్, అజయ్ ఆది, మాజి ఎంపిటిసి పారుపల్లి నాగరాజులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తరించారు. అనంతరం తీర్ద ప్రసాదాలు స్వీకరించారు. దాతల సహాకారంతో అన్నదానం నిర్వహించారు. వేద పండితులు సందీప్ శర్మ, తమ్మల్లి నాగరాజు శర్మ, రమేష్ శర్మ, ఆదిత్య శర్మలు కల్యాణ తంతు వేడుకలను జరిపించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు క్యాతం మధుకృష్ణ, ఆలయ చైర్మన్ చిత్తయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి సింగం పవన్‌కుమార్, కమిటి సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



**దేవరయాంజాల్‌లో..** దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో భక్తులు, దాతల సహాకారంతో అంగరంగ వైభవంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి జిల్లా కాంగ్రెస్ అద్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజి ఎంఎల్‌ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి హరివర్దన్ రెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, కందాడి అంజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు సందీప్‌గౌడ్, తదితరులు హజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజి చైర్మన్‌లు. ధర్మ కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాల కోర్చిన సీతారాముల పవిత్రబంధం అజరామరం

### డా.సత్యం శ్రీరంగం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్రబంధం అజరామరమైనదని, భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమైనదని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం ఏ, బి బ్లాక్‌లోని పలు దేవాలయాలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జన, లోక సంరక్షణే శ్రీరామ నవమి పరమార్థం అని, శ్రీరాముడు సత్య పాలకుడు, ధర్మాచరణ తప్పనివాడు, ఏక పత్నీవ్రతుడు, సర్వ సద్గుణాలు మూర్తీభవించిన దయాహృదయుడు అని అన్నారు. దుష్టశిక్షరక్షణలో భాగంగా రాక్షస సంహారంతో పాటు రావణ సంహారం చేసి లోక కళ్యాణం జరిపించడానికి జనియించింది జానకీదేవి అని అన్నారు. మానవుడిగా పుట్టి మాధవుడైన శ్రీరామ చంద్రుడి వ్యక్తిత్వాన్ని మించిన మహోజ్వలమైన వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకొన్న సీతాదేవి జీవితంలో అడుగడుగు ఆదర్శమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్‌జాన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ కార్పొరేటర్ నరేంద్రచారి, ఏబ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మూర్తి, ఏఎంసి చైర్మన్ పుష్పారెడ్డి, బేగంపేట్ శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి, కుక్కల రమేష్ ముదిరాజ్, వరహాల స్వామి, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## కళ్యాణ మహోత్సవంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్:** శ్రీరామనవమి పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని రమా మందిరం, రాఘవేంద్రస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## భక్తులకు పానకం పంపిణీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ బాగ్ అమీర్‌లోని శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయ సమీపంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర బీసీ నాయకుల జర్నలిస్ట్ తెల్ల హరి కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వారి తల్లిదండ్రులు జ్ఞాపకార్థం భక్తులకు పానకం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జి.బ్రహ్మేంద్ర, రమణ పంతులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధర్మాన్ని నిర్మూలించి ధర్మాన్ని స్థాపించిన శ్రీరాముడి పవిత్ర జన్మదినం మనందరికి ఆనందోత్సవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్వత్ సతీష్ కుమార్, బాగ్ అమీర్ అధ్యక్షులు అల్లం మహేష్ కుమార్, దండే ప్రభు, అల్లం వెంకట్రావు, కొట్టె వేణు, శివ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే మాధవరం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి రామాలయంలో శుక్రవారం శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సతీ సమేతంగా స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు సందీప్, కుమార్తె శ్రీలత, మనవరాలు ఐరా, అల్లుడు, కోడలు సహా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సీతారాములను దర్శించుకున్న ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకుని తాండూరు నియోజకవర్గం పరిధిలోని నారాయణపూర్‌లో, జుంటుపల్లి రామ స్వామి ఆలయం, పాత తాండూరులోని 15వ, 16వ వార్డులలోని సీతారాంపేట్ హనుమాన్ మందిర్, తులసినగర్, సాయిపూర్‌లోని రాంమందిర్, మల్‌రెడ్డిపల్లి, సిసిఐ కాలనీలో ఆలయ కమిటి ఆద్వర్యాన జరిగిన సీతారాముల కళ్యాణ వేడుకలకు తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గోన్నారు. జుంటుపల్లి రామ స్వామి ఆలయంలో జరిగిన రాములోరి కళ్యాణోత్సవంలో పాల్గోన్న ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తాండూరు పట్టణంలో జరిగిన సీతారాముల కళ్యాణ ఉత్సవాలలో ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గోని స్వామి వారిని దర్శించుకున్నారు.ఎంఎల్‌ఎ వెంట తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ నర్సిములు, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్ రెడ్డి, డిసిసిబి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, కౌన్సిలర్‌లు, మాజీ కౌన్సిలర్లతో పాటు స్థానిక నాయకులు పాల్గోన్నారు.

**ఇందిరానగర్ రామ మందిరానికి ప్రభుత్వ చీఫ్ విఫ్ రూ.1.11,111వేల విరాళం**

కళ్యాణోత్సవ కార్యక్రమానికి హజరైన ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి ఇందిరానగర్ సీతా రామ మందిరానికి రూ.1లక్ష, 11వేల 111లు విరాళం ప్రకటించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమరావు,యువ నాయకులు పాల్గోన్నారు.

## ఎంపి నిధులతో సిసి రోడ్డు పనులు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** చేవెళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి ఎంపి నిధుల నుండి 10లక్ష సీసీరోడ్డు పనులు ధారూర్ మండల లోని నాగారం గ్రామ పంచాయతీలో ,ధారూర్ స్టేషన్ లో సీసీ రోడ్డు పనులను మాజీ జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి, దిశకమిటి సభ్యులు వడ్ల నందు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగరం ఐదులక్షలు, స్టేషన్ ధారూర్ గ్రామ పంచాయతీకి ఐదు లక్షల సీసీ రోడ్డు పనులు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్ద ఎత్తున నిదులు విడుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నీరటిలక్ష్మి శ్రీనివాస్ , సోమ్లానాయక్ వివేకనందరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వీరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


# శోభాయాత్రలు, అన్నదానాలతో హోరెత్తిన పుర వీధులు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో వాడవాడలా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు వైభవోపేతంగా జరిగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని నిజాంపేట్ సర్కిల్, దుండిగల్ సర్కిల్, కొంపల్లి, గాజులరామారం, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ తదితర సర్కిళ్లలోని అన్ని డివిజన్‌లు, బస్తీలు, కాలనీలలో శ్రీరామ నవమి వేడుకలు కన్నులపండువగా జరిగింది. ఆయా కాలనీలు, బస్తీల్లోని రామాలయాలు, హనుమాన్ దేవాలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా కోనసాగాయి. శ్రీరామ నామంతో, పాటలతో పలు పుర వీధులు హోరెత్తిపోయాయి. పలు ప్రధాన సెంటర్





లు, చౌరస్తాలలో యువకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి పానకాన్ని అందజేశారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి, కౌసల్య కాలనీలో శ్రీ వెంకట శివ రామాలయంలో మాజీ కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్, లక్ష్మీల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆగం రాజు ప్రారంభించారు. బాచుపల్లి గ్రామం, కెఆర్‌సిఆర్, హరిత వనం కాలనలో



మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను వీరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీ సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున కాలనీల ప్రజలు పాల్గొని రాములోరి కళ్యాణాన్ని తిలకించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాచుపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంగపల్లి నవీన్ కుమార్ మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు. నిజాంపేట్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2లోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి, శ్రీరామ కుంట వద్ద గల రామాలయంలో తదితర ఆలయాల్లో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో మాజీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు, కుటుంబ సమేతంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి, క్రాంతినగర్, దూలపల్లి, బౌరంపేట్ తదితర ప్రాంతాల్లో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేత నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ శ్రీ సీతారాముల కళ్యాణం అంటేనే ఓ పండుగ అన్నారు. ఆ రాములోరి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ప్రార్థించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ గ్రామంతో పాటు పలు కాలనీలు, బస్తీలలో జరిగిన శ్రీ రామ నవమి వేడుకల్లో మాజీ డిసిసి అధ్యక్షులు కెఎం ప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు.

# మలుపులవద్ద అతివేగం నియంత్రణకు చర్యలు

### సిఐ రఘుకుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మలుపుల వద్ద అతి వేగం నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని వికారాబాద్ సిఐ రఘుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో బుగ్గరామేశ్వరం ఆలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాధంలోతండ్రి , కొడుకు మృతి చెందిన ఘటనను దృష్టిలోఉంచుకొని,ఫారెస్ట్ ప్రాంతంలోని డీప్ మలుపుల వద్ద వాహనాల వేగం నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రమాదాలు నివారించేందుకు రోడ్డు మధ్యలోబొల్లార్డ్స్ ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించే చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. మలుపులవద్ద ఓవర్‌టేక్‌చేయడం ప్రమాదకరమని, ఎదుటి వాహనం కనిపించకముందే ఓవర్‌టేక్ చేయకూడదని సూచిం చారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కోంటూ,డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాపిక్‌ని బంధనలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించవచ్చుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సిఐ కోరారు.



**సెల్‌ఫోన్ దొంగల ముఠా గుట్టురట్టు:**

సిఐ బల్వంత్‌రాయ్ ,రఘుకుమార్ , వికారాబాద్ జిల్లాలోని రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్ ప్రాంతాలలో ఖరీదైన సెల్‌ఫోన్లును లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠానుజిల్లా సిసి ఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లాలో సెల్ ఫోన్ దొంగతనాలను నివరించడానికి జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా అదేశాల మేరకు జిల్లా సీసీఎస్ , సిఐ బల్వంత్‌రాయ్ , వికారాబాద్ సిఐ రఘుకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంఏర్పాటు చేసిదర్యాప్తు చేపట్టారు. జిల్లాలోని వికారాబాద్,బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ల పరధిలో నమోదైన సెల్ దొంగతన కేసులపై దర్యాప్తు ప్రారంభించన సిసిఎస్ బృందం ,సీసీటీవి పుటేజ్,టెక్నికల్ ఆదారాలను విశ్లేశించి నిందితుల కదలికనే గుర్తించి, సెల్ ఫోన్ల ముఠా ను పట్టుకోవడం జరిగిందన్నారు. ఇందులో కే.రవి కర్నూల్‌జిల్లా అంధ్రప్రదేశ్ , అదుపులోకితీసుకోవడం జరిగిందన్నారు. నిందితుడు తనతో పాటు ఐదుగురు పెద్దవారు, ముగ్గురు మైనార్ బాలురులతో కలిసి రద్దీ ప్రాంతాలలో దొంగతనాలు చేశానని ఒప్పుకున్నారని తెలిపారు. వికారాబాద్ పోలీసులు నిందితులు అద్దెకు తీసుకున్ననివాస ప్రాంతంలో సోదాలు నిర్వహించి మొత్తం 25 సెల్‌ఫోన్లు స్వాదినుచేసుకున్నారు. నిందితులుగా రవి, కర్నుల్, మహేష్ మహబుబ్ నాగర్, ఆకుల కర్తీక్ శేరిలింగంపల్లి హైదరాబాద్, వడ్డె మురళి జడ్చర్ల మహబుబ్‌నాగర్, వడ్డె వెంకటేష్‌బాలనగర్, మహబుబ్‌నాగర్, సంపగి, తిరుపతిలను పాపిరెడ్డికాలనీ హైదరాబాద్‌గా గుర్తించారు. సెల్ ఫోన్‌లతో పాటు సుమారు 3,75,000 రూపాయల విలువకల్గిన మొత్తం 25 ఫోన్లు స్వాధీనం చేసుకోని నిందితులపై కేసునమోదు చేసి జైలుకు తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రమేష్, రాజు, రామకృష్ణ, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# లోగో వాడితే కఠిన చర్యలు

## జలమండలి ఎండి అశోక్‌రెడ్డి

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** వేసవి నేపథ్యంలో కొందరు అక్రమార్కులు జలమండలి పేరిట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారని.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. జలమండలి అధికారిక లోగోను కొందరు వ్యక్తులు, ముఖ్యంగా ప్రైవేట్ నీటి ట్యాంకర్ యజమానులు, అనధికారికంగా వినియోగిస్తున్నట్లు ఇటీవల జలమండలి దృష్టికి వచ్చిందని... ఈ విధమైన చర్యలు పూర్తిగా చట్ట విరుద్ధమైనవిగా పరిగణించడం జరుగుతుందని ఎండీ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. జలమండలి లోగో అనేది సంస్థ ప్రభుత్వ అధికారిక గుర్తింపు చిహ్నమని.. దీనిని అనుమతి లేకుండా వినియోగించడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే అవకాశం ఉందని... ప్రైవేట్ ట్యాంకర్లు జలమండలి లోగోను ఉపయోగించడం వల్ల, ఆ ట్యాంకర్లు ప్రభుత్వ సేవల భాగంగా ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడుతోందని.. ఇది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమే కాకుండా, మోసపూరిత చర్యగా గుర్తిస్తారని తెలిపారు. ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా పరిగణించి, లోగో దుర్వినియోగం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించిందని.. జలమండలి పేరు, లోగో, బ్రాండ్ ఉపయోగిస్తూ కొంతమంది ప్రైవేట్ బోర్వెల్ ట్యాంకర్ ఆపరేటర్లు అనధికారికంగా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నట్లు బోర్డు దృష్టికి వచ్చిందని.. దీనివల్ల ఆ నీరు జలమండలి ద్వారా సరఫరా చేయడం జరిగిందనే తప్పుడు భావన కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీరు సాధారణంగా బోర్ వెల్ల నుంచి సేకరించి.. ఈ నీరు జలమండలి ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయనిదని.. అలాగే నాణ్యత పరీక్షలు కూడా చేయడం జరగనిదని.. అందువల్ల, ఈ నీటిని వినియోగించడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ ఆపరేటర్లపై ఆధారపడవద్దని జలమండలి సూచిస్తోందని.. ఈ నీటి నాణ్యత సురక్షితం కాకపోవడమే కాకుండా ఆరోగ్యానికి హానికరమై ఉండే అవకాశం ఉందని.. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. టోల్ ఫ్రీ నెం: 155313 కు కాల్ చేసి, సురక్షితమైన, శుద్ధి చేసిన తాగునీటిని పొందవచ్చు అని తెలిపారు.

### ఆస్తిపన్ను బకాయిదారులపై
# జిహెచ్‌ఎంసి కొరడా

## పన్ను చెల్లించని వాణిజ్య సముదాయల సీజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిలో ఆస్తి పన్ను చెల్లించని భారీ బకాయిదారులపై అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. బకాయిలు చెల్లించని ఆస్తులను సీజ్ చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో అధికారులు దాడులు నిర్వహించి ఆస్తులను సీజ్ చేస్తున్నారు. బకాయి ఉన్న ఆస్తిపన్నును వెంటనే చెల్లించే వారికి వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ నెల ఆఖరు వరకు ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. బకాయిలను ఆన్‌లైన్ (www.ghmc.gov.in), మై కేర్ (MyCURE) యాప్, లేదా మీసేవా కేంద్రాల ద్వారా చెల్లించవచ్చు అని చెప్పారు. ఆదివారం కూడా జిహెచ్‌ఎంసి సిటీజన్ సర్వీస్ సెంటర్లు పనిచేస్తాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కర్ణన్ సూచించారు. మొండి బకాయిదారుల విషయంలో చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ (రెవెన్యూ) ప్రియాంక అల పర్యవేక్షణలో డిప్యూటీ కమిషనర్లు, వారెంట్ బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొంటున్నాయి.

# గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న కందిమల్ల సాయి(20)అనే విద్యార్థి హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలోని నందిగూడెం మండలం శ్రీరంగాపురానికి చెందిన సాయి స్థానికంగా ఉన్న దివ్యరెడ్డి హాస్టల్‌లో ఉంటున్న సాయి తన గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, పరిసర ప్రాంతాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న పలు సంఘటనలు గతంలోను ఉన్నాయి. యాజమాన్యం ఒత్తిడితోనా...మరిఏదైనా కారణమా!? తరచూ ఇలాంటి సంఘటనలు జరగడంతో విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రామాలయం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపాన గల శ్రీరామాలయం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా సాన్స్ స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల హెల్త్ క్యాంపు విజయవంతమైంది. ఈ శిబిరాన్ని మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్ శివారులో గల ప్రముఖ సాన్స్ స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ముఖ్యంగా చర్మ వ్యాధులు, జుట్టు సమస్యలు,అలర్జీలు,మొటిమలు,దురద,చర్మంపై మచ్చలు వంటి అనేక సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. పట్టణ ప్రజలకు చేరువలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సాయిసింధు మాట్లాడుతూ యువతలో హెయిర్ ఫాల్, డాండ్రఫ్, పింపుల్స్, స్కిన్ అలర్జీలు అధికమవుతున్నాయని తెలిపారు. అందుకే సమస్య మొదలైన వెంటనే వైద్యులను సంప్రదిస్తే తక్కువ సమయంలో పూర్తి పరిష్కారం లభిస్తుందని సూచించారు. ప్రజలకు ఆధునిక వైద్య పరిజ్ఞానం ద్వారా మెరుగైన చికిత్స అందించాలనే ఉద్దేశంతో శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్య సమస్యలకు సకాలంలో చికిత్స పొందారని వివరించారు. శంకర్‌పల్లి ప్రాంత ప్రజలు ఆరోగ్య సమస్యల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

# శాంతియుతంగా పండుగల జరుపుకోవాలి : ఎమ్మెల్యే యాదయ్య



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ప్రజలు శాంతియుతంగా పండుగల జరుపుకోవాలని చేవెళ్ల ఎంఎల్ఏ కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం శంకర్ పల్లి మండలం మోకిలా గ్రామంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్, మోకిలా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంద్ర సత్యం, సహకార సంఘం మాజీ చైర్మన్ గోపాల్, గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ భక్తులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శ్రీరాముడు జీవితం ఆదర్శం

## ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** శ్రీ రాముడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజంలో మంచి విలువలను పెంపొందించుకోవాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం మనకు ధర్మం, నీతి, సత్యం మార్గంలో నడిచేలా ప్రేరణనిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, భక్తులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడు శ్రీరాముడు

## ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** ధర్మపాలనకు ప్రతీకగా నిలిచిన మహానుభావుడు శ్రీరామచంద్రస్వామి అని, వారి అడుగుజాడల్లో నడిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నందిగామ మండలం దేవుని మామిడిపల్లి గ్రామంలో ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవంలో దేవుని మామిడిపల్లి గ్రామస్తులే కాకుండా మాజీద్ మామిడిపల్లి, మొదళ్ళగూడ, శ్రీనివాసుల గూడ, మంచన్‌పహాడ్, ఈదులపల్లి, మోత్కులగూడ, వీర్లపల్లి, కుమ్మరిగూడ, కేశారం తదితర గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచి ఎలాంటి కష్టాలు వచ్చినా సత్యం, నీతి మార్గాన్ని విడిచిపెట్టలేదని అన్నారు. తల్లిదండ్రుల మాట కోసం రాజ్యాన్ని వదలి ప్రజల మేలు కోసం జీవించి ధర్మాన్ని కాపాడారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవుని మామిడిపల్లి సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కాట్న రవీందర్, మొదళ్ళగూడ మాజీ సర్పంచ్ ఉమా ప్రవీణ్‌రెడ్డి, మామిడిపల్లి ఉప సర్పంచ్ మామిళ్ళపల్లి రాజు, మొదళ్లగూడ ఉప సర్పంచ్ విక్రమ్‌రెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, ఆశ్రఫ్, రమేష్ గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వినోద్, కిరణ్‌గౌడ్, కారె శ్రీకాంత్, ప్రభాకర్‌తోపాలు భక్తులు పాల్గొన్నారు.

# 10.16 కేజీల గంజాయి పట్టివేత..

## ఆరుగురుపై కేసు నమోదు.. ముగ్గురు అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాంపల్లి ప్రాంతంలో పెట్రోల్ బంకు వద్ద నాంపల్లి ఎస్‌టిఎఫ్ ఎ టీం లీడర్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి గంజాయి అమ్మకాలపై తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 10.16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఆరుగురు పై కేసు నమోదు చేశారు. వీరిలో హేమా చంద్రకాంత్ హట్ వాలే (మహారాష్ట్ర)కు, సాకేత్ శంకర్, కసాబ్ రాజు అనే ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో శివరాజ్ హట్ గడ అక్షయ్ జావేద్ అనే ముగ్గురు నిందితులు కూడా ఉన్నట్లుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు హెచ్డిఎఫ్సి లీడర్ అంజిరెడ్డి తెలిపారు

# 29న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్

## జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఈ నెల 29 న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ ,న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్)"ఉల్లాస్"కు జిల్లా వయోజన విద్యాశాఖ, డిఆర్‌డిఎ రంగారెడ్డి జిల్లా వారి సమన్వయంతో పరీక్షనిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అనిత శుక్రవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు అభ్యాసకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. పరీక్షకు హాజరు కావాలనుకునే వారు స్థానిక సెర్ప్ సిబ్బంది వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎన్ఐఎల్‌పి"ఉల్లాస్" కార్యక్రమంలో భాగంగా గత సంవత్సరం అక్టోబర్ నుండి అక్షర కేంద్రాల్లో చదువు నేర్చుకుంటున్న అభ్యాసకులకు, జిల్లాలోని అన్ని మండలాల ఎపిఎంలకు ఈ నెల 29న జిల్లా వయోజన విద్యాశాఖ, డిఆర్‌డిఎ రంగారెడ్డి జిల్లా తోపాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేష న్ సమన్వయంతో నిర్వహించనున్న పరీక్షను అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత వివరించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా చదువు నేర్చుకుంటున్న అభ్యాసకులు ఈ పరీక్షకు హాజరు కావాలని సూచించారు.అదేవిధంగా పరీక్షకు హాజరయ్యే అభ్యాసకులు తమ గ్రామాలలోని సెర్ప్ సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలిపారు.

**ఉమ్మడి జిల్లాలో మొత్తం 38,869 మంది అభ్యాసకులు...** కాగా జిల్లాలో మొత్తం 38,869 మంది అభ్యాసకులు పరీక్షను రాయనున్న నేపథ్యంలో పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరాసీ అసెస్‌మెంట్ టెస్ట్/నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ పరీక్ష రాసే అభ్యాసకుల లిస్టును గ్రామాల వారీగా తయారు చేసుకోవాలని డిడి అనిత సూచించారు.

**పరీక్షలు రాసే అభ్యర్థుల సౌకర్యార్థం ఈ దిగువ తెలిపిన సూచనలు పాటించగలరు :**

1,అభ్యాసకుల లిస్టులను సాఫ్ట్ కాపీ లను తయారు చేసుకోగలరు.


2,పరీక్ష రాసే అభ్యాసకుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయవలెను.

3,రిజిస్టర్ అయిన అభ్యాసకులు పరీక్షకు హాజరయ్యేలా చూడగలరు.

4,గ్రామపంచాయతీలలో పరీక్ష నిర్వహించబోయే పరీక్ష కేంద్రాలను గుర్తించగలరు.

5,పరీక్ష సమర్థవంతంగా నిర్వహించడం కొరకు ఇన్విజిలేటర్‌లతో సహకరించగలరు.

# సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం సీతారాముల కల్యాణం



**ప్రజాపక్షం/మియాపూర్:** భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు సీతారాముల కళ్యాణం నిలువుటద్దమని జిహెచ్‌ఎంసి మియాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మియాపూర్ డివిజన్ వ్యాప్తంగా శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండా, ఆర్డిబి కోకనట్ గ్రో అపార్ట్మెంట్స్, శ్రీల గార్డెన్ కాలనీ, లక్ష్మీ ఇంపీరియా అపార్ట్మెంట్స్, ఏఎస్ రాజు నగర్, డీకే ఎన్‌క్లేవ్, కృషి నగర్, ప్రశాంత్ నగర్, మియాపూర్ విలేజ్, జయ ప్రకాష్ నారాయణ్ నగర్, ఎస్ ఆర్ ఫార్చ్యూన్ సిటీ మరియు మక్త మహబూబ్ పేట్ గ్రామాల్లో నిర్వహించిన కళ్యాణ వేడుకలకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమం డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, భక్తులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా సీతా కల్యాణం

**ప్రజాపక్షం/శంకర్ పల్లి;** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలోని రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఉదయం 11:34 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ప్రధాన అర్చకులు రాజేశ్వర్ జోషి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాముడు తరపున కె. కిషోర్ కుమార్ పావని దంపతులు, శ్రీ సీతమ్మ వారి తరపున ఎంసాని పవన్ కుమార్ మమత దంపతులు పాల్గొన్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల కృపకు పాత్రులు అయ్యారు. కళ్యాణానికి వచ్చిన భక్తులకు జై భవాని యూత్ శ్రీరామ సేన వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ మీర్ ముదసర్ అలీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కళ్యాణానికి మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఆదర్శవంతమైన పాలన అందించిన మహనీయుడు శ్రీరాముడు

## మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆదర్శ పాలన అందించిన మహనీయుడు శ్రీరాముడి అశీస్సులు అందరిపై ఉండాలని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప కోరారు. శుక్రవారం షాద్‌నగర్‌లో హిందూ వాహిని, ఆర్ఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరాముడి శోభయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీరాముడిని మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మపాలన, న్యాయం, సమానత్వం, ప్రజల సుఖ సంతోషాలతో కూడిన ఆదర్శవంతమైన పాలన అంధించిన మహానీయుడు అని పేర్కొన్నారు. అందుకే వారి పరిపాలనపై రామరాజ్యం అనే పేరు వచ్చిందని గుర్తు చేశారు.

# ఆదర్శమూర్తి శ్రీ సీతారామచంద్ర స్వామి

## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆదర్శ మూర్తి శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొనడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపాలిటిలోని వివిధ వార్డులతోపాటు కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో శ్రీ సీతారాములు కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మున్సిపాలిటీలోని పటేల్ రోడ్డు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, టీచర్స్ కాలనీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, అయ్యప్పకాలనీ, సాయిబాబా కాలనీ, ఆర్‌టిసి కాలనీ, భగీరథ కాలనీ, జానంపేటలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో, నందిగామ మండలం చేగూరు, మామిడిపల్లి గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన స్వామివారి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

### వైభవంగా శ్రీరాముడి శోభయాత్ర

శ్రీరామ నవమి పురస్కరించుకొని హిందూ వాహిని ఆధ్వర్యంలో శ్రీరాముడి శోభయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం షాద్‌నగర్ రైల్వే స్టేషన్ నుండి జానంపేటలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు శ్రీరాముడి శోభయాత్రను వైభవంగా నిర్వహించారు. శోభయాత్రను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, అంజయ్య యాదవ్, ఏసిపి లక్ష్మీనారాయణ, హిందూ వాహిని సభ్యులు పాల్గొని శోభయాత్రను ప్రారంభించారు. శోభయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పట్టణ సిఐ సీతారాం నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణోత్సవం





**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శ్రీరామనవమి పర్వదినంను పురస్కరించుకొని చందానగర్ డివిజన్ పరిదీలోని దీప్తిశ్రీ నగర్, ఫ్రెండ్స్ కాలనీ, సాయి కీర్తి ఉస్టేట్ అపార్ట్‌మెంట్స్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలలో సిర్వహించిన సీతారామ కళ్యాణ మహోత్సవం కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడీ గాంధీ, చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, మియాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉప్పాలపాటి శ్రీకాంత్ లు విచ్చేసి కాళ్యాణోత్సవంలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బల్లా నరేందర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. చందానగర్‌లోని రేణుక ఎల్లమ్మ దేవాలయం, పలు దేవాలయాల వద్ద నిర్వహించిన సీతారాముల కళ్యణామహోత్సవంలో చందానగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. శ్రీరామనవమి పర్వదినంను పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ పరిధీలోని ఖజాగూడ, నానక్‌రామ్‌గూడ, మియాపూర్, నల్లగండ్లలలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవ, పూజ కార్యక్రమాలలో శేరిలింగంపల్లి బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదాన వితరణ కొమిరిశెట్టి వినయ్ కుమార్, దార్గుపల్లి నరేష్, శివరాజ్, బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి, నారయణ, గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు. శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకొని ఉమ్మడి మాదాపూర్ డివిజన్ పరిధలోని మాదాపూర్, అయ్యప్పసోసైటీ లలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవాలలో మాదాపూర్ డివిజన్ బిఆర్‌ఎస్ నాయకులు ఇ. శ్రీనివాస్‌గౌడ్ విచ్చేసి పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాహుల్, లక్ష్మ ణ్, నరేందర్ రెడ్డి, నీలేష్, వినోద్ యాదవ్, అఖిల్, లడ్డు, బంటి పాల్గొన్నారు.

**కొందుర్గు:** శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని ఉమ్మెంత్యాల గ్రామంలో సర్పంచ్ కమ్మదనం జ్యోతి శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో బాలన్నగారి సుదర్శన్‌రెడ్డి, పోతురాజు గోపాల్, మాజీ సర్పంచ్ నర్సింలు, కొందుర్గు మండల ఎమ్మార్పిస్ అధ్యక్షుడు అనేగాళ్ల ఆనంద్ మాదిగ, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్కొండ భూపాల్ గౌడ్, ఈగ వెంకట్‌రెడ్డి, ఈగ నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

**షాబాద్:** షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్, షాబాద్, కొమరబండ, గ్రామాల్లో సీతారాములు కళ్యాణం భక్తి శ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వివిధ పారీల ప్రజాప్రతినిధులు పాల్గొని స్వామి కళ్యాణంలో తిలకించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డిలు పాల్గొని స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్నారు.

# టీమిండియాలోకి వైభవ్ సూర్యవంశీ

## ఇక పరుగుల వరద పారడం ఖాయమా?



క్రికెట్ ప్రపంచంలో తారాజువ్వ మాదిరిగా వచ్చిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం భారత క్రికెట్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. కేవలం 14 ఏళ్ల 23 రోజుల వయసులోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించాడు. తన తొలి మ్యాచ్‌లోనే శార్దూల్ ఠాకూర్ వేసిన మొదటి బంతిని సిక్సర్‌గా మలచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అంతటితో ఆగకుండా, కేవలం మూడో మ్యాచ్‌లోనే గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లో సెంచరీ సాధించి, యూసుఫ్ పఠాన్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును బద్దలు కొట్టాడు. ఐపీఎల్‌కె పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ వైభవ్ తన సత్తా చాటాడు. ఇటీవల జరిగిన అండర్–19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లాండ్‌పై కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు (15 సిక్సర్లు, 15 ఫోర్లు) చేసి భారత్‌కు టైటిల్ అందించాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల్లోనూ అతని ప్రదర్శన నిలకడగా ఉండటం విశేషం. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిబంధనల ప్రకారం అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు కనీస వయసు 15 సంవత్సరాలు. మార్చి 27, 2026 నాటికి వైభవ్ 15వ ఏట అడుగుపెట్టడంతో, అధికారికంగా టీమిండియా సీనియర్ జట్టుకు ఎంపికయ్యే అర్హత సాధించాడు. గతంలో పాకిస్థాన్‌కు చెందిన హసన్ రజా అతి చిన్న వయసులో టెస్ట్ క్రికెట్ ఆడిన రికార్డు ఉంది. ఇప్పుడు వైభవ్ కూడా అదే దారిలో ముందుకు సాగుతున్నాడు. త్వరలోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలతో కలిసి ఆడే అవకాశం ఈ యువ సంచలనానికి దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐపిఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బిజీగా ఉన్న అతడు, మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్లో మళ్లీ బరిలోకి దిగనున్నాడు. ఇక భవిష్యత్తుపై చూస్తే, 2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా సెలెక్టర్లు వైభవ్‌ను కూడా పరిశీలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అతని ప్రస్తుత ఫామ్, ఆత్మవిశ్వాసం చూస్తుంటే, బిసిసిఐకి ఇది తీపి తలనొప్పిగా మారే అవకాశముంది. మొత్తానికి, చిన్న వయసులోనే రికార్డులు సృష్టిస్తూ ముందుకు దూసుకెళ్తున్న వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్‌కు మరో సూపర్ స్టార్‌గా మారడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# చిన్నస్వామిలో ప్రాక్టీస్ సందడి

## నెట్స్‌లో చెమటోడ్చిన ఆర్‌సిబి, సన్‌రైజర్స్ క్రికెటర్లు




దాదాపు పది నెలలకు పైగా క్రికెట్ మ్యాచ్‌లకు దూరమైన చిన్నస్వామి స్టేడియంలో ఐపిఎల్ సందడి నెలకొంది. రేపటితో టోర్నీ షురూ కానున్నందున రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు మైదానంలోకి దిగారు. ఆరంభ పోరులో విజయమే లక్ష్యంగా ఇరుజట్ల క్రికెటర్లు శుక్రవారం నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశారు. నిరుడు జూన్ 4న తొక్కిసలాటల ఘటనతో క్రికెట్ మ్యాచ్‌లకు నోచుకోని చిన్నస్వామి స్టేడియానికి పూర్వవైభవం వచ్చింది. కర్నాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఎంపికవ్వడమే ఆలస్యం మ్యాచ్‌ల నిర్వహణకు నెలకొన్న అడ్డంకులపై దృష్టి సారించిన వెంకటేశ్ ప్రసాద్ అనుకున్నది సాధించాడు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవడం, ఏకసభ్య కమిషన్ సూచన మేరకు స్టేడియంలో అవసరమైన నిర్మాణాత్మక మార్పులు చేయడం ద్వారా ఐపీఎల్ సందడికి చిన్నస్వామి సిద్ధమైంది. ఆరంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సిబిని రికార్డ్ బ్రేకర్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఢీకొడుతోంది. శనివారం రాత్రి 7:30 గంటలకు మ్యాచ్ జరుగనుంది. అందుకని మ్యాచ్ సన్నద్ధతలో భాగంగా శుక్రవారం ఆర్‌సిబి, ఆరెంజ్ ఆర్మీ ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. బ్యాటర్లు భారీ షాట్లు ప్రాక్టీస్‌తో చెమటోడ్చగా.. బౌలర్లు వికెట్టే లక్ష్యంగా బంతులు సంధించారు. అనంతరం ఫీల్డింగ్ చేస్తూ తొక్కిసలాటతో మసకబారిన చిన్నస్వామికి మునపటి కళను తీసుకొచ్చారు. విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, జాకబ్ బెథెల్లు బ్యాటింగ్ సాధనతో బిజీగా గడపగా.. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ పెద్ద షాట్లతో మేము సిద్ధమని చాటారు. విజయంతో టోర్నీని ఆరంభించాలనే కసితో ఉన్న రెండు జట్లలో బోణీ కొట్టేది ఎవరనేది ఉత్కంఠ రేపుతోంది.

# భారత ఫుట్‌బాల్ జట్టుకు అవమానం

ఆసియా కప్ క్వాలిఫయ్‌పై గురి పెట్టిన భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు ఘోర అవమానం జరిగింది. ప్రాక్టీస్ మ్యాచ్ ఆడేందుకు వెళ్లిన హెడ్కోచ్ ఖలీద్ జమిల్, ఆటగాళ్లను స్టేడియం లోపలికి అనుమతించలేదు. ఫలితంగా మ్యాచ్‌కు ముందు జరగాల్సిన మీడియా సమావేశం జరుగలేదు. ఫుట్‌బాల్ టీమ్‌ను నస్టేడియంలోకి అనుమతించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈమధ్య కాలంలో పేలవమైన ఆటతో నిరాశపరుస్తున్న భారత ఫుట్‌బాల్ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఏఎఫ్సీ ఆసియాకప్ క్వాలిఫయర్స్లో హాంకాంగ్‌తో మ్యాచ్‌కు సిద్ధమవ్వాలనుకున్న బ్లూ టైగర్స్‌ను కొచ్చిలోని స్టేడియం లోపలికి అనుమతి లభించలేదు. గురువారం కోచ్ ఖలీద్‌జమిల్, ముగ్గురు ఆటగాళ్లు జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రాక్టీస్ చేసేందుకు వెళ్లారు. కానీ, ఆలిండియా ఫుట్‌బాల్ సంఘం బాకీ డబ్బులు చెల్లించని కారణంగా వారిని సిబ్బంది లోపలికి అనుమతించలేదు. ఈఘటనపై కొచ్చి ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు నవాస్ మీరన్ మాట్లాడుతూ.. చిన్న సాంకేతిక సమస్య ఏర్పడిందని.. అందుకే కోచ్, ఆటగాళ్లను అనుమతించలేదని, అయితే.. షెడ్యూల్ ప్రకారం భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ చేసుకోవచ్చని వెల్లడించాడు. మార్చి 31న హాంకాంగ్‌తో భారత జట్టు తలపడనుంది.

# సైన్స్



## అనంత విశ్వంలో 'జీవం' ఉనికి!


జీవం భూమిపైనే ప్రత్యేకంగా ఏర్పడింది అనే పాత అభిప్రాయం ఇప్పుడు కూలిపోతోందని. హయాబుసా2 మిషన్ ద్వారా, 'రుగు' నుండి తెచ్చిన నమూనాల్లో న్యూక్లియోబేస్‌లు కనుగొనడం ఒక ముఖ్యమైన శాస్త్రీయ పరిణామంగా పేర్కోవాలి. అడెనైన్, గ్వానైన్, సైటోసైన్, థైమైన్, యురాసిల్ వంటి మూలకాలు జీవానికి కీలకం. అందులో సందేహం లేదు. అయితే, ఇవి ఉన్నాయంటే జీవం కూడా అంతరిక్షంలో సాధారణం అనే నిర్ణయం నేరుగా తీసుకోవడం సరైన తర్కం కాదు. మరింత లోతైన అధ్యయనం అవసరమవుతుంది. రసాయన మూలకాలు ఉండటం, అవి స్వయంగా జీవంగా మారటం అనేవి రెండు పూర్తిగా వేర్వేరు దశలు. 'రుగు'లో ఈ మూలకాలు కనిపించడం వల్ల, జీవానికి అవసరమైన బేసిక్ పదార్థాలు విశ్వంలో విస్తృతంగా ఉండవచ్చని మాత్రమే చెప్పగలం. కానీ, సోషల్ మీడియాలో వస్తున్న వార్త మాదిరి, అనంత విశ్వంలో జీవం ఉనికి తెలిసిందని చెప్పడం అతిశయోక్తి మాత్రమే. జీవానికి అనువైన పదార్థాలు స్వయంసంఘటన ద్వారా జీవకణాలుగా ఎలా మారతాయి అనేది ఇంకా పరిష్కారానికి నోచుకోని ప్రశ్న. కొంత మంది ప్రస్తావిస్తున్న 'పాన్స్‌పెర్మియా' సిద్ధాంతం కొంత ఆసక్తిని రేపుతున్నది. కానీ అందులోనూ ఒక లోపం ఉంది. ఇది జీవం ఎక్కడి నుంచి వచ్చింది? అనే ప్రశ్నను కేవలం మరో చోటికి మారుస్తున్నదేతప్ప, సమాధానం ఇవ్వదు. జీవం భూమికి బయట నుంచి వచ్చిందనుకుంటే, ఆ బయట ప్రదేశంలో అది ఎలా ఏర్పడింది? అనే ప్రశ్న ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోతుంది. భూమి మీదే జీవం స్వతంత్రంగా ఏర్పడింది కానీ అంతరిక్షం నుంచి వచ్చిన ఈ రసాయనాలు ఆ ప్రక్రియను వేగవంతం చేశాయనే ప్రతిపాదనను ఈ సందర్భంగా ప్రస్తావించాలి. అంటే, అంతరిక్షం సప్లయర్, భూమి ల్యాబ్ గా పనిచేసి ఉండాలి. ఇది నిరూపణకు నోచుకోని సిద్ధాంతం మాత్రమే. అదే సమయంలో, విస్తారంగా ప్రచారం జరుతున్నట్టు ఐదు న్యూక్లియోబేస్‌లు ఒకేచోట కనిపించాయి కాబట్టి ఇది పెద్ద అద్భుత శాస్త్ర పరిశోధనగా పేర్కోవడం కూడా కొంత అతిశయోక్తికి కారణం.

## గ్రహాల అద్భుత దృశ్యం



సాయంత్రపు అంచుల్లో సూర్యాస్తమయం అనంతరం ఆకాశం నీలం, ఊదా, నారింజ రంగుల సమ్మేళనంతో అలంకరించబడిన వేళ, గ్రహాలు ఒక వరుసలో కదులుతున్నట్లు కనిపించే దృశ్యం ఒక ఖగోళ అద్భుతం. ఇది ఒక ఊహాచిత్రం. నిజానికి గ్రహాలు ఈ స్థాయిలో కనువిందు చేయవు. కానీ, వాటి కవాతు నిజం. అది ఓ ఖగోళ అద్భుతమన్నది కూడా నిజం. వలయాలను అలంకరించుకొని మొదట శని వంటి గ్రహం కనిపించి, దాని వెనుక ఇతర గ్రహాలు ఒక క్రమబద్ధమైన శోభాయాత్రలో సాగుతున్నట్టుగా భావన కలుగుతుంది. ఈ గ్రహాలన్నీ ఒక బంగారు కాంతి రేఖపై ప్రయాణిస్తున్నట్లు కనిపించడం, ఆ దృశ్యానికి మరింత మాయాజాలాన్ని అందిస్తుంది. ఈ అనుభవంలో ప్రతి గ్రహం తన స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. వీటిలో కొన్ని రాతి ఉపరితలాలతో గట్టి నిర్మాణం కలిగి ఉండగా, మరికొన్నివి వాయువులతో కూడిన గోళాలుగా ఉంటాయి. వలయాలు కలిగిన గ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సూర్యాస్తమయం సమయంలో ఏర్పడే బంగారు కాంతి వ్యాప్తి కారణంగా, ఇవన్నీ ఒకే మార్గంలో కదులుతున్నట్లు కనిపించడం మన దృష్టి మాయ మాత్రమే. అయినప్పటికీ, అది ఒక దివ్య ప్రదర్శనలా అనిపిస్తుంది. కింద ప్రశాంతంగా ఉన్న సముద్రం ఆకాశంలోని రంగులను ప్రతిబింబిస్తూ నీలం, ఊదా, అగ్ని నారింజ వర్ణాలను కలిపి ఒక జీవంత చిత్రంలా కనిపిస్తుంది. గ్రహాలపై పడే వెలుతురు వాటి ఆకృతులను స్పష్టంగా చూపిస్తూ, సూక్ష్మ నీడలను సృష్టిస్తుంది. దీనివల్ల మొత్తం దృశ్యం చలనంతో నిండినట్టుగా కనిపిస్తుంది. అయితే, ఖగోళ శాస్త్రపరంగా చూస్తే, అన్ని గ్రహాలు పూర్తిగా ఒకే రేఖలో ఇలా కనబడటం చాలా అరుదైన విషయం. దీనిని 'ప్లానెటరీ అలైన్‌మెంట్' అంటారు. కానీ, సాధారణంగా కొన్ని గ్రహాలే సమీపంగా కనిపిస్తాయి. కాబట్టి ఈ దృశ్యం శాస్త్రీయ సూత్రాలపై ఆధారపడిన ఒక కళాత్మక ఊహ మాత్రమే. అయితే, ఇలాంటి దృశ్యాలు మనిషికి తన స్థానం గురించి గుర్తుచేస్తాయి. విశ్వం నిశ్శబ్దంగా తన క్రమంలో కొనసాగుతుంటే, మనిషి దాని ముందు ధూళికణంలా కనిపిస్తాడు. ఈ అద్భుతాన్ని చూడగానే మనలో ఆశ్చర్యం, ప్రశాంతత కలుగుతాయి. మన సమస్యలు చిన్నవిగా అనిపిస్తాయి.

## సౌర కుటుంబం శూన్యంలో లేదు!



మన సౌర కుటుంబం అనేది సూర్యుడు, అతని చుట్టూ తిరిగే గ్రహాలు, గ్రహశకలాలు, ధూళి, వాయువులతో కూడిన వ్యవస్థ. ఇది శన్యూంలో తేలుతున్నట్టు కాకుండా, ఒక ఖగోళ ప్రాంతంలో ఉంటుంది. దానిని శాస్త్రవేత్తలు 'లోకల్ హాట్ బబుల్' అని పిలుస్తారు. ఈ ప్రాంతం సుమారు 300 లైట్‌యేళ్ల పరిమాణంలో విస్తరించి, అతి తక్కువ సాంద్రత గల వేడి ప్లాస్మాతో నిండి ఉంటుంది. ఇది గతంలో జరిగిన సూపర్‌నోవా పేలుళ్ల వల్ల ఏర్పడిన ఒక పెద్ద గుహలాంటి నిర్మాణం. ఇటీవలి పరిశోధనల్లో, ముఖ్యంగా 'ఇరోసిటా' సేకరించిన డేటా ఆధారంగా, ఈ బుడగ పూర్తిగా ఒంటరిగా లేదని తెలిసింది. దీని నుంచి బయటకు వెళ్లే టన్నెల్స్‌లాంటి మార్గాలు ఉన్నట్లు గుర్తించా రు. ఈ మార్గాలు వేడి, తక్కువ సాంద్రత గల వాయువులతో నిండి, మన ప్రాంతాన్ని ఇతర నక్షత్ర సమూహాలతో కలుపుతున్నాయి. ముఖ్యంగా ఈ మార్గాలు 'సెంటారస్', 'కానిస్ మేజర్' నక్షత్ర మండలాల దిశల్లో విస్తరించినట్లు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకూ మన సౌర వ్యవస్థ ఉన్న ప్రాంతం ఒక ఒంటరి గుహలా ఉందని భావించేవారు. కానీ ఇప్పుడు ఇది గెలాక్సీ అంతటా విస్తరించిన ఒక నెట్‌వర్క్‌లో భాగమని అర్థమవుతోంది. ఈ నిర్మాణం బుడగలు, వాటిని కలిపే టన్నెల్స్‌తో కూడిన ఫోమ్‌లాంటి రూపంలో ఉందని భావిస్తున్నారు. ఈ టన్నెల్స్ కేవలం నిర్మాణాలే కాకుండా, శక్తి, వాయువుల మార్పిడి మార్గాలుగా పనిచేస్తాయి. గ్యాస్ ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రవహించడం, వేడి పంపిణీ కావడం వంటి ప్రక్రియలు వీటి ద్వారా జరుగుతాయి. అలాగే 'కాస్మిక్ రేస్' అనే అధిక శక్తి గల కణాల ప్రయాణం కూడా ఈ మార్గాల వల్ల ప్రభావితమవుతుంది. ఇవి గెలాక్సీలో కొత్త నక్షత్రాల ఏర్పాటుపై కూడా పరోక్షంగా ప్రభావం చూపవచ్చు. ఈ పరిశోధన వల్ల, ఎంతోకాలంగా నమ్ముతూ వస్తున్న కొన్ని సిద్ధాంతాలు మారే అవకాశం ఉంది.

# ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ఇంటింటికీ సిపిఐ

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రజా ప్రాధాన్యత ఉన్న సమస్యలను తెలుసుకునేందుకే ఏప్రిల్ 1వ తేదీనుండి పదో తేదీ వరకు కిఇంటింటి సిపిఐ కార్యక్రమాన్ని తీసుకున్నట్లు సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ సందేశాన్ని ప్రతి ఇంటికి నేరుగా అందివ్వనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడం ప్రభుత్వాలకు పరిష్కారాలు సూచించడం ప్రభుత్వ వైఫల్యాలు సిపిఐ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, దేవరం మల్లేశ్వరి, దొంతగాని సత్యనారాయణ, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, కందుల వెంకటేశ్వర్లు, చెనగాని సైదులు, జడ వెంకన్న, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు

### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** రైతు సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాంసి మండలంలోని కప్పర్ల, గొట్కూరి, పొన్నారి, హస్నాపూర్, ఈదుల సావర్గాం, బండల్ నాగపూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాంసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సాగవుతున్న పంటలకు ఎరువులు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని హెచ్చరించారు. సిపిఐ మిత్రపక్షమైనప్పటికీ, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కుంటాల రాములు, తాంసి మండల కార్యదర్శి అర్గంగి రమేష్, నాయకులు ఎస్.అరుణ్‌కుమార్, పెద్ది మధుసూదన్, జింక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ ధ్యేయం

### యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణి సంస్థ రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి రాజీలేని పోరాటం చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్ వెల్లడించారు. సేవ్ సింగరేణి జాతాలో భాగంగా శుక్రవారం మణుగూరులోని మైన్స్ మరియు డిపార్ట్‌మెంట్‌ల వద్ద జరిగిన గేట్ మీటింగ్‌ల ద్వారా కేంద్ర నాయకత్వం, సింగరేణిలోని వాస్తవ పరిస్థితులు, సింగరేణి సంస్థ పరిరక్షణకు ఎఐటియుసి చేస్తున్న పోరాటాలను కార్మికులకు వివరించారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం ఎక్కువ అయిందన్నారు. సంస్థ ఆర్థిక అభివృద్ధి, మనుగడ ప్రశ్నార్థకం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు, సింగరేణి ఎన్నికల్లో ఎఐటియుసి గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత యాజమాన్యంతో స్ట్రక్చర్ సమావేశాలలో అనేక సమస్యలపై ఒప్పందం చేయడం జరిగిందని, యాజమాన్యం అంగీకరించిదని కానీ వాటిని అమలు చేయకుండా అమలుకు సర్కులర్ ఇవ్వకుండా తాత్సార్యం చేస్తుందని, వెంటనే సర్కులర్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న గనులు కొంతకాలం వరకే ఉంటాయని కొత్త ప్రాజెక్టు రాకపోతే సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకమైన పరిస్థితి ఉందన్నారు. సింగరేణిలో టెండర్లలలో జరిగిన అవకతవకలపై అవినీతి కార్యక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ కొరకు ఎఐటియుసి రాజి లేని పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్మికులందరూ ఈ పోరాటంలో పాల్గొని సంస్థ రక్షణకు, కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం చైతన్యంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. సేవ్ సింగరేణి జాతాలో భాగంగా మార్చి 30న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం, వంటవార్పు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలను పిలిచి కార్మిక వర్గం అంతా ఒకటే తాటిపైకి వచ్చి ఐక్య పోరాటాల ద్వారా ఈ సింగరేణిని రక్షించుకుంటామని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. సమావేశాలలో ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు వైవి రావు, ముష్కి సమ్మయ్య, వీరభద్రరావు, ఎల్లయ్య గౌడ్, బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఎంవి రామనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ట్రెజరర్ పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, గోలి గంగాధర్‌రావు, బి సురేందర్ రావు, ఆడెపు రాజశేఖర్, సిపిఐ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, గడ్డం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మి కుమారి, ఫిట్ సెక్రటరీలు కుమారస్వామి, గుంపెన శ్రీనివాసరావు, సాయిప్రకాష్ చారి, ఈసం శ్రీనివాసరావు, బి.రవికుమార్, రత్నం, శివ, జానకి ప్రసాద్, దండు విజయ్, చొప్ప సుధాకర్, ఇమాముద్దీన్, నాగరాజు, శివ, టి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సేవ్ సింగరేణి పోరు జాతాకు ఘనస్వాగతం

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) సేవ్ సింగరేణి పోరు జాతా బస్సు యాత్ర శుక్రవారం మణుగూరుకు చేరుకొన్న సందర్భంగా కార్మిక శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. బొగ్గు గనుల వద్ద, జిఎం కార్యాలయం నందు, మీటింగ్ అనంతరం బైక్ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు పెద్దఎత్తున కొనసాగింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి బస్సు యాత్ర ఎఐటియుసి కార్యాలయానికి చేరుకుంది.

# విద్యార్థులకు మధ్యాహ్న భోజనంపై గరికపాటి వ్యాఖ్యలు సరికాదు

### తక్షణమే క్షమాపణలు చెప్పాలి
### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్



**ప్రజాపక్షం/వరంగల్ :** సాహితీవేత్త గరికపాటి నర్సింహారావు ఇటీవల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరంగా ఉన్నాయని, వాటిని వెంటనే వెనక్కి తీసుకొని, క్షమాపణలు చెప్పాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారి పిల్లలకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పెట్టడం ఎందుకని గరికపాటి ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. అన్ని దానాలకంటే అన్నదానమే మిన్న అని ప్రవచించే గరికపాటికి విద్యార్థుల మధ్యాహ్న భోజనంపై ఎందుకు ఇంత అసూయ అని ప్రశ్నించారు. ఇప్పటికీ పేదవారికి విద్య పూర్తిస్థాయిలో అందుబాటులో లేదని, పేదవారికి విద్య కోసం ప్రభుత్వం కొన్ని పథకాలు ప్రవేశపెట్టి అమలు జరుపుతుంటే వాటిలో ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్దడానికి సమర్థవంతంగా అమలు చేయడానికి విద్యావేత్తగా గరికపాటి సూచనలు ఇవ్వాలి, కానీ పేద విద్యార్థులకు విద్యను దూరంచేసే ఇలాంటి వ్యాఖ్యలు ఏమాత్రం సమంజసం కాదని విమర్శించారు. ఇప్పటికైనా తాను చేసిన వ్యాఖ్యలను గరికపాటి వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని, లేనిచో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# బడుగు, బలహీనవర్గాలకు ధర్మభిక్షం సేవలు మరువలేనివి




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** బడుగు, బలహీన వర్గాలకు బొమ్మగాని ధర్మభిక్షం చేసిన సేవలు మరువలేనివని ఎఐఎస్‌ఎఫ్ నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షులు తిప్పరి మహేష్, గీత పనివారల సంఘం రంగారెడ్డి జిల్లా నాయకులు కనకమామిడి శ్రీశైలంగౌడ్ అన్నారు. ధర్మభిక్షం వర్ధంతిని కొండాపూర్ డివిజన్ పరిధిలోని హఫీట్ పేట్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తిప్పరి మహేష్, కనకమామిడి శ్రీశైలంగౌడ్ హాజరై ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తిప్పరి మహేష్ మాట్లాడుతూ ధర్మభిక్షం అంటే నల్లగొండ జిల్లాకే వన్నె తెచ్చిన మహనీయుడన్నారు. ఆనాడు నిజం రాజుకు ఎదురు తిరిగి పోరాటాలు చేశాడన్నారు. పేద విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్ళను నిర్మించారన్నారు. అనాటి ప్రభుత్వం హాస్టళ్ళను ఏర్పాటు చేయడానికి ముందుకు రాకపోవడంతో తన సొంత డబ్బులతో హాస్టళ్ళను నిర్మించి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు చదువుకునే వసతిని కల్పించిన మహనీయవక్తి ధర్మభిక్షం అని కొనియాడారు. నల్లగొండ ఎంపిగా మూడు సార్లు, ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఏంతో కృషి చేశారని తిప్పరి మహేష్ తెలిపారు. కార్యక్రమంలో నగేశప్ప, కిష్టప్ప, భిక్షపతి గౌడ్, ఎఐటియుసి నాయకులు పరమేష్, మల్లయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఒఆర్‌ఆర్ రోడ్డుకు సమాన దూరంలో ట్రిబుల్ ఆర్ రోడ్డు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ట్రిబుల్ ఆర్ రీజనల్ రింగ్ రోడ్డును ఒఆర్‌ఆర్ రోడ్డుకు సమాన దూరంలో చేపట్టాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విలేకరులతో మాట్లాడుతూ ఒఆర్ ఆర్ రోడ్డు నుండి ట్రిబుల్ ఆర్ రోడ్డును 60 కిలోమీటర్ల దూరం నుండి చేపట్టినట్లయితే అక్కడ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. అలా కాకుండా ఒక దగ్గర 28 కిలోమీటర్లు మరో దగ్గర 50 కిలోమీటర్ల దూరంలో తీసుకపోవడం వల్ల ఆ ప్రాంత రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా ఎక్కడ నుండి తీసుకున్న రోడ్డు విస్తీర్ణంలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటుకు మూడు రెట్లు నష్టపరిహారం ఇవ్వాలని లేనియెడల భూమికి భూమి ఇవ్వాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి, బచ్చనగోని గాలయ్య, తీర్పారీ వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, బత్తుల సుధాకర్, టంగుటూరి రాములు, రోషగారి అంజయ్య, దాసరి అంజయ్య, కృష్ణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరాముడు న్యాయధర్మాల పరిరక్షకుడు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగరంలోని సద్దలగుండులో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీరాముడు న్యాయం, ధర్మం కోసం జీవించిన మహానుభావుడని పేర్కొన్నారు. లోక క్షేమం కోసం దుష్టసంహారం చేసి, సత్యధర్మాలను స్థాపించిన ఆదర్శ నాయకుడిగా నిలిచారని కొనియాడారు. ప్రతి వ్యక్తి శ్రీరాముడి సద్గుణాలను తమ జీవితాల్లో అలవరుచుకుంటే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, 57వ డివిజన్ కార్పొరేటర్ ఎం.ప్రవీణ్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ స్వప్న, లక్ష్మణ్ యాదవ్, సాయిలు యాదవ్, భాను, సతీష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలి

ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం భాగంగా డ్రైవర్లు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్ట విరుద్ధమని, అలాంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ ఆటో యూనియన్ అధ్యక్షుడు గువ్వలపల్లి కొండన్న, వివిధ డ్రైవర్లు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల బిఆర్ఆర్ కళాశాలలో సీత అశోక చెట్ల పంపిణీ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని డా.బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీత అశోక చెట్లను పంపిణీ చేశారు. శుక్రవారం నాడు జడ్చర్ల డాక్టర్ బి.ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ బొటానికల్ గార్డెన్ నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, చెన్నై వారి సహాయ సహకారాలతో పెంచిన సీతా అశోక చెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గార్డెన్ సమన్వయకర్త డా.బి.సదాశివయ్య మాట్లాడుతూ సీతా అశోక చెట్ల శాస్త్రీయ నామం సరాక అశోక అని దీని లోని ప్రతి భాగమూ ఆయుర్వేద వైద్యవిధానంలో అశేషంగా వినియోగింపడ్డాయాని తెలియజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా జడ్చర్ల పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని సీతా రామాంజనేయ దేవాలయంలో ఈ చెట్లను పంపిణీ చేశామని, ఈ చెట్లను భక్తులు ఆసక్తికరంగా తీసుకెళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా॥ సదాశివయ్యతో పాటు వాలంటీర్లు భరత్, రవీందర్, అనూష, ఆలయ కమిటీ సభ్యులు సునీల్, ప్రహ్లాద్, సాంగ్ దేవ్, ఆనంద్ రెడ్డి, రవితేజ, రాఘరామ్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఎస్ఐ నరేష్

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వాహనదారులు రహదారి నిబంధనలను కచ్చితంగా పాటించాలని వీపనగండ్ల ఎస్సై నరేష్ సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన రహదారులు, ప్రజలు, గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇన్సూరెన్సు, పోల్యూషన్ సర్టిఫికెట్ వంటి ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తమ భద్రత కోసం అత్యంత అవసరమని తెలిపారు. అదే విధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తామని హెచ్చరించారు. నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సర్పంచు మీసాల పార్వతమ్మ, ఎఎస్ఐ వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వేడి గంజిలో పడి మూడేళ్ళ బాలిక మృతి

**ప్రజాపక్షం/కృష్ణ :** వేడి గంజి పాత్రలో పడి మూడేళ్ల బాలిక మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. కృష్ణ మండల ఎస్సై నవీద్ తెలిపిన వివరాల ప్రకారం నారాయణపేట జిల్లా కృష్ణ మండలం, గూడెబల్లూరు గ్రామానికి చెందిన బొల్ల సుధాబాయి (25), భర్త నర్సింహులు, వ్యవసాయదారులు, కుటుంబంలో ఇద్దరు కుమారులు , ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో, జాతర సందర్భంగా ఇంటిలో వంట పనులు జరుగుతున్న సమయంలో, పొయ్యి మీద వండిన రైస్ గంజి గిన్నెను పక్కన ఉంచిన సమయంలో ఆమె చిన్న కుమార్తె బొల్ల నందిని (3) ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు వేడి గంజిలో పడటంతో తీవ్ర గాయలైన బాలికను వెంటనే రాయచూరు పిహెచ్ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం రాయచూర్ ఆర్ఐఎంఎస్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11:14 గంటలకు బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిందిగా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎటువంటి అనుమానాస్పద పరిస్థితులు లేవని తెలిపారు. ఎస్సై నవీద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సామాజిక నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాతృమూర్తి ఎనుముల రామచంద్రమ్మ జ్ఞాపకార్థంతో రామ్‌కి స్వచ్ఛంద సేవ ఆధ్వర్యంలో నీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణా రెడ్డి, రామ్‌కి చైర్మన్ రామ్ రెడ్డి, సర్పంచ్ మల్లెపాకుల వెంకటయ్య, ఉప సర్పంచ్ వేమారెడ్డి, లాలు యాదవ్, శేఖర్ పర్వతాలు, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీల వ్యవస్థ రద్దు చేయాలి

కార్పొరేషన్ ద్వారా వేతనాల చెల్లింపుల కోసం
29న చలో హైదరాబాద్
గోపాల్ నాయక్
తెలంగాణ మెడికల్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) బ్రాంచ్ అధ్యక్షుడు




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలో ఏజెన్సీల విధానం రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే కార్పొరేషన్ ద్వారా వేతనాలు అందించి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ మెడికల్ అవుట్ తోటి ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) బ్రాంచ్ అధ్యక్షుడు గోపాల్ నాయక్ డిమాండు చేశారు. కార్పొరేషన్ ద్వారా వేతనాల చెల్లింపుకై ఈనెల 29న జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమ విజయవంతానికి శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ మాట్లాడుతూ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల చెల్లింపులకై అమలవుతున్న ఏజెన్సీల వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని ఏజెన్సీల విధానంతో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శ్రమ దోపిడికి గురవడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు గండిపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేషన్ ద్వారా వేతనాలు అందిస్తున్నారని కార్పొరేషన్ వ్యవస్థ ద్వారా కొంతవరకైనా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా మాదిరిగా ఒకటో తారీకున వేతనాలు అందించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఇరవై తొమ్మిదిన జరుగు ఛలో హైదరాబాద్‌కి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నాయకులు బుచ్చన్న, ఖాదర్ మొహిద్దీన్, భూపతి రాజు, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## బెక్కెం గ్రామం నెల బిల్క్‌లో సీతారాముల కల్యాణోత్సవం

గ్రామ సర్పంచు బొందిలి కమలాభాయ్ కమల్ సింగ్
పట్టు వస్త్రాలు సమర్పించిన బొందిల ధారాసింగ దంపతులు



**ప్రజాపక్షం/చిన్నంబావి :** వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని బెక్కెం గ్రామం (నేల బిల్కులో) చారిత్రాత్మక పుణ్యక్షేత్రం అని పిలువబే శ్రీరాముల వారి టెంపుల్‌లో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. లోక కల్యాణం కోసం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో బెక్కెం గ్రామ సర్పంచ్ బొందిలి కమల భాయ్ కమల్ సింగ్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు బొందిలి ధారాసింగ్ దంపతులు పాల్గొన్నారు.

గ్రామ సర్పంచ్ బొందిలి కమల భాయ్, కమల్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహోత్తరమైన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దంపతులతో పాటు బిజెపి రాష్ట్ర నాయకులు ధారాసింగ్ దంపతులు ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం బొందిలి ధారాసింగ్ స్వామి వారికి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య అర్చకులు సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి గ్రామంలోని ప్రజలు, వారి బంధుమిత్రులు భక్తులు భారీగా తరలివచ్చారు. జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొందిలి కమల బాయ్ కమల్ సింగ్ దంపతులు, శశిధర్, వెంకట్ రామిరెడ్డి, రాము వార్డు మెంబర్, బత్తిని కృష్ణా రెడ్డి, సందు కృష్ణ రెడ్డి, నారాయణ,భాస్కర్ రెడ్డి కృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, బల్ రెడ్డి, కాంతయ్య, స్వామి, భాస్కర్, నవీన్ సింగ్, హరి కాంత్, వారి కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** శ్రీరామ నవమి సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్ని గ్రామాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా, కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణం సంప్రదాచబద్ధంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమాన్ని దర్శించేందుకు ఆయా గ్రామాల ప్రజలు, పరిసర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధరూర్ మండలం బూరెడ్డి పల్లి గ్రామంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి దంపతులు, ఎమ్మెల్యే తనయుడు యువ నాయకుడు సాయి సాకేత్ రెడ్డి దంపతులు, జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ వార్డుల్లో బీజేపీ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి, వివిధ పార్టీల నాయకులు స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు.



## జడ్చర్లలో ఘనంగా సీతారామ కళ్యాణ మహోత్సవం

పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నాడు జడ్చర్ల పట్టణంలోని ఆయా ప్రాంతాలలో గల దేవాలయాల్లో నిర్వహించిన కళ్యాణోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి డా.చర్లకోళ్ళ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా జడ్చర్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పలు వార్డులల్లోని పలు దేవాలయాలల్లో స్థానిక వార్డుల ప్రజలు ఏర్పాటు చేసిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొని, పట్టణ ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ శ్రీ సీతారాముల వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దోరేపల్లి లక్ష్మీ రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్స్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారాముల స్వామి అమ్మవార్ల ను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు , కౌన్సిలర్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పంచదేవ్ పహాడ్‌లో..

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో పంచదేవ్ పహాడ్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ గ్రామంలో ప్రతి ఒక్కరు ఆడ, మగ అని తేడా లేకుండా స్వామివారిని పల్లకిలో కూర్చోబెట్టుకుని ఊరంతా భజన కీర్తనలు, కాషాయం కండువులతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ యువకులు, ఆడపడుచు తలంకారాలు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర శ్రీరామనవమిని పురస్కరించుకుని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీరామనవమి వేడుకలలో సీతారాముల కళ్యాణం అనంతరం వచ్చిన భక్తులకు మధ్యాహ్నం వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పెరుగు దాతలు మనసాని దేవి పద్మావతి సురేష్, కల్వ శ్రీలత శ్రీనివాస్ అలాగే గ్లాసుల దాత చిగుళ్ల పల్లి రత్నమాల అశోక్ కుమార్ సహకారంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా వచ్చిన భక్తులకు ఎండాకాలం దృష్టిలో ఉంచుకుని చేపట్టడం జరిగిందని ఈ అవకాశాన్ని కల్పించిన ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త ప్రానేష్ కుమార్‌కి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చిన భక్తులు ఎండాకాలంలో ఇలాంటి మజ్జిగ సదుపాయాన్ని కల్పించిన వాసవి క్లబ్, వనిత క్లబ్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ మాజీ డిప్యూటీ గవర్నర్లు కట్ట సురేష్, కల్వ శ్రీనివాస్, బిలకంటి నరసయ్య, వాసవి క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి హరికృష్ణ, కోశాధికారి తాళంపల్లి పవన్, వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వాల ప్రసన్న, కోశాధికారి తాలంపల్లి కావ్య, తాలంపల్లి మారుతి, తాళంపల్లి వాణి, ఆగ్లర్ రేఖ, పాలుట్ల సుష్మ, కొండ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సీతారాముల కల్యాణం

**ప్రజాపక్షం/ఉట్కూరు :** ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని శ్రీ సీతా రామాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, దోరోళ్ల కృష్ణయ్య, దాసరి రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి విగ్రహాలకకు పంచామృతాభిషేకం, ప్రత్యేక హోమం, శ్రీ సీతారామ కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను రథంపై అలంకరించి రథోత్సవాన్ని ఘనంగా జరిపారు. విజేతలకు శ్రీ ఆదిత్య పరాశ్రీ, గవినోళ్ళ హన్మి రెడ్డి, జి.భీమ్ రెడ్డి, దాసరి తులసిదాస్, నాగేష్ గౌడ్, పి. నర్సింహా రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లంపల్లి అంజయ్య, పూజారులు నర్సింహాచారి, నాగరాజు చారి, వేణుగోపాల్ చారి, గ్రామ పెద్దలు చాకలి వెంకటప్ప, అశోక్ గౌడ్, కొండారెడ్డి నర్సింహా రెడ్డి, భూపాల్ రెడ్డి, నేడుగం రాఘవేంద్ర, హెచ్. నర్సింహా, వెంకప్ప గౌడ్, ఉప్పు ఆంజనేయులు, భాస్కర్ రెడ్డి, రమేష్ , దత్తప్ప, రాజమూరి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు ఎస్పీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** శ్రీరామనవమి సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం ఉదయం పల్లా హనుమాన్ దేవాలయం దగ్గర హిందూ మత పెద్దలు, యువకులతో కలిసి శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రజలంతా తమ పండుగలను శాంతియుతంగా జరపుకోవాలని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు శివశంకర్, నాగార్జున ఎస్సై వెంకటేశ్వర్లు, డిహెచ్ పి నాయకులు, బజరంగ్దళ్ యువత, కాంగ్రెస్, బిజెపి , బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎంపిపిపై దాడి

**ప్రజాపక్షం/కృష్ణ :** అధికార గర్వమో, అహంకారమో తెలియదు కానీ.. గ్రామంలో అభివృద్ధిని కాంక్షించి సూచన చేసిన ఒక మాజీ ఎంపిపిపై గ్రామ సర్పంచ్ కుమారుడు, ఆయన సోదరుడు రాక్షసంగా విరుచుకుపడ్డారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం చేగుంట గ్రామానికి చెందిన దళిత నేత, మాజీ ఎంపిపి లింగప్పపై సంజీవరెడ్డి గౌడ, బసవరాజప్ప గౌడలు ప్రాణాపాయ దాడికి పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగప్ప ఇంటి ముందు ఐమాక్స్ లైట్లు ఏర్పాటు కోసం గుంతలు తీస్తున్న సమయంలో, రాకపోకలకు ఇబ్బంది కలగకుండా కొంచెం దూరంలో ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కనీస విచక్షణ లేకుండా ఆగ్రహానికి లోనైన నిందుతులు.. "మాకే ఎదురు చెబుతావా?" అంటూ లింగప్పను కులం పేరుతో దోషిస్తూ రాళ్లతో తల పగులగొట్టారు. అడ్డువచ్చిన ఆయన భార్య శాంతమ్మను కాళ్లతో తన్ని, కుమారుడు మోహన్ కుమార్ ను రక్తగాయాలయ్యేలా చితకబాదారు. తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కాపాడుకోవడానికి లింగప్ప కారులో ఆసుపత్రికి బయలుదేరగా, నిందితులు మరింతగా రెచ్చిపోయారు. బైక్‌లపై కారును వెంబడించి, రాళ్లతో కారు అద్దాలు పగులగొట్టి ఎలాగైనా లింగప్పను హతమార్చాలనే ఉద్దేశంతో దాడి కొనసాగించారు. ఒక దళితుడు ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తామనే సంక్షేతాన్ని ఇవ్వడానికి ఈ దాడికి పాల్పడ్డారని బాధితులు ఆవేదన వ్యక్తం చెస్తున్నారు. ఘటనను దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డి. చంద్రశేఖర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, దళిత నాయకులు జీర్గల నాగేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీసుకు తాళం వేసి నిరసన

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామంలో ఉన్న పోస్టు కార్యాలయాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ఇటీవలే ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం ఆ కార్యాలయానికి గ్రామ సర్పంచ్ దన్‌సింగ్‌నాయక్, గ్రామస్తులులతో కలిసి తాళం వేయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దన్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ వృద్ధులకు ఆసరా ఫించన్లతో పాటు అత్యవసరమైన సేవలను అందించే పోస్టు కార్యాలయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మూసి వేయనివ్వమని, ఆ నిర్ణయాని వెనక్కి తీసుకోవాలన్నారు.చెదురుపల్లి ఉమ్మడి గ్రామపంచాయతీలో 4 వేలకు పైగా జనాభ కల్గి ఉందని వనపర్తి పోస్టల్ ఎస్పీ భూమన్నకు గత వారం వినతి పత్రం అందజేశామని, భూమన్న డబ్బులు తీసుకొని కేవలం 40 ఇండ్లు ఉన్నా కమల్‌పూర్‌తండాకు తరలించాలని చూస్తున్నాడని పేర్కొన్నారు. దీనికి నిరసనగా పోస్టాఫీస్‌కు గ్రామస్తులతో కలిసి తాళం వేయించానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సహదేవ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## కిటకిటలాడిన రామాలయాలు

**ఊరువాడలో మారుమోగిన శ్రీరామనవమి వేడుకలు**

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని వనపర్తి, పాటు ఊరు వాడ పల్లె పట్టణాలలో ఎక్కడ చూసినా శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగా వైభవంగా కన్నుల పండుగ జరుపుకున్నారు. వనపర్తి జిల్లా సమీపంలోని నాగవరం గ్రామంలో ఆ గ్రామానికి చెందిన జి ఆర్ ఫౌండేషన్ అధినేత జి.రఘు 11వ వార్డు కౌన్సిలర్ జి.స్వాతి హరిబాబు, ఆధ్వర్యంలో శివ రామాలయం దేవాలయంలో సీతారాములు కళ్యాణం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టారు ముఖ్యంగా ప్రతి సంవత్సరం జిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిఆర్ ఫౌండేషన్ అధినేత జి రఘు జి.హరిబాబు తెలిపారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల వారి కళ్యాణోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. గోవర్ధనగిరి, కల్వరాల, రంగవరం, వల్లభాపురం, తూముకుంట, వీపనగండ్ల తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గురువారం ఆయా గ్రామాల ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, సంప్రదాయబద్ధంగా ఎదుర్కోల్లు కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## కనుల పండువగా కల్యాణోత్సవం


**ప్రజాపక్షం/వంగూర్ :** మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని తిప్పారెడ్డి పల్లి, నిజాంబాద్, ఉప్పల్ పాడు, డిండి చింతపల్లి, పోల్కంపల్లి, కొండారెడ్డి పల్లి, పోతారెడ్డి పల్లి, ఉల్పర, జాజాల, రంగాపూర్ గ్రామాలలో శ్రీ సీతారామ చంద్రస్వామి కల్యాణోత్సవం ఆలయాల్లో భక్తులు కనుల పండుగ నిర్వహించారు. తెల్లవారుజాము నుండి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ విద్యుత్ దీపాలు అలంకరణలతో కళ్యాణమంటపాలను ఏర్పాటు చేస్తూ భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలు ... రహదారులన్ని నిర్మానిష్యం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** అసలే ఎండాకాలం రోజు రోజుకు ఎండలు ఎక్కువ కావడంతో మండల ప్రజలు ఎండా వేడి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఉదయం 8 నుండి సూర్యుడు తన వేడి ప్రభావాన్ని చూపుతూ 9,10 గంటల సమాయానికి ఎండ తీవ్రత 39 డిగ్రీలకు చేరుతుండడంతో ప్రజలు రోడ్ల పై రావడానికి జంకుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారినాయి. మండల ప్రధాన అర్థదారులన్నీ సీసీ రోడ్లుగా మారడంతో ఎండా రోడ్ల పై పడి ప్రతిబింబించడంతో వేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. మండల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రావాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల ప్రభుత్వ అధికారులు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేసేత ఎండలో వచ్చే ప్రజలకు తాగునీటి వసతులు కల్పించిన వారవుతారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలోఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి మంజూరైన సీసీ రోడ్డు గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మవెంకటయ్యగౌడ్, వార్డు సభ్యులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ శిశుపాల్ రెడ్డి,ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు పిల్లి దేవేందర్, జంగిలి సునీత ఆనంద్, పాలాది మల్లీశ్వరి రంగనాథం, ముదికొండ కవిత రమేష్, వాణి పురుషోత్తం చారి, గుద్దటి కిష్టాలు, గోసుల కొండయ్య, మసిగుండ్ల వెంకటేష్, మారెపల్లి మంజులశ్రీను,సిరుసనగండ్ల శేఖర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ రషీద్, మాసుల బాలరాజు, పుట్ట యాదయ్య, అన్నెపు వెంకటయ్య, రాజు, తుంగ శ్రీను, మట్ట నాగర్జున, అన్నపు ప్రశాంత్, శివ, రమేష్‌లతో తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక ఐక్యతకు వేడుకలు సంకేతం

శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**ప్రజాపక్షం/మునుగోడు:** శ్రీరామనవమి సందర్భంగా మునుగోడు మండల కేంద్రం తోపాటు చీకటిమామిడి గ్రామాల్లో నిర్వహించిన శ్రీ సీతా రాముల కల్యాణ మహోత్సవం భక్తి,సామాజిక ఐక్యతకు వేదికగా నిలిచింది. ఈవేడుకల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,డిసిసి అధ్యక్షలు పున్న కైలాష్ నేతలు వేరు,వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు సేవలు అందించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముడు తండ్రి మాట కోసం రాజ్యాన్ని త్యజించిన మహానీయుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఆయన జీవితం నైతిక విలువలు,కర్తవ్య నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పరి వెంకటేశ్వర్లు,జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి,నాయకులు ఈదులకంటి కైలాస్,కట్కూరి లింగస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి,వేదిరి విజేందర్రెడ్డి పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి సందేశంతో..

నేడు బుద్ధవనానికి 22 దేశాల బౌద్ధ ప్రతినిధుల రాక


ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య




**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ టూరిజం అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన బుద్ధవనం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రపంచ శాంతి సందేశాన్ని వ్యాప్తి చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన అంతర్జాతీయ బౌద్ధ సదస్సు నేపథ్యంలో, 22 దేశాలకు చెందిన బౌద్ధ ప్రతినిధులు నేడు బుద్ధవనాన్ని సందర్శించనున్నట్లు ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య తెలిపారు.హైదరాబాద్‌లో శుక్రవారం తెలంగాణ టూరిజం,వియత్నాం బౌద్ధ సంఘం సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ శాంతిపై అంతర్జాతీయ బౌద్ధ సదస్సు 2026లో ఈ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.ఉదయం 10 గంటలకు బుద్ధవనానికి చేరుకునే ప్రతినిధుల బృందం, బుద్ధ చరితవనంలోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించనుంది. అనంతరం బుద్ధవనం సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.తదుపరి మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో ధ్యాన కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం తెలంగాణ టూరిజం లాంచ్ ద్వారా నాగార్జునకొండను సందర్శించనున్నారు.ఈ బృందంలో శ్రీలంక బుద్ధ శాసన, బౌద్ధ మత సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి హిణిదుమ సునీల్ సెనేవి, వియత్నాం బౌద్ధ సంఘం ఉపాధ్యక్షులు తిచ్ నహత్ తు, శ్రీలంక ప్రముఖ పీఠాధిపతి అగ్గరహేరా కసప మహా తేరో, సౌత్ కొరియా గ్లోబల్ పీస్ అంబాసిడర్ మున్ యోంగ్ జో తదితరులు పాల్గొననున్నారు.

## మేధావి వర్గం కాంగ్రెస్ వైపే

సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూకల గెలుపు పట్ల హర్షం



**ప్రజాపక్షం/సూర్యాపేట** : మేధావి వర్గం కాంగ్రెస్ వైపే ఉందన్నది సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికలతో స్పష్టమైందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్‌సెల్ చైర్మన్ నూకల సుదర్శన్ రెడ్డితోపాటు ప్యానల్‌లో సభ్యులు అత్యధికంగా కాంగ్రెస్ సానుభూతిపరులు గెలువడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనకు ఇది నిదర్శనమన్నారు. ఏ ఎన్నిక జరిగినా ప్రజలు, మేధావులు కాంగ్రెస్ బలపర్చిన వారికే పట్టం కడుతున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం సూర్యాపేట పట్టణంలో విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. నూతనంగా గెలిచిన అధ్యక్షుడితోపాటు గెలుపొందిన మిగతా వారికి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాల అనంతరం గెలుపొందిన వారితో కలిసి ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయోత్సవంలో స్టెప్పులేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఉల్లాసంగా డ్యాన్స్ చేస్తూ హుషారుగా గడపడంతో చూపరులను ఆకట్టుకుంది. తమ యువ నాయకుడు అందరితో మమేకమై విజయాన్ని తన స్టెప్పులతో ఆస్వాదించడం పట్ల హర్షించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్వోత్తమ్ రెడ్డి నూతన ఒరవడి తీసుకురావడం అందరిని ఆకర్షిస్తుంది.

## గిరిజనుల సంక్షేమానికి కృషి

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని రూ. 20లక్షలతో చేపడుతున్న బంజారా భవన్ ప్రహారి గోడ నిర్మాణానికి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సి, ఎస్టి, బిసి ల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలతో బడ్జెట్‌లో బడ్జెట్ కేటాయించిందని అన్నారు. రాజీవ్ యువ వికాసానికి బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 6వేల కోట్లు కేటాయించిందని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తొన్నానని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, మాజీ పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎంఏ సిరాజ్‌ఖాన్, వడ్త్య దేవేందర్‌నాయక్, మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్ రెడ్డి, బంజారా సంఘం అధ్యక్షుడు లాలునాయక్, కార్యదర్శి ఇస్లావత్ సురేష్‌నాయక్, బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు.



# రెండవ భద్రాద్రి స్థాయికి రామగిరి రామాలయం అభివృద్ధి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వచ్చే వైకుంఠ ఏకాదశికి ఉత్తర ద్వార దర్శన గోపురం

శ్రీరామనవమి సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ

కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలు అందజేసిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి దంపతులు



**ప్రజాపక్షం/నల్లగొండ :** పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని రెండవ భద్రాద్రి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.వచ్చే వైకుంఠ ఏకాదశి నాటికి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం గోపురాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రామగిరి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రలు సమర్పించారు. ఈ సందర్భంగా నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు తమ నివాసం నుంచి భజంత్రీల నడుమ ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు.వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించగా, ఈ వేడుక భక్తులకు కన్నుల పండుగగా నిలిచింది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామగిరి దేవాలయానికి ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. రెండవ భద్రాద్రి పేరు సార్థకం అయ్యేలా దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, వైకుంఠ దర్శనం, ఉత్తర ద్వారా దర్శనం వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దర్శన మార్గాల విస్తరణ కోసం అవసరమైన స్థల సేకరణపై



చర్చలు జరుగుతున్నాయని, నెల రోజుల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.అలాగే, దేవాలయ భూములకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నేషనల్ హైవే మార్గాన్ని బైపాస్ ద్వారా మళ్లించినట్లు పేర్కొన్నారు. ప్రజలు శ్రీరాముని కృపతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి సహకారంతో రామగిరి రామాలయాన్ని మరింత అభివృద్ధి చేసి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కళ్యాణోత్సవం అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన సొంత ఖర్చులతో 4 వేల మందికి అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,జడ్‌పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,ధర్మకర్తలు, ఆలయ ఇఒ జయరామయ్య, స్థానిక కార్పొరేటర్ యామ కవితా దయాకర్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి పాల్గొన్నారు.

**పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తన క్యాంపు కార్యాలయవద్ద జిల్లా కేంద్రంలోని రామగిరి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవానికి ఆయన జిల్లా యంత్రాంగం తరపున పూజాది కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి పట్టు వస్త్రలు,తలంబ్రాలు సమర్పించారు. జిల్లా మరింత అభివృద్ధి సాధించి జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా సీతా రామ చంద్ర స్వామి ఆశీర్వదించాలని కలెక్టర్ ప్రార్థించారు.





## నూకల సుదర్శన్‌రెడ్డిని సత్కరించిన పటేల్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ నూకల సుదర్శన్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఘనంగా సత్కరించారు. శుక్రవారం సుదర్శన్ రెడ్డి పటేల్ రమేష్ రెడ్డి నివాసానికి వెళ్ళి మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సుదర్శన్ రెడ్డి ఎన్నిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పోలెబోయిన నర్సయ్య యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కేసు నమోదు




**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల పరిధిలోని ధర్మారం బిక్కేరు వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నటువంటి అడ్డగూడూరు గ్రామానికి చెందిన తూప్పతి కృష్ణమూర్తి తండ్రి మల్లయ్య, వయస్సు 48 సంవత్సరాలు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్‌లో లైన్మెన్‌గా పనిచేస్తూ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డగూడూరు ఎస్ఐ వెంకటరెడ్డి అదుపులోకి తీసుకోని అతనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రస్తుతం నిందితుడు ఆత్మకూరు మండలం ఖపురాయిపల్లి సబ్‌స్టేషన్‌లో లైన్మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

# కల్యాణం... కమనీయం...

అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** శ్రీ సీతారాముల వారి కళ్యాణం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా కన్నుల పండుగగా, కమనీయంగా, అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగింది. అభిజిత్ లగ్నంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య శ్రీసీతారాముల శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచి, పట్టువస్త్రాలు, తలంబ్రాలతో జరిగిన ఈ దివ్య వివాహం కన్నుల పండుగగా సాగింది. స్వామివారు సీతమ్మ తల్లికి మంగళసూత్ర ధారణ చేయడం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి రెండు రోజుల ముందు నుంచే ఆయా ప్రాంతాలలో భక్తులు కళ్యాణ మండపాలను ఏర్పాటు చేసి పెద్దఎత్తున ప్రచారాన్ని నిర్వహించారు. మండపాలను చూడచక్కగా పూలు, పచ్చటి తోరణాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీతారాముల కళ్యాణం చూతం రారండి... కళ్యాణం కమనీయం అనే భక్తి గీతాలు పల్లె నుండి పట్టణాల వరకు గల్లీ గల్లీన మారుమ్రోగాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ షఫీ ఉల్లాతోపాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకలకు గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు హాజరై వివాహ మహోత్సవాన్ని తిలకించారు. శ్రీసీతారాముల కళ్యాణ విశిష్ఠత, ఆదర్శ దాంపత్య





జీవితం, పితృవాఖ్య పరిపాలన, సోదర సంబంధాలు, హనుమంతుడి భక్తి గురించి భక్తులకు వేదపండితులు వివరించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో జరిగిన శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరయ్యారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాలలో జరిగిన వేడుకలకు పలువురు కాంగ్రెస్ ప్రముఖులు హాజరై స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు.

# మోడల్ మున్సిపాలిటీగా ఆలేరును మారుస్తాం

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పాలకవర్గం సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో అండర్ డ్రైనేజీ వ్యవస్థ సీసీ రోడ్లుతాగునీరు అందరికి అందేలా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేపించి ఆలేరు మున్సిపాలిటీ మిగతా మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఆలేరు మున్సిపల్‌ను ఆదాయ వనరులగానే చూసిందని ఆలేరు మున్సిపాలిటీని అభివృద్ధికి నోచుకోనివ్వలేదని అన్నారు. ఈ సందర్భంగా 2026/27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రత్యేక సమావేశ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ వంటి ప్రాథమిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు ఎక్కడైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మన పట్టణ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం మన బాధ్యత అని ఆయన అన్నారు. ప్రతి వార్డులో ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మంచి జీవన ప్రమాణాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పన్నులు , ఇతర ఆదాయ వనరులను పెంచి మున్సిపాలిటీ ఆర్థిక స్థితిని బలపరచాలని సూచించారు. అలాగే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వార్డు స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, కౌన్సిలర్‌లు పాకాల మౌనిక, వానరసి మరియమ్మ, యాట శివ, బీజాని కళ్యాణి, పాశికంటి సంపత్, బోట్ల సంపత్,పస్తం ఆంజనేయులు, మల్లెల సరిత, జుకంటి సంపత్, జెట్టా నీరజ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రియాన్స్ కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించిన భువనగిరి ఎంపి చామల

తక్షణ చర్యలకు కలెక్టర్, మున్సిపల్ అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి తారకరామ నగర్‌లో నాలుగేళ్ల బాలుడు ప్రియాన్స్ వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఘటనపై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే ఆయన భువనగిరి జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాలుడి తండ్రి రాహుల్‌తో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పిన ఎంపీ, ప్రియాన్స్‌కు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బాలుడి చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎంపీ, హైదరాబాద్ చేరుకోగానే స్వయంగా ప్రియాన్స్‌ను పరామర్శించి, ఆ కుటుంబానికి వ్యక్తిగతంగా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వీధికుక్కల దాడిలో గాయపడిన బాలుడికి ప్రస్తుతం యశోద, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. యానిమల్ బర్త్ కంట్రోల్ చట్టం ద్వారా వీధికుక్కల సంతతిని నియంత్రించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. తమ ప్రాంతాల్లో వీధికుక్కల సంచారం ఎక్కువగా ఉంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. భువనగిరిలో ప్రియాన్స్‌పై జరిగిన దాడి తనను ఎంతగానో కలచివేసిందని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు.

## సమృద్ధిగా గ్యాస్, పెట్రోల్, డీజిల్

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు- ఎమ్మెల్యే, డీఎస్పీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజలకు సరిపడా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాసనసభ్యులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంక్‌లను రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్, పెట్రోల్ బంక్ యాజమాన్యులను స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో ఎలాంటి అంతరాయం కలుగకుండా చూడాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద నిరంతరం నిల్వలు ఉండే విధంగా చూడాలని, కృత్రిమ కొరత సృష్టించి నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ నిత్యావసర సరుకుల కొరత సృష్టిస్తే సహించేది లేదని అన్నారు. ముఖ్యంగా ప్రజలు వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సరిపడా గ్యాస్, పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. వారి వెంట మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.




## 45 ఏళ్లుగా భక్తిభావం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని ప్రకాశం బజార్‌లో గత 45 సంవత్సరాలుగా నిరంతరంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా



భక్తుల భారీ స్పందనతో వేడుకలు ఘనంగా జరిగాయి. కల్యాణం అనంతరం సుమారు రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,డిఎస్‌పి శివ రాం రెడ్డి,సీఐ రాజశేఖర్ రెడ్డి,రాఘవరావు,ఎస్ఐ సైదులు,కమిటీ సభ్యులు జగిని వెంకన్న,మధు,శ్రీను,చంటి,మల్లేష్ పాల్గొన్నారు.

## పర్యావరణ విద్య- అవగాహన కార్యక్రమం


**ప్రజాపక్షం/రామన్నపేట :** భారత ప్రభుత్వ అటవీ, పర్యావరణ , వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సహకారంతో నిర్వహిస్తున్న ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపకులు 52 మంది విద్యార్థులతో కలిసి సూర్యాపేట జిల్లా చివ్వెంల సమీపంలో ఉన్న ప్రముఖ పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణ సృష్టించిన అడవిని సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ ఏమాత్రం స్వార్థం లేకుండా తనకున్న 70 ఎకరాల భూమిని అడవిగా చేసిన మహనీయుడు దుశ్చర్ల సత్యనారాయణ అని, ప్రకృతి పట్ల వారికున్న ప్రేమను ఈ అడవి తెలియజేస్తుందని అన్నారు. తదనంతరం సూర్యాపేట మున్సిపాలిటీ కమిటీ హాల్లో మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులు శిక్షణ పొందారు. పర్యావరణ నిపుణుడు సాయి ప్రసాద్ తడిచెత్త, పొడిచెత్త వేరు చేయు విధానం , వాటి ద్వారా ఉపయోగకరమైన వర్మి కంపోస్ట్, ఇటుకలు తయారుచేసే విధానాన్ని ప్రదర్శించి విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన్నబాబు, అధ్యాపకులు డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ జి.సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ పి.బ్రహ్మం, డాక్టర్ ఎం.రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, టి.శ్రీనివాస్, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



> చిరంజీవి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేతుల మీదుగా రూ. పదిలక్షల నగదు బహుమతితో పాటు ఎన్‌టిఆర్ అవార్డును అందుకున్న చిరంజీవి, ఆ మొత్తాన్ని తన చిరకాల సామాజిక సంక్షేమ లక్ష్యానికి అనుగుణంగా ఉన్న ఐదు స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చారు.

రీల్

## జూలై 3న వస్తున్న 'నాగబంధం'



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియన్ మైథలాజికల్ ఎపిక్ చిత్రం 'నాగబంధం'. నెక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూలై 3న విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. ఈ మేరకు విడుదల తేదీ పోస్టరును జూగారా రిలీజ్ చేశారు. ఈ పోస్టర్లో రెండు రకాల గెటప్స్‌లో హీరో కనిపిస్తున్నారు. పై భాగంలో శివుడిగా హీరో పవర్ ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఫస్ట్ గ్లింప్స్, భక్తి గీతం 'నమోః' ఇప్పటికే యుట్యూబ్‌లో ట్రెండ్ అవుతూనే ఉంది. ఇక రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేయడంతో టీం ప్రమోషన్స్ మీద ఫోకస్ పెట్టనుంది. విరాట్ కర్ణ, నభా నటేష్, ఈశ్వర్య మీనన్, రిషబ్ సాహ్ని, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మంజ్రేకర్, జయప్రకాష్, మురళీ శర్మ, అనసూయ భరద్వాజ్, బి.ఎస్ అవినాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ సౌందర్ రాజన్ ఎస్, సంగీతం అభినేద్ కుమార్ అల్లే, మాటలు కళ్యాణ్ చక్రవర్తి, ఎడిటర్: ఆర్సి ప్రణవ్, కొరియోగ్రఫీ బృందా, గణేష్ ఆచార్య, ట్రెస్ వర్మ, సాహిత్యం: కాసర్ల శ్యామ్, కళ్యాణ్ చక్రవర్తి, శ్రీహర్ష ఈమని.

## 'రామ్ చరణ్ బర్త్ డే' సందర్భంగా
# 'పెద్ది' స్పెషల్ గ్లింప్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ శుక్రవారం తన పుట్టినరోజు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'పెద్ది' నుంచి బర్త్ డే, శ్రీరామ నవమి పురస్కరించుకుని అభిమానులకు ఒక పవర్‌ఫుల్ కానుకను అందించారు. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తుండగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో రూపొందుతున్న 'పెద్ది' పెహెల్వాన్ గ్లింప్స్‌ను నిర్మాతలు రిలీజ్ చేశారు. 'కుస్తీ అంటే బలంతో బ్యాటకు ఎదురెళ్లే ఆట కాదురా.. పాణంతో సావుకు ఎదురెళ్లె ఆట' అనే పవర్ ఫుల్ వాయిస్‌తో గ్లింప్స్ మొదలౌతుంది. ఆ తర్వాత విజువల్స్ ఆడియన్స్‌ని కుస్తీ పోటీలోకి తీసుకువెళ్తాయి. అక్కడ దుమ్ము, చెమట, సంకల్ప బలం ప్రతి ఫ్రేమ్‌లోనూ కట్టిపడేశాయి. కఠినమైన శిక్షణను తట్టుకుంటూ, ఇటుక గోడలను ఎక్కుతూ, ఇసుక సంచులను ఎత్తుతూ, అచంచలమైన సంకల్పంతో గదలో ప్రావీణ్యం సంపాదిస్తున్న పెద్ది పహిల్వాన్ ఎదుగుదల అద్భుతంగా వుంది. రామ్ చరణ్ ట్రాన్స్‌ఫర్మేషన్ మెస్మరైజింగ్‌గా ఉంది. సిక్స్‌ప్యాక్ అబ్స్, దృఢమైన కండరాలు, ఇంటెన్స్ ప్రజెన్స్ తో నిజమైన పహిల్వాన్‌గా ఒదిగిపోయారు. రామ్ చరణ్ గదను పట్టుకొని హనుమంతుడిలా కనిపించిన సన్నివేశం అద్భుతం, శ్రీరామ నవమి ఆధ్యాత్మిక ఉత్సాహానికి సరిగ్గా సరిపోయేలా వుంది. . ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోందని చిత్ర బృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఇషాన్ సక్సేనా, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వి. వై. ప్రవీణ్ కుమార్.

## 17న ప్రపంచ వ్యాప్తంగా 'పాపం ప్రతాప్'

టాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ తిరువీర్ ప్రధాన పాత్రలో, ఎస్.పి. దుర్గ నరేష్ దర్శకత్వంలో రూపొందిన వైవిధ్యభరిత చిత్రం 'పాపం ప్రతాప్'. కృషి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి సంయుక్తంగా నిర్మించారు. వరుస బ్లాక్ బస్టర్స్తో ఆడియన్సును అలరిస్తున్న ఈటీవి విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ నుంచి రాబోతోంది. ఇప్పటివరకు ప్రేమలో గెలిచాం.. పెళ్లి తర్వాత ఆ ప్రేమ ఎలా ఉంటుందో చూద్దాం అనుకుంటున్న ఓ జంట చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందింది. 'రేపటి నుంచి మీ ఇద్దరి మధ్య ఏ గొడవైనా జరిగినా.. ఆ గొడవ వల్ల నా పరువు పోయినా.. గుర్తుపెట్టుకో నీ బతుకు నా చేతిలో చేతబడి బొమ్మేరోయ్' అంటూ హీరో తండ్రి డైలాగ్తో ఆసక్తికరంగా టీజర్ ఉంది. ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్లో నిర్మాత రుద్రదేవ్ మాదిరెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్ దుర్గ నరేష్ స్టోరీ చెప్తుంటే ఫస్టాఫ్ నెరేషన్లో ఆయన ప్యాషన్, హార్డ్ వర్క్ అర్థమయ్యాయి. గడ్డం రాకేష్ రెడ్డి లాంటి పార్ట్నర్ ఉంటే సినిమా ఈజీగా చేయొచ్చు. ఇండస్ట్రీలో నేను ఎవరికీ తెలీదు. ఆయనే మొత్తం నడిపించారు. తిరువీర్ అమేజింగ్ ఆర్టిస్ట్. ఈటీవీ విన్ నుంచి సాయి బాగా సపోర్ట్ చేశారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్ కిషోర్ వల్లే ఇంత మంచి అవుట్పుట్ వచ్చింది. నిర్మాత గడ్డం రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఈటీవీ విన్తో ఇది నా సెకెండ్ ప్రాజెక్ట్. సాయికి, నితిన్ కి థ్యాంక్యూ వెరీమచ్. బాపినీడుకి స్పెషల్ థ్యాంక్స్. ఈ సినిమాలో రాశి, అజయ్ ఘోష్, అవసరాల శ్రీనివాస్, రఘు బాబు ఇలా చాలా మంచి కాస్ట్ ఉంది. అప్పట్లో జంధ్యాల సినిమాలో చూసినట్లు ఈ సినిమాలో నటీనటులను చూస్తారు. థియేటర్లలో నవ్వులు గ్యారెంటీ సినిమా ఇది. ఈ సినిమా చాలా బాగా ఆడితే ఇంకా ఎన్నో మంచి సినిమాలు చేస్తాం. మా సంస్థ నుంచి కొత్త వాళ్లనే ఎంకరేజ్ చేస్తాం అని తెలిపారు. మూవీ డైరెక్టర్ దుర్గ నరేష్ మాట్లాడుతూ రామోజీ రావుకి నేను జీవితాంతం రుణపడి ఉంటా. నా జర్నీ 2013లో మొదలైంది. అప్పటి నుంచి యుద్ధం చేస్తూనే ఉన్నా. నేను ఇక్కడ ఇన్వెస్ట్ చేసింది ఏజ్ మాత్రమే. నా లైఫ్ దీని మీద పెట్టేశాను. నాకు ఎక్కడ ఇబ్బంది కలిగినా సినిమా ఆపుకుంటూనే వచ్చా. సినిమా ఫెయిల్యూర్ అవుతుందనే చోట నేను చేయలేదు. ఎలాగైనా హిట్ కొట్టాలనే టార్గెట్తోనే నిలబడి ఉన్నా. ఈ రోజు గ్యారెంటీ ఇస్తున్నా.. పాపం ప్రతాప్.. మామూలు సినిమా అవదు. రాసి పెట్టుకోండి.. ఏప్రిల్ 17న మీకు టీజర్ను మించిన ఫన్ ఇస్తుంది. ఈ సినిమా చేస్తున్నప్పుడు నాకు మా నాన్న గుర్తొచ్చారు. ఈ సినిమా ఫ్యామిలీ అంతా కలిసి కూర్చుని చూసే సినిమా. థియేటర్లలో కలుద్దాం అని చెప్పారు. ఈ ప్రెస్ మీట్లో డైరెక్టర్ ప్రవీణ్ కండ్రేగుల, యాక్టర్ ప్రసాద్ బెహరా, ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ పాల్గొన్నారు.



## యాక్షన్ నేపథ్యంలో 'బ్యాడ్ బాయ్ కార్తీక్'



హీరో నాగ శౌర్య అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తిక్'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. శ్రీ వైష్ణవి ఫిలమ్స్ బ్యానర్ శ్రీనివాస రావు చింతలపూడి నిర్మాణంలో, నూతన దర్శకుడు రామ్ దేశిన (రమేష్) దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. మాస్ యాటిట్యూడ్తో నిండిన ఈ సినిమా టీజర్, చిత్రంపై ఉన్న అంచనాలను మరింత పెంచింది.వేసవిలో విడుదలయ్యే భారీ చిత్రాలలో ఒకటిగా 'బ్యాడ్ బాయ్ కార్తిక్' ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర నిర్మాతలు ప్రకటించారు. జీ స్టూడియోస్ తో ఈ భాగస్వామ్యం సినిమా క్రెడిబిలిటీని పెంచడమే కాకుండా, రిలీజ్కు ముందే మంచి బజ్ను కూడా తీసుకువచ్చింది.ఈ సినిమాలో నాగ శౌర్య సరసన విధి కథానాయికగా నటిస్తుండగా, శ్రీదేవి విజయకుమార్ ఆయన సోదరి పాత్రలో కనిపించనున్నారు. సముద్రఖని, నరేష్ వి.కె. కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి ఫైట్స్ సుప్రీమ్ సుందర్, పృథ్వి, కొరియోగ్రాఫర్లు: రాజు సుందరం, శోబి మాస్టర్, విజయ్ పోలంకి, శిరీష్, సాహిత్యం: చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, కృష్ణకాంత్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: శంకర్.

## స్వచ్ఛంద సంస్థలకు మెగా విరాళం

### తెలంగాణ సర్కార్ ఇచ్చిన రూ.పదిలక్షలు వివిధ సంస్థలకు సహాయం



ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేతుల మీదుగా పది లక్షల నగదు బహుమతితో పాటు ఎన్టీఆర్ అవార్డును అందుకున్న చిరంజీవి, ఆ మొత్తాన్ని తన చిరకాల సామాజిక సంక్షేమ లక్ష్యానికి అనుగుణంగా ఉన్న ఐదు స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చారు.వారి దైనందిన అవసరాలకు మద్దతుగా చిరంజీవి సర్వ్ ఫౌండేషన్కు విరాళం అందించారు. 'గేమ్ ఛేంజర్' షూటింగ్ సమయంలో చరణ్ను కలిసిన ఆ వృద్ధులు ఆయన పుట్టినరోజును ఘనంగా జరుపుకోవాలని ఆత్రుతగా ఎదురు చూస్తున్నందున, వారి కోరికను నెరవేరుస్తూ చిరంజీవి 30 మంది నివాసితులను బ్లడ్ బ్యాంక్కు ఆహ్వానించి, వారికి కొత్త బట్టలు బహుమతిగా ఇచ్చి, పండుగ విందుకు ఆతిథ్యం ఇచ్చారు. దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సాధికారత కల్పించడంలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న దేవనార్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్కు మద్దతు లభించగా, అనాథ పిల్లల సంరక్షణను బలోపేతం చేయడానికి వాల్మీకి ఫౌండేషన్ , నయశ్రీ ఫౌండేషన్లకు సహాయం అందజేశారు. ఈ సందర్భానికి మరింత కరుణను జోడిస్తూ, క్యాన్సర్తో ధైర్యంగా పోరాడుతున్న ఒక యువతి చికిత్సకు ప్రత్యేకంగా సహాయపడటానికి చిరంజీవి బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం కూడా ఇచ్చారు.

# సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా...

### రాష్ట్ర, జిల్లాల్లోనూ కమిటీల ఏర్పాటు.. నోడల్ ఆఫీసర్ల నియామకం
### పిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పరిస్థితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సిఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాలు.. బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు సీఎం తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పంపుతున్నట్లు సిఎం వెల్లడించారు. ప్రతి బంక్‌లో స్టాక్ ఎంత ఉంది.. ఎంత వినియోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సిఎం తెలిపారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందని, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సిఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సిఎం తెలిపారు. తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని.. పునరుత్పాక విద్యుత్ ఉత్పత్తి పెంచుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఇవిల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్ ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి పిఎం మోదీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకుపైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రెట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఇవి బస్సులనే వినియోగించనున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి పాల్గొన్నారు



# కమనీయం.. రమణీయం



(మొదటి పేజీ తరువాయి)

భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. అభిజిత్ లగ్నంలో లోకమంతా ఎదురు చూస్తుండగా సీతమ్మ వారి మెడలో శ్రీరామ చంద్రుల వారు మాంగళ్య ధారణ చేశారు. ఈ సందర్భంగా మిథిలా స్టేడియంలో భక్తిభావంతో తొనికిసలాడింది. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీరు, అన్నప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి కళ్యాణ వేడుకలో పాల్గొని స్వామిని దర్శించి తరించారు. అంతకుముందు ముఖ్యమంత్రి దంపతులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముహూర్త బలాన రూ.351 కోట్ల ఆలయ విస్తరణ తొలదశ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క దంపతులు, ఇంచార్జ్ మంత్రి వాకటి శ్రీహరి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ (సీతక్క),మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పి రోహిత్ రాజ్, ఐటిడిఏ పిఓ రాహుల్, అదనపు కలెక్టర్లు వేణుగోపాలరావు, విద్యాచందన, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఏలు డా.తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.



## రాష్ట్రాలతో సమన్వయం
(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ కూడా తన గల్ఫ్ పొరుగు దేశాలు, ఇజ్రాయెల్‌పై కాల్పులు జరిపింది. ఈ సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రులలో రేవంత్ రెడ్డి (తెలంగాణ), ఎన్ చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్), యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), భగవంత్ మాన్ (పంజాబ్), భూపేంద్ర పటేల్ (గుజరాత్), ఒమర్ అబ్దుల్లా (జమ్ముకశ్మీర్), సుఖ్వీందర్ సింగ్ సుఖు (హిమాచల్ ప్రదేశ్), పేమా ఖండూ (అరుణాచల్ ప్రదేశ్) తదితరులు ఉన్నారు. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా కూడా పాల్గొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) కారణంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొనలేదు. ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ముఖ్య కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది. ఈనెల 25న పశ్చిమాసియా పరిస్థితిపై రాజకీయ పార్టీల నాయకులకు వివరించడానికి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో, పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి సవివరంగా వివరించారు. 23న లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ, పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ఏర్పడిన క్లిష్టమైన ప్రపంచ పరిస్థితులు చాలా కాలం పాటు కొనసాగే అవకాశం ఉందని ప్రధాన మంత్రి అన్నారు. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో దేశం ఎలా ఐక్యంగా నిలబడిందో, అదే విధంగా ఇప్పుడు కూడా సంసిద్ధంగా, ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 'తీరప్రాంత భద్రత, సరిహద్దు భద్రత, సైబర్ భద్రత లేదా వ్యూహాత్మక స్థావరాలు, ఇలా అన్నింటి భద్రతను పటిష్టం చేస్తున్నాం' అని ఆయన చెప్పారు. ఓర్పు, సంయమనం, అప్రమత్తత పాటించాలని ప్రజలను కోరుతూ, తప్పుడు ప్రచారాలు చేయడం, బ్లాక్ మార్కెటింగ్ లేదా నిల్వలు చేయడం ద్వారా పరిస్థితిని తమకు అనుకూలంగా మలచుకోవాలని చూసే వారి పట్ల జాగ్రత్త వహించాలని మోదీ హెచ్చరించారు. అటువంటి శక్తులపై కఠినమైన పర్యవేక్షణ, తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఆయన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. దేశ సమిష్టి సంకల్పంపై తనకు అచంచలమైన విశ్వాసం ఉందని వ్యక్తం చేస్తూ, లోక్‌సభలో తన ప్రసంగంలో ప్రధానమంత్రి, ఈ దేశంలోని ప్రతి ప్రభుత్వం, ప్రతి పౌరుడు కలిసి నడిచినప్పుడు, 'మనం ప్రతి సవాలును ఎదుర్కోగలం, ఇదే మన గుర్తింపు, ఇదే మన బలం' అని కూడా అన్నారు.

## ముహూర్తం ఖరారు
(మొదటి పేజీ తరువాయి)

కొత్త పార్టీ ముందుకెళుతుందన్నారు. రాజకీయ కొత్త ఒరవడికి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న కొత్త పార్టీ నాంది పలుకుతుందన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కొత్త పార్టీ ప్రజల కోసం పని చేస్తుందన్నారు. కొత్త పార్టీ అవశ్యకత ఉన్నందున తాను పార్టీ పెడుతున్నానన్నారు. 28 రోజుల్లో కొత్త పార్టీ కార్యాచరణ రూపొందించి మీ ముందుకు వస్తుందని, ఆశీర్వదించి ఆదరించాలని కోరారు. జిల్లాకున్న అనుబంధంతో తాను జిల్లా కోడలిగా ఇక్కడి నుంచి పార్టీ ప్రకటన చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని నిజామాబాద్ మట్టిలో పుట్టిన ఏ ఆలోచనైనా సక్సెస్ అయిందన్నారు. ఈ గడ్డపై తెలంగాణ ఉద్యమం కూడా పురుడు పోసుకుందన్నారు. తెలంగాణ బిడ్డగా అనేక అంశాల మీద కొట్లాడిన జాగృతి ద్వారా ఎన్జీఓగా ప్రజాసమస్యలపై పని చేయడం జరిగిందన్నారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత తెలంగాణ రాక ముందు ప్రజాసమస్యలపై గళం ఎత్తానన్నారు. ప్రజల కోసం అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేస్తానని, గల్లీలో కష్టపడుతానని చెప్పారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పు తెచ్చే వరకు కూడా పట్టు వదలకుండా పోరాటం చేస్తానని ఆమె చెప్పారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పు తెచ్చే వరకు కూడా పట్టు వదలకుండా పోరాటం చేస్తానని చెప్పారు.

## జిఎస్‌టి కుంభకోణం (మొదటి పేజీ తరువాయి)

విచారణలో బట్టబయలైంది. ఎలాంటి ఎటువంటి వస్తువుల సరఫరా, సర్వీసు లేకుండా కేవలం ఫేక్ డాక్యుమెంట్లతో రూ.1,472 కోట్ల విలువైన కృత్రిమ లావాదేవీలను సృష్టించినట్లుగా తెలుస్తోంది. నకిలీ లావాదేవీలతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జిఎస్‌టిని ఎగ్గొట్టడమే కాకుండా, తప్పుడు పద్ధతిలో రూ.217 కోట్ల మేర ఐటిసిని క్లెయిమ్ చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో డిజిజిఐ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో కీలకమైన డిజిటల్ సాక్ష్యాధారాలు, నకిలీ ఇన్వాయిస్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సైబర్ క్రైమ్ గుట్టు రట్టు (మొదటి పేజీ తరువాయి)

బ్యాంకు ఖాతాలను, ఏటిఎం కార్డులను , లాగిన్ వివరాలను ఇతరులకు ఇవ్వవద్దని, తెలియని వ్యక్తుల పేరుతో బ్యాంకు అకౌంట్లు తెరిచి ఇస్తే వారు సైతం నేరస్తులుగా పరిగణించబడతారని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, తదుపరి దర్యాప్తులో మరిన్ని ఆసక్తికర విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని సిపి తెలిపారు. అరెస్ట్ చేయబడిన వారిలో బండారి సాయిరాం(30), వెల్గటూర్, జగిత్యాల, అనుమాండ్ల రంజిత్ (36) గోపాల్‌పూర్, బుగ్గారం, జగిత్యాల, అలిగేటి మల్లేశం (37), ధర్మారం, పెద్దపల్లి, బోగ రాకేష్ (35) జగిత్యాల, బండి ప్రణయ (25), వెదిరె, రామడుగు, కరీంనగర్., బ్యాంకు అధికారుల్లో భువనగిరి కళ్యాణ్ (52), హన్మకొండ, ఆర్‌బిఎల్ బ్యాంకు మేనేజర్, అయేషాబేగం (30) కరీంనగర్‌లు అరెస్టయ్యారు. బ్యాంకు ఖాతాదారుల్లో విభూది రాంకుమార్(ధర్మరం, పెద్దపల్లి), నతర్ల శ్రీనివాస్( లక్ష్మి పూర్, జగిత్యాల), కర్రె రాజు (వరంగల్), కల్లెడ మహేందర్ (జగిత్యాల), కొండ్ర నరహరి(జగిత్యాల), కల్లెడ రాజేష్ (జగిత్యాల)లు అరెస్టయినట్లు వెల్లడించారు.

## ప్లీనరీ సమావేశాలు ప్రారంభం
(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజులపాటు ప్లీనరీ జరుగుతుంది. ఈ సమావేశాలకు 25 రాష్ట్రాల నుండి దాదాపు 300 మంది ఎన్నికైన ప్రతినిధులు హాజరవుతున్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ప్లీనరీ సమావేశాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించి ప్రసంగిస్తారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గౌరవ అతిథిగా పాల్గొంటారు. మూడు రోజుల సమావేశాల్లో ఐజెయు జాతీయ అధ్యక్షుడు , తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పూర్వ సభ్యులు ఐజెయు సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ, యూనియన్ సీనియర్ నేతలు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పూర్వ సభ్యులు ఎస్.ఎన్.సిన్హా, దేవులపల్లి అమర్, ఎం. ఎ.మాజిద్, ఇటీవల జరిగిన జాతీయ ఎన్నికల్లో ఐజెయు సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయిన ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన సీనియర్ పాత్రికేయుడు డి.సోమసుందర్, ఐజెయు కార్యదర్శి వై. నరేందర్‌రెడ్డి, ప్లీనరీ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తున్న ఎ.పి.యు.డబ్ల్యు.జె. అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కే.జయరాజ్ తదితరులు పాల్గొంటున్నారు. లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) చీఫ్ పాట్రన్‌గా, మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షులుగా, ఐ.వి.సుబ్బారావు ప్రధానకార్యదర్శిగా ఏర్పడిన ఆహ్వాన సంఘం ప్లీనరీని విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లకు విజయవాడ ప్రెస్ క్లబ్, ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్, సామ్నా, ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ సంఘాలు తోడ్పాటు ఇస్తున్నాయి. ప్లీనరీ సందర్భంగా విజయవాడలోని ఎ.పి.యు.డబ్ల్యు.జె. ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని మరమ్మత్తులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com